మార్చి
2020

167

సంపుటి : 14 సంచిక : 11 వెల రు. 10/-


## ఈ సంచికలో........

భారత విప్లవ వెలుగు దివ్వెలు
భగత్‌సింగ్ సాక్షిగా వందేళ్ల గమనం
నాన్నా, ఎందుకిలా చేశారు?
విప్లవం ఎందుకు?
సింధు ప్రజల వాణిజ్యం
కరోనా వైరస్ కట్టడిలో చైనా ఆదర్శం
ముస్లింలపై ఆర్ఎస్ఎస్ అసత్య ప్రచారం
విద్య సరుకు కాదు ప్రాథమిక హక్కు
కార్మికవర్గమే విప్లవానికి నాయకత్వం వహించగలదు
కార్యాచరణ ముసాయిదా

# కార్యాచరణకు ముసాయిదా

మీరట్ కుట్రకేసు విచారణ జరుగుతుండగా, విచారణను ఎదుర్కొంటున్నవారి ఉమ్మడి ప్రకటన యొక్క ముసాయిదా కాపీలు కేంద్రం నుండి ఇంకా బయటికి వెలువరించక ముందే భారత కమ్యూనిస్టు పార్టి తన కార్యాచరణ ముసాయిదాను సిద్ధం చేసుకుంది. 1931 మార్చిలో కరాచీలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలలో దీని కాపీలను పంచిపెట్టింది. కొమిన్‌టర్న్ తను ప్రచురిస్తున్న ఐ ఎం పి ఆర్ ఇ ఒ ఆర్‌లో ఈ పత్రం మొత్తాన్ని ముద్రించింది. వ్యవసాయక విప్లవాన్ని, సామాజిక అసమానతలు తొలగించడాన్ని అనుసంధానం చేయడం పైనే సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట విజయం ఆధారపడి ఉంటుందని మార్క్సిజం లెనినిజం ఆధారంగా రూపొందిన ఈ పత్రం స్పష్టం చేసింది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్రం కోసం జరుగుతున్న ఈ పోరాటంలో అన్ని తరగతుల వారు మమేకం కావాలని పిలుపునిచ్చింది. కార్యాచరణ ముసాయిదాలోని కొన్ని ముఖ్యమైన భాగాలను ఈ కింద ఇస్తున్నాము.

"బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశాన్ని విముక్తి చేయడానికి జరిగే పోరాటానికి వ్యవసాయక విప్లవం మూలాధారం కావాలి.'' జాతీయ సంస్కరణవాదుల నుండి కార్మికవర్గాన్ని, రైతులను, పట్టణ పేదలను దూరం చేసి, వారిని సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ పోరాటాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాల వైపుకు మళ్లించడానికి కార్మికవర్గం తరపున ఉండే కమ్యూనిస్టు పార్టీ అవసరం ఉంది. భారత కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గ పార్టీ. సోషలిజాన్ని ఆ తరువాత కమ్యూనిజాన్ని సాధించడమే దీని అంతిమ లక్ష్యం. ఇతర పెట్టుబడిదారీవర్గ, పెట్టి బూర్జువా వర్గ పార్టీల, గ్రూపుల కార్యక్రమాలు, ఆలోచనల కన్నా కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం భిన్నంగా ఉంటుంది. పెట్టుబడిదారీ, పెట్టి బూర్జువా వర్గ పార్టీలు భారతదేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయాలనుకుంటే కమ్యూనిస్టు పార్టీ సోషలిస్టు పంథాని అభివృద్ధి చేయాలని దఅఢంగా విశ్వసిస్తున్నది.



బి.టి.రణదివే

ఈ మార్గదర్శక సూత్రాల ఆధారంగా భారతదేశంలో ప్రస్తుతమున్న విప్లవస్థాయిని బట్టి భారత కమ్యూనిస్టు పార్టీ కొన్ని లక్ష్యాలను ముందుంచింది.

1. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను పోరాటాల ద్వారా పారద్రోలి భారతదేశం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలి. అన్ని రకాల అప్పులను (విదేశీ స్వదేశీ )రద్దు చేయాలి. బ్రిటిష్ వారికి చెందిన అన్ని పరిశ్రమలు, బ్యాంకులు, రైలు మార్గాలు, సముద్ర, జల రవాణా మార్గాలు, తోటలు జాతీయ ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలి.

2. సోవియట్‌లు గల ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి. వేరుపడడంతో సహా మైనారిటీ జాతులకు, స్వీయ నిర్ణయాధికార హక్కు ఉండాలి. భారతదేశం కార్మిక, కర్షక సర్వ సత్తాక సమాఖ్యగా ఏర్పడాలి.

3. భూస్వాములకు, సంస్థానాధీశుల, చర్చిలకు, బ్రిటిష్ ప్రభుత్వానికి, అధికారులకు, వడ్డీవ్యాపారులకు చెందిన భూములు, అడవులు, ఇతర ఆస్తులన్నీ ఏ రకమైన పరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకోబడతాయి. వాటిని కష్టజీవులకు పంపకం చేయటం జరుగుతుంది. అన్ని బానిస ఒప్పందాలను రద్దు చేయాలి, బ్యాంకులకు, వడ్డీ వ్యాపారులకు రైతులు చెల్లించవలసిన అప్పులన్నీ రద్దు చేయాలి.

4. ఎనిమిది గంటల పనిదినం అమలు చేయబడుతుంది. కార్మికుల పని పరిస్థితులలో విప్లవాత్మక మార్పు తీసుకురావడం జరుగుతుంది. జీతాలు పెంచబడతాయి. నిరుద్యోగులకు రాజ్యం భృతి ఇస్తుంది.

'' సాధారణ ప్రజల ప్రయోజనాలు వ్యక్తపరిచే ఈ ముఖ్యమైన డిమాండ్ల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుంది. ఈ విజయాలు సాధించడం వలన సోషలిస్టు రాజ్యం సాధించే దిశగా పురోగమించే అవకాశం ఏర్పడుతుంది.

"సామ్రాజ్యవాదులకు, భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కష్టజీవులందరు ఐక్యవేదిక ఏర్పాటు చేసుకోవాలని, బ్రిటిష్ ప్రభుతం, దేశీయదోపిడీ దారులు చేసే వంచన, మోసాలకు భారతదేశ కార్మికులు, కర్షకులు, ముస్లింలు గురి కావద్దని భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తున్నది. వివిధ జాతులు, మతాలు, నమ్మకాలు గల కష్టజీవులను ఒకరి పైకి ఒకరిని ఎగదోస్తుంటారు. వారి మధ్య వైరాలు సృష్టిస్తుంటారు. ఇటువంటి విచ్ఛిన్నకర విధానాలకు లొంగ కూడదని, బ్రిటిష్ వారి చేత, దేశీయ దోపిడీదారుల చేత వంచించబడుతున్న, అంటరానివారితో సహా అణగారిన ప్రజలలో, శ్రమజీవులలో ఏ ఒక్కరూ, ఐక్య సంఘటనలకు భంగం కలిగించే అవకాశం ఇవ్వకూడదని భారత కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

"కార్మికవర్గం తన రాజకీయ, ఆర్థిక డిమాండ్లను సాధించుకోవడానికి, ప్రజలందరూ పాల్గొనడానికి వీలయిన విప్లవ కార్యక్రమాలను, కార్మికుల వర్గ పోరాటాలను, రూపొందించుకోవాలని - మూకుమ్మడిగా రైతులు పన్నులు చెల్లించక పోవడం, పెద్ద ఎస్టేట్లు ఉన్న జిల్లాలలో భూస్వాములకు చెల్లింపులు నిలిపివేయడం వగైరా- తన మద్దతుదారులకు, సంఘాలకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ పోరాటాలలో పాల్గొనడానికి ఈ

(మిగతా 32వ పేజీలో)

# ఫాసిస్టు తరహా దాడులు

ఒకవైపు భారత పర్యటనకు వచ్చిన అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్‌ను భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆలింగనం చేసుకుంటూ ఉంటే మరోవైపు ఆయన అనుచరులు దేశరాజధానిలో తుపాకులు, ఇతర మారణాయుధాలతో మైనారిటీలపై దాడులు చేస్తూ, ప్రాణాలు తీస్తున్న దృశ్యాలు హిట్లర్ జర్మనీలోని ఫాసిస్టు మూకల దుశ్చర్యలను గుర్తుకు తెస్తాయి. ఢిల్లీలో నాలుగు రోజులపాటు ఆర్ఎస్ఎస్ అనుయాయులు మారణాయుధాలతో స్వేచ్ఛగా విహరిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తూ, ఆస్తులను ధ్వంసం చేస్తూ ఉంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడమే కాదు, పరోక్షంగా హంతక మూకలకు సహకరించారని మీడియా ఘోషించింది. ఉన్నత న్యాయస్థానమే పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ పోలీసులను నడిపించే కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా విఫలం చెందాడనీ, ఆయన రాజీనామా చేయాలనీ డిమాండ్లు వచ్చాయి. ఎవరెన్ని చెప్పినా కేంద్ర ప్రభుత్వం మాత్రం చలించలేదు. గూండాల దాడులు ఆగలేదు. పైగా హింసాకాండపై విచారణ చేస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయడం ద్వారా న్యాయవ్యవస్థ నుండి కూడా ఈ హింసాకాండకు అడ్డంకి లేకుండా చూసింది.

అందువల్ల ఇదేదో గూండాలు దాడులు చేస్తుంటే పోలీసులు నిర్లక్ష్యం వహించిన ఘటన కాదు. లేక చాలా మంది రాస్తున్నట్లు సిఎఎ వ్యతిరేక, అనుకూల వర్గాల మధ్య ఘర్షణ కాదు, మత ఘర్షణలు అంతకన్నా కావు. ఢిల్లీ దాడులు సిఎఎ వ్యతిరేక ఉద్యమాన్ని అణచివేయడానికి మైనారిటీలపై జరిగిన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత ఫాసిస్టు దాడులు. బిజెపి పూర్తి మెజారిటీతో అధికారంలోకి వస్తే దేశం ఎలా ఉండబోతుందో సిపిఐ(ఎం) రెండు దశాబ్దాల క్రితమే పార్టీ కార్యక్రమంలో హెచ్చరించింది. "బిజెపి అనేది ఒక మామూలు రాజకీయ పార్టీ కాదు. ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ మార్గదర్శకత్వం వహిస్తూ, ఆధిపత్యం చెలాయిస్తున్న పార్టీ. బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడు రాజ్యాధికారం, రాజ్య యంత్రాంగం పగ్గాలు ఆర్ఎస్ఎస్ చేతిలోకి వస్తాయి" అని అది పేర్కొంది. నేడు కేంద్ర ప్రభుత్వం తన మతతత్వ ఎజెండాను అమలు చేస్తున్న తీరు చూస్తుంటే పార్టీ కార్యక్రమం ఎంత దూరదృష్టితో చెప్పిందో అర్థమవుతుంది.

బిజెపి ప్రభుత్వం పూర్తి మెజారిటీతో రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత మైనారిటీలపై బహిరంగ దాడులకు దిగింది. కాశ్మీర్ విభజన, 370వ అధికరణం రద్దు, ట్రిపుల్ తలాక్‌పై చట్టం, రామజన్మ భూమి తీర్పు తరువాత నేరుగా ముస్లిం మైనారిటీలపై ఎక్కుపెడుతూ పౌరసత్వ సవరణ చట్టం, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను తీసుకువచ్చింది. ఈ వరస దాడులతో ముస్లింలలో ఆగ్రహం ప్రతిఘటనగా మారింది. మొదటి దశలో పెద్దగా స్పందించని ప్రజలు సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌ల విషయంలో కేంద్ర ప్రభుత్వ కుట్రలు గమనించి మతాలకతీతంగా ఉద్యమించారు. దేశంలోని అనేక నగరాల్లో లక్షల సంఖ్యలో ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, యువకులు, మహిళలు నిరసనగా వీధుల్లోకి వచ్చారు. ఢిల్లీలోని షహీన్ బాగ్‌లో 50 రోజులుగా మహిళలు రాత్రింబవళ్లు నిరసన దీక్ష చేపట్టగా దేశంలోని అనేక నగరాల్లో షహీన్ బాగ్‌లో వెలిశాయి, వెలుస్తూనే ఉన్నాయి. హిందూత్వ ఎజెండాను దేశంమీద నిర్నిబంధంగా అమలు చేయాలనుకున్న ఆర్ఎస్ఎస్-బిజెపి కుట్రలకు ప్రజాఉద్యమం బ్రేకు వేస్తోంది.

సిఎఎ-ఎన్ఆర్‌సి వ్యతిరేక ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి సామ,దాన,భేదోపాయాలతో శతవిధాలా ప్రయత్నించిన మో-షా (మోడీ-అమిత్ షా) ద్వయం ఇవేవీ ఫలితమివ్వక పోవడంతో దండోపాయానికి దిగింది. హిందూత్వ శక్తులు జెఎన్‌యు ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఉపయోగించిన పద్ధతినే మరింత అమానుషంగా అమలు చేశాయి. ఒక పథకం ప్రకారం గూండాలను పోగు చేశారు. యుపి నుండి గూండాలతోపాటు తుపాకులు, మారణాయుధాలు సమకూర్చారు. అల్లరి మూకలకు పోలీసుల నుండి భయం లేకుండా చేశారు. అన్ని వ్యవస్థలనూ తమ ఫాసిస్టు ఎజెండాకు అనుకూలంగా మార్చుకున్నారు.

అందువల్ల ఢిల్లీ దాడులు ఆర్ఎస్ఎస్-బిజెపి ఫాసిస్టు ఎజెండాలో ఒక భాగం మాత్రమే. ఈ దుష్టశక్తులకు వ్యతిరేకంగా ఢిల్లీ ప్రజలు అసాధారణ ఐక్యత ప్రదర్శించారు. ఈ ఐక్యతను దేశమంతటా బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

## ఈ సంచికలో...


1. కార్యాచరణకు ముసాయిదా......... 2

2. భారత విప్లవ వెలుగు దివ్వెలు
శివవర్మ......................... 4

3. భగత్‌సింగ్ సాక్షిగా వందేళ్ల గమనం
వి.శ్రీనివాసరావు ................ 7

4. నాన్నా ఎందుకిలా చేశారు?
భగత్‌సింగ్...................... 10

5. విప్లవం ఎందుకు?
భగత్‌సింగ్...................... 11

6. సింధు ప్రజల వాణిజ్యం
యం.వి.ఎస్. శర్మ ............. 16

7. కరోనా వైరస్ కట్టడిలో చైనా ఆదర్శం
ఎస్. వెంకట్రావు ................ 18

8. ముస్లింలపై ఆర్ఎస్ఎస్ అసత్య ప్రచారం
ఎ. కోటిరెడ్డి ..................... 22

9. విద్య సరుకు కాదు ప్రాథమిక హక్కు
సుబిన్‌డెన్నిస్ ..................... 26

10. కార్మికవర్గమే విప్లవానికి నాయకత్వం వహించగలదు
బి.వి.రాఘవులు................. 29



సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు, **9490099333**
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్ : కె.హరికిషోర్, 9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org



**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా: **రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# భారత విప్లవ వెలుగుదివ్వెలు

శివవర్మ

1926లో భగత్‌సింగ్, సుఖదేవ్, భగవతీచరణ్, యశ్‌పాల్ మొదలైనవారు లాహోరులో 'నవ జవాన్ భారత్ సభ' ( భారత యువజన సభ)ను స్థాపించారు. ఇది విప్లవోద్యమానికి ఒకవిధమైన బహిరంగ వేదిక. బహిరంగ సభలు, ప్రకటనలు, కరపత్రాలు మున్నగువాని ద్వారా విప్లవకారుల ఉద్దేశ్యాలనూ, అభిప్రాయాలనూ ప్రచారం చేయడమే దీని కార్యక్రమం! ప్రపంచవ్యాప్త సమస్యలైన దోపిడీ, దారిద్ర్యం, అసమానత్వం మొదలైన వాటిని వారు లోతుగా అధ్యయనం చేసి, భారతదేశానికి రాజకీయ స్వాతంత్ర్యమేగాక ఆర్థిక స్వాతంత్ర్యం కూడా అవసరమనే నిర్ణయానికి వచ్చారు. 'గారడీ దీపం' ద్వారా అమరవీరులైన విప్లవకారుల చిత్రాలను చూపి, వ్యాఖ్యానాల ద్వారా విప్లవోద్యమం గురించి ప్రచారం చేయడం కూడా 'నవజవాన్ భారత్ సభ' కార్యక్రమంగా వుండేది. అది ప్రచారానికి ఒక శక్తివంతమైన సాధనంగా ప్రసిద్ధి చెందింది.


భగత్‌సింగ్ కాన్పూర్ వచ్చినప్పుడల్లా ఇతర పుస్తకాలతోపాటు 'నవజవాన్ భారత్ సభ'కు సంబంధించిన కొంత సాహిత్యం కూడా తెచ్చేవాడు. రాధామోహన్, గోకుల్, సత్యభక్త్ వంటి వారు మా కామ్రేడ్స్ అందరిలోను సోషలిజంపట్ల ప్రేమాభిమానాలు కలిగించారు. భగత్‌సింగ్, శచీంద్రనాథ్ సన్యాల్ ద్వారా వీరిద్దరితోను పరిచయం 'కాకోరీ' సంఘటనకు ముందే వుండేది. ఈ నలుగురు సోషలిజం గురించీ, కమ్యూనిజం గురించీ ఎంతో చర్చించివున్నారు. కీర్తిశేషులు గణేశ శంకర్ విద్యార్థి నేతృత్వంలో మేము కాన్పూర్ కార్మికసంఘంలో కూడా శ్రద్ధ తీసుకోనారంభించాం. తర్వాత భగత్‌సింగ్ మా శ్రద్ధను పెంపొందింపచేసి- సోషలిస్టు గ్రంథాలను చదవడానికీ, దానిని గురించి చర్చించడానికీ మమ్మెంతో ప్రోత్సహించాడు.

భగత్‌సింగ్‌కు పూర్వం విప్లవకారులు ప్రజలతో ఇటువంటి విస్తృత సంబంధాల నేర్పరచుకోలేదు. అతడు ఖైదులోపడ్డ తర్వాత కూడా కోర్టులను తన భావ ప్రచారానికే ఉపయోగించుకున్నాడు. అతడు మంచి యోధుడేగాక, మంచి ప్రచారకుడుకూడా. కలం, గళం – ఈ రెండూ ప్రచారానికి రెండు ప్రధాన సాధనాలు. భగత్‌సింగ్ ఈ రెండింటినీ విజయవంతంగానే ఉపయోగించాడు. అతడు సంభాషణాచతురుడేగాక, మంచి వక్త కూడా! యువకులు, విద్యార్థులలో గారడీ దీపం కంటే అతడి ప్రసంగాలే సుప్రసిద్ధమైనవి.

అతనికి వ్రాయడమంటేనూ, చదవడమంటేనూ మహా ఇష్టం. అతను కాన్పూర్‌కు వచ్చేటప్పుడల్లా తనతో కొన్ని పుస్తకాలను తప్పక తెచ్చుకొనేవాడు. తర్వాత కాలంలో కూడా అజ్ఞాతవాసంలో అతనితో నేను కలిసినప్పుడు భగత్‌సింగ్ ఇరవై నాలుగ్గంటలూ పుస్తకాలతోనూ, పిస్టల్‌తోనూ వుండటం గమనించాను. అతని వద్ద ఒక్క పుస్తకం కూడా లేకుండిన సందర్భం నాకు జ్ఞాపకం లేదు.

సోషలిజం ఆ కాలంలో యుగ నినాదంగా వుంది. విప్లవకారులలో భగత్‌సింగే ఈ విషయంలో మొట్టమొదట ఆ నినాదాన్ని విన్నాడు, గుర్తించాడు. అతను తన యితర మిత్రులందరికంటే ముందున్నాడు.

భగత్‌సింగ్‌కు మునుపు దేశవ్యాప్తమైన విప్లవకారుల సంస్థ ఏదీ లేదు. బెంగాల్‌లో 'యుగాంతర్', 'అనుశీలన్' మున్నగు సంస్థలుండేవి. పంజాబ్‌లో 'గదర్' పార్టీ పని చేస్తుండేది. ఉత్తరప్రదేశ్, బీహారుల్లో ప్రధానంగా హిందూస్థాన్ ప్రజాతంత్ర సంఘం పని చేస్తుండేది. అమర వీరులను అందరూ సమానంగానే కీర్తించవచ్చు. కానీ వారిలో పరస్పర సహకారమేదీ వుండేది కాదు. భగత్‌సింగ్ అందరినీ ఏకంచేసి దేశవ్యాప్తమైన సంస్థ నొకదాన్ని స్థాపించాలనుకున్నాడు. ఈ ఉద్దేశ్యంతోనే అతను 1928వ సంవత్సరం సెప్టెంబర్‌లో ఢిల్లీలోని అన్ని ప్రాంతాలకు చెందిన విప్లవకారుల ప్రతినిధులతో ఒక సమావేశం ఏర్పాటు చేశాడు. ఆ సమావేశానికి ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, పంజాబు నుండి పదిమంది ప్రతినిధులు హాజరయ్యారు. బెంగాల్ విప్లవకారుల్లో చాలామంది అప్పుడు జైళ్ళలో వున్నారు. వెలుపలవున్న కొద్దిమంది మా సోషలిస్టు భావాలతోను, ప్రజాతంత్ర పద్ధతులతోనూ ఏకీభవించలేదు. అందువల్ల వారు ఢిల్లీ సమావేశంలో పాల్గొనడానికి నిరాకరించారు.



రచయిత భగత్‌సింగ్ సహచరుడు

పార్టీకి ఒక సైన్యాధ్యక్షుణ్ణి కూడా ఎన్నుకొనే విధానం అవలంబించాం. చంద్రశేఖర్ అజాద్ మొదటి పార్టీ సైన్యాధ్యక్షుడయ్యారు. సమావేశంలో అజాద్ పాల్గొనలేక పోయినప్పటికీ భగత్‌సింగ్, విజయకుమార్ సిన్హా ముందుగానే ఆయన్ను కలుసుకుని అన్ని విషయాలనూ చర్చించారు. వారి సూచనలను అజాద్ ఆమోదించాడు కూడా.

1928 అక్టోబర్ 30వ తేదీనాడు సైమన్ కమీషన్ లాహోర్ వచ్చింది. ఓ పెద్ద ప్రజాసమూహం నల్లజెండాలతో కమీషన్‌కు 'స్వాగతం' పలికింది. ప్రభుత్వాధికార్లు పిచ్చివారైపోయారు. పోలీసులు ప్రజల ఊరేగింపుపై లాఠీలతో విరుచుకుపడ్డారు. అప్పుడు జాతీయ నాయకుడైన లాలా లజపతిరాయ్ తీవ్రంగా గాయపడి, కొన్నాళ్ళ తర్వాత 1928 నవంబర్ 19న చనిపోయాడు. దీంతో దేశమంతా క్రోధావేశాలు వ్యాపించాయి. ప్రజలందర్నీ తీవ్ర దుఃఖం అలముకుంది. 'దేశ గౌరవాన్ని కాపాడుకోలేకపోయిన

అసహాయులైపోయామా మనం?' అనే ప్రశ్న ప్రతిచోటా విన్పించింది. లజపతిరాయ్ చనిపోయిన ఒక నెల తరువాత భగత్‌సింగ్, రాజగురు లాహోరు పోలీసు కేంద్ర కార్యాలయం నుంచి వెలుపలికి వస్తున్న డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ సాండర్స్‌ను తుపాకీతో కాల్చి చంపారు. సాండర్సే లాఠీతో లాలా లజపతిరాయ్‌ని చావబాదాడు.

విప్లవోద్యమ అవకాశాల గురించి భగత్‌సింగ్ తరచూ – ప్రతి రోజూ – కామ్రేడ్స్‌తో చర్చిస్తుండేవాడు. ఆ సమయంలోనే భారత వైస్రాయి ఒక ప్రకటన చేస్తూ– పార్లమెంటు ఆ రెండు బిల్లులను ఆమోదించకపోయినట్లయితే, తన విశేషాధికారాన్ని ఉపయోగించి ఆర్డినెన్స్‌లు జారీచేసి, వాటి నమలుపరుస్తానని ప్రకటించాడు. వార్తా పత్రికల్లో వైస్రాయి ప్రకటన రాగానే భగత్‌సింగ్ పార్టీ కేంద్ర కమిటీని సమావేశపరచి, ఎన్నికైన భారత ప్రతినిధులే ఆ దౌర్జన్యపూరితమైన బిల్లులను చట్టాలుగా చేశారని ప్రపంచానికి తెలియజెప్పడానికే వాటిని పార్లమెంటులో ప్రవేశపెడుతున్నారని వివరించి చెప్పాడు. కాబట్టి ఆ బిల్లుల నమలుపరచదలుచుకుంటే వైస్రాయి విశేషాధికారాలతోనే అమలుపరచవచ్చుగదా! ప్రభుత్వం చెవిటిదైపోయిందని భగత్‌సింగ్ చెప్పాడు. ఆ బిల్లులకు వ్యతిరేకంగా దేశమంతటా వినిపిస్తున్న నిరసన ధ్వనులు ప్రభుత్వానికి వినబడలేదన్నాడు. "మనం ప్రభుత్వానికి వినబడేట్లు చేయాలి" అని పేర్కొన్నాడు.

పారిశ్రామిక వివాదాల బిల్లుపై సభ్యులు ఓటింగులో పాల్గొన్నారు. సభాధ్యక్షుడు విఠల్‌భాయి పటేల్ ఓటింగ్ ఫలితం యిక ప్రకటించబోతారనగా ప్రభుత్వ పక్షపు వెనుక బెంచీ నుంచి ఒక పెద్ద శబ్దం వినబడింది. భవనమంతా పొగనిండిపోయింది. అందరూ నలువైపులకు పరుగులుతీశారు. పొగ కొంత తగ్గిన తర్వాత చూస్తే కొద్దిసేపటికి మునుపు సభ్యులతోను, ప్రేక్షకులతోను కిటకిటలాడిన పార్లమెంట్ భవనం నిర్మానుష్యంగా వుంది.

బాంబు పేలిన కొంతసేపటి తరువాత పోలీసులు అట్టహాసంగా అక్కడికి చేరుకున్నారు. ఒక సార్జెంటు ముందడుగు వేసి ఆ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నాడు. పార్లమెంట్ భవనం మరోసారి నినాదాలతో మారుమ్రోగింది.

భగత్‌సింగ్, బటుకేశ్వరదత్ ఇద్దరూ భవనంలో విసరి వేసిన కరపత్రాలలోని మొదటి

"పారిశ్రామిక వివాదాల బిల్లుపై సభ్యులు ఓటింగులో పాల్గొన్నారు. సభాధ్యక్షుడు విఠల్‌భాయి పటేల్ ఓటింగ్ ఫలితం యిక ప్రకటించబోతారనగా ప్రభుత్వ పక్షపు వెనుక బెంచీ నుంచి ఒక పెద్ద శబ్దం వినబడింది. భవనమంతా పొగనిండిపోయింది. అందరూ నలువైపులకు పరుగులుతీశారు. పొగ కొంత తగ్గిన తర్వాత చూస్తే కొద్దిసేపటికి మునుపు సభ్యులతోను, ప్రేక్షకులతోను కిటకిటలాడిన పార్లమెంట్ భవనం నిర్మానుష్యంగా వుంది."

పంక్తి ఇది: "చెవిటివారికి వినిపించడానికి పెద్ద శబ్దమే అవసరమవుతుంది." అయితే ప్రభుత్వం చెవిటివానివలె నటిస్తోంది. పార్లమెంట్‌లో దానికి మెజారిటీ వుంది. పారిశ్రామిక వివాదాల బిల్లును సభ ఆమోదించింది. అయినప్పటికీ ప్రజాభద్రతా బిల్లును సభలో ప్రవేశపెట్టే ధైర్యం దానికి లేకపోయింది ఆ బిల్లు ఆర్డినెన్సు రూపంలో దేశంపై రుద్దారు. భగత్‌సింగ్ వెదజల్లిన కరపత్రాలలో ఫ్రెంచి విప్లవాన్ని పేర్కొని, విప్లవ పార్టీ కార్యకలాపాలను సమర్థించటం జరిగింది. ప్రజాప్రతినిధులు తమ తమ ఓటర్ల వద్దకు తిరిగి వెళ్ళి, వారిని విప్లవానికి సన్నద్ధులు చేయుమని ఆ కరపత్రాలలో కోరటం జరిగింది.

పార్టీ ఈ ఇద్దరు కామ్రేడ్స్‌ను ఏ లక్ష్యానికై బలి ఇచ్చిందో, దాన్ని వారు బాధ్యతాయుతంగా నిర్వహించారు. న్యాయస్థానంలో భగత్‌సింగూ, దత్తూ ఆ సమయంలో ఇచ్చిన ప్రకటన ఒకవిధంగా విప్లవోద్యమ విధాన ప్రకటనగా భావించవచ్చు. ఢిల్లీ బాంబుదాడి కేసులో భగత్‌సింగ్‌కు, దత్తుకు యావజ్జీవ కారాగారావాస శిక్ష పడింది. ఇప్పుడు 'చక్రవర్తికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాడన్న' అభియోగంపై మాతోపాటు అతనిపై కేసు నడవాల్సి వుంది. చివరకు తీర్పు చెప్పేరోజు వచ్చింది. భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష విధిస్తారని మాకు ముందే తెలుసు. కానీ అది విన్నగానే నాకు కళ్ళు బైర్లుకమ్మాయి. నిన్నటివరకుండిన అనుమానం ఈ రోజు యథార్థమై మా ముందుకువచ్చి నిలబడింది.

తర్వాత 1931వ సంవత్సరం మార్చి 23న సంధ్యాసమయంలో ప్రభుత్వం భగత్‌సింగ్ నుంచి శ్వాసించే హక్కును అపహరించి, తన హింసాదాహాన్ని తీర్చుకుంది. అన్యాయానికీ, దోపిడీకీ వ్యతిరేకంగా తిరుగుబాటు పతాకాన్నెగురవేసిన మరో ముగ్గురు యువకుల జీవితాలు కటికవాని ఉరితో అంతమైపోయాయి.

### రాజ్‌గురు

ఢిల్లీలోని ఒక వ్యక్తికి పార్టీ మరణశిక్షను విధించింది. మరో కామ్రేడ్ సహాయం తీసుకుని ఆ మరణశిక్షను అమలుపరచే బాధ్యత నాపై పడింది. దీర్ఘ సంప్రదింపుల అనంతరం కాశీలో ఎవరో ఒక మరాఠీ కామ్రేడ్ వున్నట్టూ, అతనితో మాట్లాడండనీ ఎవరో సూచించారు. అతని పేరూ, అడ్రసూ తీసుకుని నేను కాశీ చేరాను.

నేను అతనిని కలిసి సంక్షిప్తంగా పార్టీ నిర్ణయం తెలిపి, ఈ కార్యంలో నాకు సహాయ పడవలసిందిగా రాజగురును కోరాను. నా ప్రతిపాదన విని, బిగుసుకుపోయిన అతని ముఖంలో సంతోషరేఖలు పొడసూపాయి. "పార్టీ నన్ను అర్హునిగా భావించడం నా అదృష్టం!" అని మెల్లగా అన్నాడతడు.

కొంతసేపాగి 'అలాగయితే నేను ఎప్పుడు, ఎక్కడికి చేరుకోవాలి?" అని ప్రశ్నించాడు రాజగురు. నేనతనికి కాన్పూర్ డి.ఎ.వి. కాలేజీ సైన్స్ బ్లాక్‌లో వున్న నా గది అడ్రస్‌ను ఇచ్చాను. వీలయినంత త్వరలో రమ్మని చెప్పాను. ఇంచుమించు ఒక వారం తర్వాత అతడు కాన్పూర్ వచ్చాడు. నేను రాజగురును అక్కడే వదలి మరో పిస్తోలు తేవడానికి లాహోరు వెళ్ళాను. లాహోరు నుంచి మూడవ రోజు నేను ఢిల్లీకి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి ఏడున్నర గంటలయింది. రాజగురు ఆ పనిమీదే వెళ్ళివుంటాడనుకుని, నేను నేరుగా అక్కడకే వెళ్ళాను. నగరం వెలుపలికి చేరుకోగానే చీకటి రాత్రిలో నలువైపులా పోలీసుల మోటార్లు సైకిళ్ళూ పరుగెడుతున్నాయి. పరిస్థితి విషమించిందని గ్రహించి నేను పాతకోటును చుట్టుకుని నగరానికి వచ్చేశాను. రాజగురు ఆ రాత్రి బసకు తిరిగి రాలేదు.

ఫలానా చోటున ఫలానా వ్యక్తిని ఎవరో చంపేశారని మరునాడు ఉదయం పత్రికల్లో చదివాను. మేము ఆ వ్యక్తిని శిక్షించాలనుకున్న చోటే ఆ హత్య జరిగింది. అయితే హతుని పేరు వేరుగా వుంది. అవకాశం

**"భగత్‌సింగ్ విజ్ఞప్తిపై కేంద్ర కమిటీ మరలా సమావేశమైంది. సుఖదేవ్ కూర్చుని వున్నాడే కానీ, నోరు తెరచి ఒక్కమాట మాట్లాడలేదు. భగత్‌సింగ్ వత్తిడిపై కేంద్ర కమిటీ తన నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. సుఖదేవ్ ఆ సాయంత్రమే ఎవరితోనూ చెప్పాపెట్టకుండా లాహోర్ వెళ్ళిపోయాడు. భగత్‌సింగ్ అరెస్టు తర్వాత తన మానసిక స్థితిని గురించి సుఖదేవ్ ఇలా వ్రాశాడు:"**

లభించిందనుకుని రాజ్‌గురు ఆ వ్యక్తికి బదులుగా వేరెవరినో పొరపాటుగా చంపేశాడని నేను అనుకున్నాను. పిస్తోలుతో కాల్చిన వ్యక్తి పట్టుబడలేదని కూడా నేను వార్తాపత్రికలలో చదివాను. ఢిల్లీలో ఇక వుండడం క్షేమం కాదనుకుని నేను ఆగ్రా మార్గంలో కాన్పూరుకు బయలుదేరాను. నేనక్కడికి చేరుకున్న రెండవ రోజున రాజగురు కూడా క్షేమంగా వచ్చిచేరాడు. కాని చనిపోయిన వ్యక్తి మేము చంపాల్సినవాడు కాదు. చీకటి రాత్రుల్లో ఇటువంటి పొరపాటు జరగడం సహజం. అదీగాక 'కాకోరీ' సంఘటన తర్వాత మా తరంలో సాహసానికీ, ధైర్యానికీ ప్రతీకగా నిలచినవాడు అతడే! పార్టీ రాజగురు విలువను గుర్తించింది. అతను విడదీయరాని మా కుటుంబ సభ్యుడైపోయాడు. తర్వాత మహారాష్ట్ర చేరాడు. అక్కడ వివిధ కార్యక్రమాలలో పాల్గొనేవాడు. అతనిని సిఐడిలు వెంటాడారు. ఒకరోజు రాజ్‌గురు, సావర్‌గావ్‌కర్ గది తలుపులు వేసుకొని బాగా నిద్రపోయారు. రాత్రి ఒంటిగంట ప్రాంతంలో ఎవరో మెట్లెక్కి గదివైపు వచ్చినట్లు అనిపించింది. ఆ రాత్రి ఉత్తర భారతదేశం నుండి కొంతమంది కామ్రేడ్స్ రావలసి వుంది. బహుశ వారే వచ్చారేమోనని ఇద్దరు మిత్రులూ అనుకున్నారు. ఇంతలో తలుపు తట్టిన చప్పుడయ్యింది.

''ఎవరూ?'' అని గదిలోపలినుంచి సావర్‌గావ్‌కర్ ప్రశ్నించాడు.

గది బయటనుంచి హిందీలో జవాబు వచ్చింది. మాట్లాడినవాడు పోలీసు ఇన్‌స్పెక్టర్ మిల్స్. ఇంతలోనే క్రింద నిలబడి వున్న ఇతర పోలీసులు కూడా పైకి వచ్చి వేశారు. రాజ్‌గురు కొద్దిగా తలుపు తెరిచి బయటకు చూడగానే పోలీసుల టార్చి వెలుతురు గదిలోపలికి ప్రసరించింది. ఆ క్షణమే వారు బలవంతంగా గదిలోకి జొరబడ్డారు. మన వారిద్దరికీ తమ ఆయుధాలు చేతికి తీసుకొనే వ్యవధి కూడా లేకపోయింది. కొద్ది సంఘర్షణ తరువాత ఇద్దరి చేతులకూ బేడీలు వేశారు.

మెల్లమెల్లగా తీర్పు చెప్పేరోజు రానే వచ్చింది. భగత్‌సింగ్, సుఖదేవ్‌లతోపాటు రాజ్‌గురుకు మరణదండన విధించారు. ఉరిశిక్షపడ్డ ఖైదీలనుంచే కొట్టులో బంధించినపుడు అతని పాత స్వభావం తిరిగొచ్చింది. అతని పరిహాసం, రెచ్చగొట్టే మాటలూ, ఆట - పాటలూ మళ్ళీ ప్రారంభమయ్యాయి.

చివరకు అతని జీవితంలోని ఆఖరిరోజైన 1931వ సంవత్సరం మార్చి 23వ తేదీ సాయంత్రం జైల్లో అతని కొట్టు తెరవగానే రాజగురు పెద్దగా నినాదాలిచ్చి, తాను వెళ్ళే సమయం ఆసన్నమైందని సహచరులకు సూచించాడు. సూర్యాస్తమయంతోపాటు రాజగురు తన ఇద్దరు మిత్రులతో కలిసి క్రొత్త ప్రపంచం నిర్మించటానికి వెళ్ళిపోయాడు.

### సుఖదేవ్

పార్టీలో 'విలేజర్' అనే పేరుతో ఒక వ్యక్తి వున్నాడని విన్నాను. ఒకరోజు భగత్‌సింగ్ పంపిన ఉత్తరం తీసుకొని 'విలేజరు' ముందు నోటీసేమీ లేకుండా కాన్పూరు డి.ఎ.వి. కాలేజీలోని నా గదిలో ప్రత్యక్షం అయాడు. ఢిల్లీ పార్లమెంటు భవనంపై బాంబు వేయాలని నిర్ణయించిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో సుఖదేవ్ పాల్గొనలేదు. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి తననే పంపాలని భగత్‌సింగ్ చాలా వత్తిడి చేశాడు. కానీ ఇతర సభ్యులెవరూ ఒప్పుకోలేదు. ఆ రోజుల్లో సాండర్స్ హత్యోదంతం సందర్భంగా పంజాబ్ పోలీసులు భగత్‌సింగ్ కోసం చాలా తీవ్రంగా వెదుకుతున్నారు. అతను వారి చేతికి దొరికితే ఉరి తప్పదు! పార్టీ కేంద్ర కమిటీ భగత్‌సింగ్ కోర్కెను త్రోసిపుచ్చి, ఆ కార్యానికై వేరే ఇద్దరు కామ్రేడ్స్‌ను పంపాలని నిర్ణయించింది. రెండు రోజుల తర్వాత సుఖదేవ్ రాగానే అతనికీ విషయం తెలిసింది. అతనీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. అరెస్టయితే భగత్‌సింగ్ మాత్రమే పార్టీ సిద్ధాంతాలనూ, లక్ష్యాలనూ, బాంబుదాడి యొక్క రాజకీయ ప్రాధాన్యతనూ కోర్టులో చక్కగా ఉద్ఘాటించగలడనీ, వేరెవరూ ఈ కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చలేరనీ అతనన్నాడు. ఆ విషయం గురించి కేంద్ర కమిటీ సమావేశానికి ముందే భగత్‌సింగ్, సుఖదేవ్ చర్చించుకున్నారు. అపుడు తానే ఈ పనిని నెరవేరుస్తానని సుఖదేవ్ భగత్‌సింగ్‌కు చెప్పాడు. ఇతర కేంద్ర కమిటీ సభ్యులను ఒప్పించలేకపోయినప్పుడు అతను భగత్‌సింగ్‌తో ఈ విషయంపై విడిగా మాట్లాడాడు. "నీలో అహంకారం నిండిపోయింది. పార్టీ భారమంతా నీ తలమీదే వున్నట్టు అనుకుంటున్నావు. నీకు చావంటే భయం వుంది. నీవు పిరికి పందవు! నీవు తప్ప 'పార్టీ'లో మరెవ్వరూ బాంబు దాడి ఉద్దేశాన్ని సరిగ్గా వ్యక్తీకరించలేరు అనేది నీ అభిప్రాయమైతే, నీకు బదులుగా ఇతరులను పంపడానికి ఎందుకంగీకరించావు?"


భగత్‌సింగ్ వత్తిడిపై కేంద్ర కమిటీ తన నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. సుఖదేవ్ ఆ సాయంత్రమే ఎవరితోనూ చెప్పాపెట్టకుండా లాహోర్ వెళ్ళిపోయాడు. భగత్‌సింగ్ అరెస్టు తర్వాత తన మానసిక స్థితిని గురించి సుఖదేవ్ ఇలా వ్రాశాడు:

"ఈ రోజు పార్లమెంటు భవనంపై జరిగిన బాంబుదాడి నా హృదయంలో కల్లోలాన్ని సృష్టించింది. ప్రపంచం నాకు శూన్యంగా కనబడసాగింది. వెలుపలి ప్రపంచానికి చెందిన సుఖ సంతోషాలన్నీ నానుంచి పరుగెత్తిపోయాయి. ఇక నాకెవరూ లేరనే, నా వారు వెళ్ళిపోయారనే, ఇక వున్నదల్లా నేను చేయవలసిన పని ఒక్కటే అని నాలో నేనే చెప్పుకోసాగాను. అందులో ఏకాంతమూ, ఆనందమూ లేవు. నేను ఎదుటివారితో మాట్లాడుతున్నప్పటికీ, నా మనసు దేనిగురించో ఆలోచిస్తూ వుండేది. నేను నవ్వుతున్నప్పటికీ అందులో సంతోషం లేదు. నేను ఒక మనిషిగాకన్నా ఒక యంత్రంలా పని చేస్తున్నాను. నా సర్వస్వం నానుంచి అపహరించబడిందని నేను భావిస్తున్నాను. నా కోర్కెను మన్నించే అతడు వెళ్లాడని నాకు తెలుసు. నేనే అతణ్ణి వెళ్ళిపొమ్మని చెప్పాను. అతడూ వెళ్ళిపోయాడు. చాలా దూరం వెళ్ళిపోయాడు నేను చేరుకోలేనంత దూరం వెళ్ళిపోయాడు.

దేశం కోసం తమ జీవితాలను అంకితం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ❋

# భగత్ సింగ్ సాక్షిగా... వందేళ్ళ గమనం

వి.శ్రీనివాసరావు



రచయిత సిపిఐ(యం) కేంద్ర కమిటీ సభ్యులు

చరిత్ర పునరావృతం కాదు. కానీ ఘటనలను పోలిన ఘటనలు జరుగుతూ ఉంటాయి. ఆ విధంగా గత చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలు మరో రూపంలో ఇప్పుడు కూడా జరుగుతున్నాయా అనిపిస్తుంది. 1919లో మొదటి ప్రపంచ యుద్ధం ముగింపు దశలో ఉండగా భారతదేశంలో స్వాతంత్రోద్యమం కొత్త ఉత్సాహంతో ఉరకలు వేసింది. దానికి ముఖ్యమైన కారణం ఆ యుద్ధ కాలంలో సామ్రాజ్యవాదం బలహీనపడి నూతన సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్ అవతరించడం. దాని ప్రభావంతో దేశదేశాలలో వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమాలు పుంజుకున్నాయి. దీన్ని అదుపు చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదం త్రిముఖ వ్యూహాన్ని అనుసరించింది. ఒకటి మాంటెగ్ – ఛెమ్స్‌ఫోర్డ్ సంస్కరణల ద్వారా భారతీయుల స్వాతంత్ర్య అభిలాషను గుర్తించామన్న భావనను కల్పించి సంతృప్తి పర్చడం. రెండు నిర్బంధ చర్యలతో ఉద్యమాన్ని అణచివేయడం. మూడు హిందూ – ముస్లిం ఘర్షణలు సృష్టించి ప్రజల మధ్య చీలికలు పెట్టడం. ఇందులో బ్రిటిష్ వారు కొంతవరకు తాత్కాలికంగా సఫలీకృతులయినప్పటికీ, అంతిమంగా స్వాతంత్రోద్యమంలో కొత్త శక్తులు ఆవిర్భవించడానికి చరిత్ర మరో మలుపు తీసుకోవడానికి దోహదపడింది.

### బ్రిటీషు నిరంకుశ చర్యలు ప్రజా ప్రతిఘటన

1919 మార్చి – ఏప్రిల్ మాసాలు భారత స్వాతంత్రోద్యమ చరిత్రను మలుపు తిప్పిన కాలం. భారతీయుల స్వాతంత్రోద్యమ అభిలాషను అణచివేయడానికి మార్చి మొదటివారంలో రౌలట్ చట్టం తీసుకువచ్చింది. నిరసన తెలిపే హక్కు, ఊరేగింపులు, సభలు జరుపుకునే, సంఘాలు పెట్టుకునే హక్కు, ఆఖరికి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కును సైతం ఈ చట్టం లాగేసుకుంది. పౌరుల కదలికలపై తీవ్రమైన ఆంక్షలు విధించింది. విమర్శకులకు దేశద్రోహ ముద్ర వేసింది. రాజద్రోహం నేరం కింద జైళ్ళలో కుక్కింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశమంతా భగ్గుమన్నది. మార్చి 30, ఏప్రిల్ 6న సభలు, సమావేశాలతో హోరెత్తింది. సరిగ్గా ఈ సమయంలోనే గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి వచ్చారు. ఈ నిరసనోద్యమానికి మద్దతు తెలియజేయడమే కాకుండా తానూ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అమృత్‌సర్‌లోని జలియన్‌వాలాబాగ్‌లో రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా ప్రజలు ఏప్రిల్ 14న సభ జరుపుకోవడానికి జమకూడారు. దీన్ని అదునుగా తీసుకుని నాటి పోలీసు అధికారి డయ్యర్ ప్రజలపై విచక్షణా రాహిత్యంగా కాల్పులు సాగించాడు. ఈ కాల్పుల్లో 1200 మంది అశువులు బాశారు. స్వాతంత్రోద్యమ చరిత్రలో ఇది రక్తాక్షరాలతో లిఖించిన అధ్యాయం.

### మతసామరస్యానికి ప్రతీక ఖిలాఫత్ ఉద్యమం

ఇదే కాలంలో టర్కీలో ఖలీఫాను పదవీచ్యుతుడ్ని చేసిన బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలోనూ ముస్లింలు ఉద్యమించారు. దీనికి నాటి స్వాతంత్రోద్యమ నాయకులు కూడా మద్దతు తెలియజేశారు. ఖిలాఫత్ ఉద్యమ కమిటీకి గాంధీ నేతృత్వం వహించగా మదనమోహన్ మాలవ్య, మహమ్మద్ ఆలీ సోదరులు, మోతీలాల్ నెహ్రూ, స్వామి శ్రద్ధానంద తదితరులు సభ్యులుగా ఉన్నారు. బ్రిటిష్ వ్యతిరేక పోరాటంలో హిందూ, ముస్లిం ఐక్యతను చాటిచెప్పిన ఉద్యమమిది. దేశవ్యాప్తంగా హిందూ, ముస్లింలు భుజం, భుజం కలిపి ఖిలాఫత్ ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

### ఆధునిక విప్లవోద్యమానికి బీజాలు

ఖిలాఫత్ ఉద్యమం ద్వారా వచ్చిన ఐక్యత స్వాతంత్రోద్యమంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన సహాయ నిరాకరణోద్యమానికి నాంది పలికింది. 1921–22లో దేశమంతా స్వాతంత్రోద్యమ గాలులు వీచాయి. బ్రిటిష్ వారికి పన్నులు చెల్లించ నిరాకరించడం మొదలుకొని విదేశీ వస్తు బహిష్కరణ వరకు ఇది సాగింది. గాంధీ ఈ ఉద్యమాన్ని శాంతియుత సత్యాగ్రహ రూపంలో సాగించారు. అయితే 1922 ఫిబ్రవరిలో చౌరాచౌరీలో జరిగిన ఘటనను ఆసరా చేసుకుని గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని ఉపసంహరించారు. యువతరంలో దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. అసంతృప్తికి గురైన యువ నాయకత్వం నూతన మార్గం కోసం అన్వేషించారు. ఈ క్రమంలోనే భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, భటుకేశ్వర్‌దత్ లాంటి జాతీయ విప్లవకారులు పురుడు పోసుకున్నారు.

### భగత్‌సింగ్ రాజకీయ జీవిత పరిణామక్రమం

1907 సెప్టెంబర్28న నేడు పాకిస్తాన్‌లో ఉన్న పశ్చిమ పంజాబ్‌లోని బంగా గ్రామంలో భగత్‌సింగ్ జన్మించాడు. జలియన్ వాలాబాగ్ ఘటనతో చలించిపోయిన భగత్‌సింగ్ తన 12వ ఏటనే ఆ స్థలాన్ని సందర్శించి పోరాటస్ఫూర్తిని పొందాడు. 14వ ఏట స్కూలును బహిష్కరించి బ్రిటీషువారిపై తిరుగుబాటు చేశాడు. 1923లో హిందూస్తాన్ రిపబ్లికన్ ఆర్మీలో సభ్యుడుగా చేరాడు. 1925లో మొదటిసారి అరెస్టు వారంటు వచ్చింది. 1926 నుండి నౌజవాన్ భారత సభలో చురుకైనా పాత్ర పోషించాడు. 1928లో సైమన్ గోబ్యాక్ ఉద్యమంలో లాలా లజపతిరాయ్‌పై లాఠీ ఝుళిపించి మరణానికి కారకుడైన శాండర్స్‌ను హత్య చేయడంతో భగత్‌సింగ్ రాజకీయ జీవితం బయట ప్రపంచానికి వెల్లడైంది. వ్యక్తిగత హత్యలతో

> **"భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుండి విముక్తి చేయటానికై అమరులైన చారిత్రక దినం మనం ఈ మార్చిలో జరుపుకోబోతున్నాం. వారి మరణానంతరం భగత్‌సింగ్ సహచరులనేకమంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అజయ్ ఘోష్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు."**



భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్

స్వాతంత్ర్యం సాధించలేమని ప్రజలను కూడగట్టి రాజ్యాధికారాన్ని కూలదోస్తేనే స్వాతంత్ర్యం వస్తుందని జీవితానుభవం ద్వారా గ్రహించాడు. ఆ క్రమంలోనే సోషలిస్టు భావాలతో ప్రభావితుడయ్యాడు. పంజాబ్ కమ్యూనిస్టు నాయకుడు సోహన్‌సింగ్ జోష్‌తో పరిచయమైనాక మరింత పరిపక్వత సాధించాడు. సోషలిజమే తన జీవితాశయంగా బహిరంగంగా ప్రకటించాడు. 1928లో హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీగా అది రూపాంతరం చెందింది. 1931 మార్చి 23న ఉరికంబమెక్కబోయే ముందు జైలు గోడల మధ్య లెనిన్ జీవిత చరిత్రను చదువుతూ తానొక గొప్ప విప్లవకారునితో సంభాషిస్తున్నట్లుగా జైలు అధికారులతో భగత్‌సింగ్ చెప్పుకున్నాడు. భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుండి విముక్తి చేయటానికై అమరులైన చారిత్రక దినం మనం ఈ మార్చిలో జరుపుకోబోతున్నాం. వారి మరణానంతరం భగత్‌సింగ్ సహచరులనేకమంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అజయ్ ఘోష్ పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యాడు. శివవర్మ, గణేశ్ శంకర విద్యార్థి సిపియంలో ప్రముఖ నాయకులుగా మారారు. విజయకుమార్ సిన్హా సిపిఐలో జాతీయ నాయకులయ్యారు. ఆ రకంగా నాటి తరం వ్యక్తిగత హింసావాదం నుండి మార్క్సిస్టులుగా రూపాంతరం చెందారు. ఇదే కాలంలో గదర్‌పార్టీ, అనుశీలన్ సమితి వంటి విప్లవ సంస్థలకు చెందిన అనేకమంది కమ్యూనిస్టుపార్టీలో చేరడంతో స్వాతంత్రోద్యమ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది.

1926 నుండే భగత్‌సింగ్ కమ్యూనిస్టు భావాల వైపు మళ్లారు. లాలా లజపతిరాయ్ స్థాపించిన ద్వారకాదాస్ గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా ఉన్న రాజారాం శాస్త్రి అనేక పుస్తకాలిచ్చి ప్రోత్సహించారు. అందులో ఎక్కువ భాగం నిషేధించబడిన గ్రంథాలే ఉండేవి. అందులోనూ మార్క్సిస్టు భావజాలంతో నిండిన పుస్తకాలే అధికం. 1928 కల్లా ఈ బృందం సోషలిస్టు సిద్ధాంతాన్ని అంగీకరించిందని భగత్‌సింగ్ సహచరుడు శివవర్మ తన జ్ఞాపకాల్లో పేర్కొన్నారు. 1928లో బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనిస్టులను, కార్మికోద్యమాలను అణచడానికి ప్రజాభద్రతా బిల్లు, పారిశ్రామిక సంబంధాల బిల్లును తీసుకొచ్చింది. ఇవి రెండూ విప్లవ, కార్మికోద్యమాలను నిషేధించేవే. వీటికి వ్యతిరేకంగా ఏప్రిల్ 8వ తేదీన పార్లమెంటులో బాంబులు వేసి సంచలనం సృష్టించాలని, ఈ నిరంకుశ బిల్లులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని భగత్‌సింగ్ బృందం భావించింది. బటుకేశ్వర్‌దత్తుతో కలసి భగత్‌సింగ్ ఈ బాంబులు వేశారు. తప్పించుకోకుండా అక్కడే నిలబడి నినాదాలిచ్చారు. జాతీయ విప్లవకారుల భావాలను ప్రభావితం చేయడానికి కమ్యూనిస్టుపార్టీకి చెందిన వాన్‌గార్డు అనే పత్రికలో జాతీయవాదులకు విజ్ఞప్తి పేరుతో ఒక వ్యాసం ప్రచురించారు. 1929 అక్టోబర్19న విద్యార్థి మహాసభకు సందేశం పంపుతూ ఇలా రాశారు. ''పిస్టళ్లను, బాంబులను చేపట్టాల్సిందిగా ఈనాడు మనం యువకులను అడగజాలం. పారిశ్రామిక ప్రాంతాల్లోని మురికివాడల్లోనూ, గ్రామసీమల్లోని గుడిసెల్లోనూ నివసించే కోట్లాది ప్రజలను చైతన్యపరచాల్సి ఉంది"..."నిజమైన విప్లవ సైనికులు గ్రామాల్లోను, ఫ్యాక్టరీల్లోనూ ఉన్న రైతులు, కార్మికుల్లోనే ఉన్నారు" ..."నేను టెర్రరిస్టును, విప్లవకారుడను.....అంటూ "మార్క్స్, లెనిన్ రచనలను చదవాల్సిందిగా యువతకు సలహా ఇస్తున్నా"నన్నాడు. వృత్తి విప్లవకారుల అవసరాన్ని ఆయన గుర్తించారు. తనను ఉరి తీయడానికి సంవత్సరం ముందు జైలు మిత్రులతో మాట్లాడుతూ అన్న మాటలు "వాళ్లు నన్ను చంపి వేయవచ్చు. కాని నా భావాలను వారు అణచివేయలేరు. ఒక శాపం వలే నా భావాలు బ్రిటీషువారిని వెంటాడుతాయి. దానితో చివరకు వారు ఇక్కడ నుండి పారిపోవాల్సివస్తుంది'' అని ప్రగాఢమైన విశ్వాసంతో చెప్పాడు. ఆయనింకా ఇలా అన్నారు. "బ్రిటీషు సామ్రాజ్యవాదులకు బతికున్న భగత్‌సింగ్ కంటే చనిపోయిన భగత్‌సింగ్ మరింత ప్రమాదకారి. నన్ను ఉరి తీసిన తర్వాత నా విప్లవ భావాలు ఈ సుందర భారతాన్ని నలుదిశలా వెదజల్లుతాయి. యువత స్వాతంత్ర్యం కోసం, విప్లవం కోసం తపించేట్లు చేస్తాయి. ఇది ధృధ విశ్వాసం" 1947 ఆగస్టు 15 భారతదేశ విముక్తితో భగత్‌సింగ్ కల అక్షరసత్యమైంది.

### భగత్‌సింగ్ వారసత్వంతో ఆవిర్భవించిన కమ్యూనిస్టుపార్టీ

1920 దశాబ్దంలోనే భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించడం యాదృచ్ఛికం కాదు. మొదటి ప్రపంచ యుద్ధ భారాలతో ప్రజలు

సతమతమవుతున్న దశలో బ్రిటిష్ వారు అదనపు భారాలు మోపారు. ధరలు, నిరుద్యోగం పెరిగాయి. దరిద్రం పెరిగింది. వ్యవసాయ సంక్షోభంతో పంటల ధరలు తగ్గిపోయి రైతులు అప్పులపాలయ్యారు. పారిశ్రామిక కేంద్రాలలో కార్మికుల సమ్మెలు వెల్లువెత్తాయి. బొంబాయి జౌళి మిల్లుల కార్మికుల సమ్మెలు, జంషెడ్‌పూర్ స్టీల్ పరిశ్రమ సమ్మె, జలాల్‌పూర్ రైల్వే కార్మికుల సమ్మె, అహమ్మదాబాద్ మిల్లు కార్మికులు, అస్సాం తేయాకు తోటల కార్మికుల సమ్మె, ఈ

**"వందేళ్ళ తరువాత మరలా నాటి బ్రిటిష్ వ్యతిరేక పోరాటం తరహాలో మరో స్వాతంత్రోద్యమానికి నాంది పలకాల్సిన సమయం ఆసన్నమైంది. బ్రిటిష్ నిర్బంధకాండలో నుండి భగత్‌సింగ్ బృందం, కమ్యూనిస్టులు, గాంధీ, అంబేద్కర్ లాంటి అనేక మంది జాతీయోద్యమ నాయకులు ఆవిర్భవించినట్లుగానే నేడు బిజెపి మతోన్మాద వ్యతిరేక పోరాటంలో నుండి చరిత్రను తిరగరాసే కొత్త తరం ఆవిర్భవిస్తుంది."**



విప్లవయోధులు చంద్రశేఖర్ అజాద్, బటుకేశ్వరదత్, రాంప్రసాద్ బిస్మిల్

విధంగా సమ్మెల వెల్లువ ఒకవైపు, రైతాంగ తిరుగుబాట్లు మరో వైపు దేశాన్ని కుదిపేశాయి. "సంఘటిత కార్మిక, కర్షక ఉద్యమాలు ఏకకాలంలో పురోగమించడానికి, ఇవి రెండూ కూడా అపూర్వమైన స్థాయిలో జాతీయోద్యమానికి బలం చేకూర్చడానికి అనువైన రాజకీయ పరిస్థితులు రూపుదిద్దుకోనారంభిం చాయి." అని ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు ఈ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ ఈ చారిత్రక సందర్భాన్ని గురించి అభివర్ణించారు.

### స్వతంత్రాన్ని తాకట్టుపెడుతున్న బిజెపి

ఈనాడు తొలిసారిగా స్వాతంత్రోద్యమంతో ఏమాత్రం సంబంధం లేని బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. బిజెపిని వెనుక నుండి నడిపిస్తున్న ఆర్.ఎస్.ఎస్. స్వాతంత్రోద్యమానికి వెన్నుపోటు పొడిచింది. నాడు బ్రిటిష్ వారి చేతిలో పావుగా హిందూ, ముస్లిం ఘర్షణలను తీవ్రం చేసింది. ఒకవైపు ముస్లింలీగ్ నాయకుడు జిన్నా, మరోవైపు ఆర్.ఎస్.ఎస్. నాయకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి దేశ విభజనకు కారకులయ్యారు. నాడు వారు రగిల్చిన చిచ్చు ఇప్పటికీ రావణాసుర కాష్టంలా మనల్ని వెంటాడుతూనే ఉంది.

### భగత్‌సింగ్ ఆశయాలకు సమాధి కడుతున్న సంఘపరివార్

2019 పార్లమెంటు ఎన్నికల్లో రెండవసారి అధికారం చేపట్టిన మోడీ అభివృద్ధి నమూనాను గాలికి వదిలేసి గుజరాత్ మత మారణహోమం నమూనాను దేశమంతా అమలు చేస్తున్నారు. నేడు ఢిల్లీలో జరుగుతున్న పరిణామాలు బిజెపి అసలు రూపాన్ని బహిర్గతపరుస్తున్నాయి. దేశమంతా ఆర్థికమాంద్యంలో కూరుకుపోయి అల్లాడుతుంటే దేశభక్తి పేరుతో అమెరికా సామ్రాజ్యవాద అధిపతి ట్రంప్‌కు మోకాళ్ళపై వంగి నమస్కారం చేస్తున్నాడు. నాడు బ్రిటిష్ వాళ్లకు తొత్తులుగా మారిన బిజెపి నేడు రాజులకు వారసురాలిగా మారింది. పౌరసత్వ సమస్యపై రగులుతున్న ప్రజా నిరసనను కర్కశంగా అణచివేసి ట్రంప్ ముందు తమ ప్రభుభక్తిని వారు నిరూపించుకోదలచుకున్నారు.

### మరో జాతీయోద్యమానికి నాంది

మోడీని విమర్శించేవారందరినీ దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నది. దేశాన్ని బలహీనపరచి సామ్రాజ్యవాదుల సరుకుల దొడ్డిగా మార్చడానికి మోడీ కంకణం కట్టుకున్నాడు. రాజ్యాంగానికి పునాదులైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయి. వీటిని కాపాడుకుంటూ మరో నూతన ప్రపంచానికి నాంది పలకాలి. వందేళ్ళ తరువాత మరలా నాటి బ్రిటిష్ వ్యతిరేక పోరాటం తరహాలో మరో స్వాతంత్రోద్యమానికి నాంది పలకాల్సిన సమయం ఆసన్నమైంది. బ్రిటిష్ నిర్బంధకాండలో నుండి భగత్‌సింగ్ బృందం, కమ్యూనిస్టులు, గాంధీ, అంబేద్కర్ లాంటి అనేక మంది జాతీయోద్యమ నాయకులు ఆవిర్భవించినట్లుగానే నేడు బిజెపి మతోన్మాద వ్యతిరేక పోరాటంలో నుండి చరిత్రను తిరగరాసే కొత్త తరం ఆవిర్భవిస్తుంది. ఈతరం ఎటువైపు నిలబడాలో నిర్ణయించుకోవాలి. భగత్‌సింగ్‌లా పోరాడి దేశసమైక్యతను కాపాడాలా? సంఘపరివార్‌లా దేశ విచ్ఛిన్నకులుగా మారాలా? భగత్‌సింగ్ సాక్షిగా మార్పుకు స్వాగతం పలికే తరానికి ఇది చరిత్ర విసురుతున్న సవాలు. ❋


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# వార్తా పత్రికల రిజిస్ట్రేషన్

## (రూలు 8వ ఫారం IV ప్రకారం)

## మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు

| | | |
|---|---|---|
| 1. ప్రచురణ స్థలం | : | విజయవాడ |
| 2. ఏ రకమైన పత్రిక | : | మాసపత్రిక |
| 3. ముద్రాపకుని పేరు | : | బి.వి.రాఘవులు |
| చిరునామా | : | 1-1-60/2,ఎం.బి.భవన్,<br>ఆర్.టి.సి క్రాస్ రోడ్స్,<br>హైదరాబాద్ -20. |
| 4. ప్రచురణ కర్త పేరు | : | బి.వి.రాఘవులు |
| చిరునామా | : | 1-1-60/2,ఎం.బి.భవన్,<br>ఆర్.టి.సి క్రాస్ రోడ్స్,<br>హైదరాబాద్ -20. |
| 5. సంపాదకుని పేరు | : | ఎస్.వెంకట్రావు |
| చిరునామా | : | డోర్.నెం.27-30-4<br>ఎమ్.బి.విజ్ఞానకేంద్రం<br>గవర్నర్‌పేట,<br>విజయవాడ - 520002 |
| 6. పత్రిక యాజమాన్యం | : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)<br>ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, |

బి.వి.రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందు మూలముగా తెలియజేస్తున్నాను.

సం/-

బి.వి.రాఘవులు

ప్రచురణ కర్త

# విప్లవం ఎందుకు?



**భగత్‌సింగ్**

(1931 మార్చి 23వ తేదీన భగత్‌సింగ్ సగర్వంగా ఉరికంబం ఎక్కారు. ఆయన తన సహచరులనుద్దేశించి రూపొందించిన విప్లవ కార్యక్రమాల ప్రతి కలకత్తాలో శ్రీమతి విమలా ప్రతిభాదేవి (డిటెన్యూ) పరిశోధనా గృహంలో 1931 అక్టోబర్ 3వ తేదీన లభించింది. ఈ కార్యక్రమం ప్రతిని చదివితే విప్లవసాధన పట్ల భగత్‌సింగ్‌కు ఎలాంటి అవగాహన వున్నదో మనకు తెలుస్తుంది)

ప్రియమైన కామ్రేడ్స్ !

ప్రస్తుతం మనం సాగిస్తున్న ఉద్యమం అతికీలకమైన దశగుండా పయనిస్తున్నది. కొన్ని సంవత్సరాలు తీవ్ర పోరాటం సాగించిన అనంతరం రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించిన కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలను రౌండ్‌టేబుల్ సమావేశం రూపొందించింది. ఈ ప్రతిపాదనల గురించి పరిశీలించేందుకు కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ ఆందోళన సాగించాలని గాని విరమించాలని గాని వారు నిర్ణయిస్తే అది మనకు ప్రాముఖ్యమైన విషయమేమీకాదు. ప్రస్తుతం సాగుతున్న ఆందోళన ఏదో ఒక రాజీతో ముగియబోతున్నది. త్వరలో గాని, కొంతకాలం తర్వాత గాని వారు రాజీ పడవచ్చు. మనం సాధారణంగా అనుకుంటున్నట్లు రాజీ పనికిమాలినదని గాని, ఖండించాల్సినదని గాని అనుకోరాదు. రాజకీయ వ్యూహంలో త్రోసిపుచ్చరాని అంశమది. అణగద్రొక్కేవారికి వ్యతిరేకంగా పోరాడే దేశమేదయినా ప్రారంభంలో వైఫల్యాల దిశగా పయనిస్తుంది. పోరాటం మధ్యలో ఉన్నప్పుడు రాజీల ద్వారా పాక్షిక ప్రయోజనాల్ని పొందాల్సి వుంటుంది. అంత్యదశలో మాత్రమే సకల సంఘటిత శక్తులతో, దేశ వనరులతో అంతిమదెబ్బకొట్టి పాలక ప్రభుత్వాన్ని పడగొట్టవచ్చు. అప్పుడు కూడా విఫలంకావచ్చు. అటువంటప్పుడు కూడా ఏదో ఒక విధంగా రాజీ పడక తప్పదు. రష్యా ఉదాహరణ ఈ విషయాన్ని బాగా వివరిస్తుంది.

రష్యాలో 1905 విప్లవోద్యమం విజృంభించింది. నాయకులందరూ ఎంతో ఆశావహంగా వున్నారు. ప్రవాసంలో వున్న లెనిన్ విదేశాల నుండి తిరిగి వచ్చారు. ఆయన పోరాటాన్ని నిర్వహిస్తున్నారు. 12 మంది భూస్వాములు చంపబడ్డారని, వారి భవనాలు దగ్ధం చేయబడ్డాయని లెనిన్‌తో చెప్పడానికై ప్రజలు వచ్చారు. 1200 మంది భూస్వాములను, వారి భవనాలను తగులబెట్టేందుకురండని లెనిన్ సమాధానమిచ్చారు. విప్లవం విఫలమయితే అలాంటిది ఏదైనా జరిగినా మంచిదని ఆయన అభిప్రాయం. డ్యూమా ఏర్పాటు చేయబడింది. లెనిన్ డ్యూమాలో పాల్గొనాలన్న అభిప్రాయం వెలిబుచ్చారు. ఇది 1907లో జరిగింది. అవకాశాలు తక్కువగా వున్న రెండవ డ్యూమా కంటే పనిచేయడానికి బాగా అవకాశమిచ్చిన మొదటి డ్యూమాలో పాల్గొనడాన్ని 1906లో ఆయన వ్యతిరేకించారు. మారిన పరిస్థితుల వల్ల ఆయన అలా చేశారు. అభివృద్ధి నిరోధకత్వానిది పై చేయి అవుతున్నది. కనుక సోషలిస్టు భావాలను చర్చించడానికి డ్యూమాను ఒక వేదికగా ఉపయోగించుకోవాలని లెనిన్ భావించారు.

1917 విప్లవానంతరం బోల్షివిక్‌లు బ్రెస్ట్ లిటోవ్‌స్కీ ఒప్పందంపై సంతకాలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. లెనిన్ తప్ప అందరూ అందుకు వ్యతిరేకించారు. అప్పుడు లెనిన్ ఇలా చెప్పారు. "శాంతి, శాంతి, శాంతి. ఏవిధంగానైనా సరే శాంతి కావాలి. జర్మన్ యుద్ధ ప్రభువులకు మరికొన్ని రష్యా ప్రాంతాలను ఇచ్చైనా సరే శాంతి స్థాపించాలి." ఈ ఒప్పందం కుదుర్చుకున్నందుకు కొందరు బోల్షివిక్ వ్యతిరేకులు లెనిన్‌ను ఖండించగా జర్మన్ల మారణకాండను ఎదుర్కొనే స్థితిలో బోల్షివిక్‌లు లేరని ఆయన నిర్మొహమాటంగా ప్రకటించారు. బోల్షివిక్ ప్రభుత్వం పూర్తిగా నాశనం ఆయ్యే కంటే సంధి కుదుర్చుకోవడానికే ఆయన ప్రాధాన్యమిచ్చారు.

ఈ విషయాన్ని నేను ఇక్కడ ఎందుకు చెపుతున్నానంటే, పోరాటం వృద్ధి చెందుతున్నప్పుడైనా ఉపయోగించుకునే అత్యవసర ఆయుధం రాజీ అని చెప్పడానికే. అయితే సదా మన ముందుండాల్సింది ఉద్యమ ఆదర్శం. మనం ఏ లక్ష్యసాధన కోసమైతే పోరాడుతున్నామో దాని పట్ల మనకు సదా స్పష్టమైన అభిప్రాయం వుండాలి. మన ఉద్యమ జయాపజయాల గురించి సమీక్షించుకోవటానికి, మనం సులభంగా భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకొనడానికి అది తోడ్పడుతుంది. తిలక్ విధానం ఆశయానికి దూరమైనదయినా అది ఆయన వ్యూహం ఆయన విధానం మంచిది. నీవు 16 అణాలు పొందడం కోసం నీ శత్రువుతో పోరాడుతున్నావు. నీకు ఒక్క అణా మాత్రమే దక్కింది. దాన్ని జేబులో వేసుకో. మిగతా అణాల కోసం పోరాడు. మితవాదుల్లో మనం గుర్తించవలసింది వారి ఆదర్శాన్ని. వారు ఒక అణా సాధించుకోవాలని బయలుదేరుతారు. అణా పొందలేదు. తాము సంపూర్ణ విప్లవం కోసం తపన పడుతున్నామన్న విషయాన్ని విప్లవకారులు సదా జ్ఞాపకం వుంచుకోవాలి. అధికారాన్ని పూర్తిగా తమ చేతుల్లోకి తీసుకోవాలి. రాజీకుదుర్చుకున్న పిదప అభివృద్ధి నిరోధకులైతే విప్లవశక్తులను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తారు. కనుక అలాంటి రాజీలు బాధ కలిగిస్తాయి. అయినప్పటికీ సమర్థులయిన, సాహసవంతులయిన విప్లవ కారులు ఇటువంటి కుదుపుల నుండి ఉద్యమాన్ని రక్షించుకోగలరు. అసలు సమస్యల విషయంలో, ముఖ్యంగా లక్ష్యం విషయంలో ఏ విధంగానూ గందరగోళపడకుండా ఇటువంటి క్లిష్ట సమయాలలోనే మనం చాలా జాగ్రత్తగా వుండాలి. బ్రిటిష్ కార్మిక నాయకులు తమ నిజమైన పోరాటాన్ని విచ్ఛిన్నం చేసి, కపట సామ్రాజ్యవాదుల స్థాయికి దిగజారారు. నా అభిప్రాయంలో ఈ నగిషీ సామ్రాజ్యవాద, కార్మిక నాయకుల కంటే కరడుగట్టిన అభివృద్ధి నిరోధకులే మెరుగు. వ్యూహం, ఎత్తుగడల గురించి

> **"నిజమైన విప్లవ శక్తులను రంగం మీదికి తీసుకురాలేపోవటం వల్లనే నేను ఆ విధంగా అభిప్రాయపడుతున్నాను. మధ్య తరగతి వ్యాపారులపై, కొద్ది మంది పెట్టుబడిదారులపై ఆధారపడి సాగుతున్న పోరాటమిది. ఈ రెండు వర్గాలు, ప్రత్యేకించి రెండవ వర్గం తన ఆస్తిపాస్తులను ఏ పోరాటంలోనూ ఫణంగా ఒడ్డేందుకు ఎన్నడూ సాహసించదు."**

తెలుసుకోగోరే వారెవరైనా లెనిన్ జీవితాన్ని అధ్యయనం చేయాల్సిందే. "వామపక్ష కమ్యూనిజం" అన్న పుస్తకంలో రాజీ చేసుకోవాలన్న అంశపై ఆయన నిర్దిష్ట అభిప్రాయాలు తెలుస్తాయి.

ప్రస్తుత ఉద్యమం అంటే ఇప్పుడు సాగుతున్న పోరాటం ఏదో ఒక రాజీ కుదుర్చుకోవటమో లేక పూర్తిగా విఫలం గావటమో సంభవించే దిశగా సాగుతున్నది.

నిజమైన విప్లవ శక్తులను రంగం మీదికి తీసుకురాలేపోవటం వల్లనే నేను ఆ విధంగా అభిప్రాయపడుతున్నాను. మధ్య తరగతి వ్యాపారులపై, కొద్ది మంది పెట్టుబడిదారులపై ఆధారపడి సాగుతున్న పోరాటమిది. ఈ రెండు వర్గాలు, ప్రత్యేకించి రెండవ వర్గం తన ఆస్తిపాస్తులను ఏ పోరాటంలోనూ ఫణంగా ఒడ్డేందుకు ఎన్నడూ సాహసించదు. అసలైన విప్లవ సైన్యం క్షేత్రాలలోని రైతుల్లోనూ, కర్మాగారాలలోని కార్మికుల్లోనూ వుంది. వారి దగ్గరకెళ్ళే సాహసం మన బూర్జువా నాయకులు చేయరు. చేయలేరు. కునుకుదీస్తున్న సింహం ఒక్కసారి మేల్కొన్నదంటే మన నాయకులు అనుకున్న లక్ష్యం సాధించిన తర్వాత కూడా దానిని అదుపు చేయలేరు. 1920లో అహ్మదాబాద్ కార్మికులతో ఇట్లాంటి తొలి అనుభవం గడించాకనే "మనం కార్మికుల జోలికి పోవద్దు. కర్మాగారాల్లో కార్మికులను రాజకీయంగా ఉపయోగించుకోవడం ప్రమాదకరం" (ది టైమ్స్ మే 1921) అని మహాత్మాగాంధీ ప్రకటించారు. నాటి నుండి వారెన్నడూ కార్మికుల చెంతకెళ్ళలేదు. వారు రైతాంగంతోనే ఉండిపోయారు. విదేశీయుల ఆధిపత్యాన్నిగాక బడా భూస్వాములను కూడా కుదిపేసేలా రైతాంగం మిరుమిట్లు గొలిపేలా పోరాటానికి దిగటం చూసిన ఆ నాయకులు ఎంతగా భీతిచెందారో 1922లో చేసిన బార్డోలీ తీర్మానం స్పష్టంగా తెలుపుతుంది.

అందుచేత రైతాంగానికి లొంగిపోయేకంటే బ్రిటిష్‌వారికి లొంగిపోవటానికే మన నాయకులు ఇష్టపడ్డారు. పండిట్ జవహర్‌లాల్‌ను అలా వుంచండి. రైతాంగాన్నిగాని, కార్మికులనుగాని సంఘటితపరచేందుకు ఏదైనా ప్రయత్నం చేసిన నాయకుడెవరైనా ఉన్నారేమో చూపగలరా? చూపలేరు. వారు ఆ శ్రమ తీసుకోరు. అదే వారికి లోపించింది. అందుచేతనే వారెన్నడూ సంపూర్ణ విప్లవానికి కృషిచేసే వారుకాదని నేనంటాను. ఆర్థికపరమైన, పరిపాలనా సంబంధమైన ఒత్తిడులు తీసుకురావడం ద్వారా మరికొన్ని సంస్కరణలు తీసుకురాగలమని, భారత పెట్టుబడిదారులకు మరికొన్ని రాయితీలు సంపాదించి పెట్టగలమని వారు ఆశపడ్డారు. అందుచేతనే ఏదో ఒక రాజీ కుదిరిన తరువాతగాని, రాజీ కుదరకుండానైనా ఈ ఉద్యమం మృత్యోన్ముఖమవుతుందని నేను చెపుతున్నాను. నిక్కచ్చిగా 'విప్లవం వర్ధిల్లాలి' అని నినదించే యువ కార్యకర్తలు బాగా సంఘటితమై లేరు. తమంతట తాముగా ఉద్యమాన్ని సాగించేటంత బలంగానూ లేరు. నిజానికి పండిట్ మోతీలాల్ నెహ్రూను మినహాయిస్తే మన నాయకులెవరూ ఏ బాధ్యతలైనా తమ భుజస్కంధాల మీద వేసుకొనేందుకు సాహసించరు. అందుచేతనే వారు అప్పుడప్పుడు బేషరతుగా గాంధీకి లొంగిపోతుంటారు. వాళ్ళలో వాళ్ళకు విభేదాలున్నప్పటికి ఆయననెన్నడూ వారు తీవ్రంగా వ్యతిరేకించరు. మహాత్ముని కోసం తీర్మానాలు చేస్తూ వుంటారు.

ఇటువంటి పరిస్థితుల్లోనే నిజంగా విప్లవం కోసం చిత్తశుద్ధితో పోరాడే యువకార్యకర్తలను రానున్న రోజులు గడ్డురోజులని నేను హెచ్చరిస్తున్నాను. ఈ విషయం తెలియకపోతే వారు గందరగోళపడతారు. లేదా నీరుగారిపోతారు. జాగ్రత్తగా వుండాలి. మహాత్మాగాంధీ జరిపిన రెండు పోరాటాల ద్వారా అనుభవం సంపాదించిన పిదప మన ప్రస్తుత పరిస్థితి పట్ల,, భవిష్యత్ కార్యక్రమం పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పరచుకునే చక్కటి స్థితిలో మనమున్నాం.

సులభరీతిలో దీన్ని గురించి చెప్పటానికి నేనిప్పుడు ప్రయత్నిస్తాను. మీరు 'విప్లవం వర్ధిల్లాలి' అని నినదిస్తారు. మీరు నిజంగా విప్లవం కోసమే పనిచేస్తున్నారని నేను భావిస్తాను. అసెంబ్లీ బాంబుకేసులో మనం చేసిన ప్రకటనలో ఆ పదానికి మనమిచ్చిన నిర్వచనం ప్రకారం విప్లవమంటే ప్రస్తుత సాంఘిక వ్యవస్థను సంపూర్తిగా తొలగించి దానిస్థానే సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పటమని అర్థం. ఇందుకు మన తక్షణ లక్ష్యం అధికారాన్ని కైవసం చేసుకోవడం. నిజానికి ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పాలకవర్గాల ప్రయోజనాలను పరిరక్షించే ఆయుధాలు మాత్రమే. మనం అధికారాన్ని హస్తగతం చేసుకోవాల్సి వుంది. మన ఆశయాలను అంటే మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికగా సమాజ పునర్నిర్మాణం గావించడానికి దాన్ని వినియోగించుకోవాలని భావిస్తున్నాం. అందుకే మనం ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వహించడం కోసం పోరాడుతున్నాం. మన సాంఘిక కార్యక్రమానికి అనువైన వాతావరణాన్ని నెలకొల్పడానికి మనం నిత్యం ప్రజా బాహుళ్యాన్ని చైతన్యవంతం చేయాలి. పోరాటాల్లోనే మనం వారికి బాగా శిక్షణనిచ్చి చైతన్యవంతుల్ని చేయగలం. ఈ విషయాలు మనకు స్పష్టం అయిన తరువాత మన తక్షణ, అంతిమ లక్ష్యాలేమిటో మన ముందున్నప్పుడు మనమిప్పుడు ప్రస్తుత పరిస్థితిని పరిశీలన చేయాలి. మనం సదా వాస్తవికంగా వ్యవహరించాలి. ఏ పరిస్థితినైనా శ్రద్ధతో విశ్లేషించాలి.

భారత ప్రభుత్వంలో భారతీయులు చేరి బాధ్యతలను పాలు పంచుకోవడంపై పెద్దఎత్తున ప్రచారం జరిగింది. మింటో మార్లే సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. ఇందువల్ల సలహాలిచ్చే హక్కులతో మాత్రమే భారతీయులతో వైస్రాయ్ మండలి ఏర్పడింది. మహాయుద్ధంలో భారతీయుల సహాయం అవసరమైనప్పుడు స్వపరిపాలనకు సంబంధించి వాగ్దానాలు చేయబడ్డాయి. శాసనాలు చేసే అధికారాలను పరిమితంగా శాసనసభకు ఇచ్చారు. అయితే ఆ చట్టాలు వైస్రాయ్ కూడా అంగీకరించాలి. అది మూడవ దశ. ఇప్పుడు సమీప భవిష్యత్‌లో ప్రవేశపెట్టబోయే సంస్కరణల గురించి చర్చ జరుగుతోంది. మన యువకులు వాటి మంచి చెడులనెలా నిర్ణయిస్తారు? ఇదొక ప్రశ్న. కాంగ్రెస్ నాయకులు దీన్ని ప్రామాణికంగా తీసుకుని వాటి మంచిచెడులు నిర్ణయిస్తారో నాకు తెలియదు. అయితే విప్లవకారులమైన మనం మాత్రం దిగువ విధంగా వ్యవహరిస్తాం:

1) భారతీయుల భుజస్కంధాలపై ఏ మేరకు బాధ్యతలను వుంచుతారనే దాన్ని బట్టి: 2) ప్రవేశపెట్టబోయే ప్రభుత్వ సంస్థల స్వరూప స్వభావాలను, ప్రజాబాహుళ్యానికి వానిలో పాల్గొనేందుకు ఇచ్చే హక్కులను బట్టి: 3) భవిష్యత్‌లోగల అవకాశాలు, వాటికి ఇచ్చే రక్షణలు.

వీనికి మరికొంత వివరణ అవసరం కావచ్చు. మొదట ప్రభుత్వ కార్య నిర్వా హకవర్గంలో మన ప్రతినిధుల స్థానాన్ని బట్టి, మన ప్రజలకిచ్చే బాధ్యతలను బట్టి మనం సులభంగా నిర్ణయానికి రావచ్చు. ఇప్పటివరకు కార్యవర్గం శాసనసభకు బాధ్యత వహించేటట్లు చేయలేదు. ఎన్నికైన సభ్యుల నిర్ణయాలను దెబ్బతీసే వీటో అధికారాలు వైస్రాయ్‌కి వున్నాయి. స్వరాజ్ పార్టీ చేసిన కృషి ఫలితంగా జాతీయ ప్రతినిధులు చేసిన ఏకగ్రీవ నిర్ణయాలను త్రోసిపుచ్చడానికి వైస్రాయ్ అప్పుడప్పుడు ఈ అవశిష్ట అధికారాలను వినియోగించడం జరుగు తున్నది. దీనిపై మరికొంత చర్చ జరగాలన్న విషయం తెలిసిందే.

కార్యనిర్వాహక వర్గాన్ని ఏర్పాటు చేసే పద్ధతిని మనం ముందుగా చూడాలి. కార్యనిర్వాహక వర్గ సభ్యులు శాసనసభలోని ప్రజాప్రతినిధుల ద్వారా ఎన్నుకోబడతారా లేక మునపటిలాగా పై వారే నియమిస్తారా అన్న విషయాన్ని, దానితోపాటు కార్యనిర్వాహకవర్గం శాసనసభకు బాధ్యత వహిస్తుందా లేక గతంలో మాదిరిగా శాసనసభను అవమానపరుస్తుందా అన్న విషయాన్ని కూడా తెలుసుకోవడానికి మనం వేచి చూడాలి.

ఇక రెండవ విషయాన్ని పరిశీలించుదాం. ఓటు హక్కు పరిధిని బట్టి దాన్ని నిర్ణయించ వచ్చు. ఆస్తిని బట్టి ఒక వ్యక్తికి ఓటు హక్కు వచ్చే పద్ధతి పూర్తిగా రద్దు గావాలి. దాని స్థానే సార్వత్రిక ఓటు హక్కును ప్రవేశపెట్టాలి. ప్రతి వ్యక్తికి వయోజనులైన స్త్రీ, పురుషులందరికీ ఓటు హక్కును విస్తరింపజేస్తారో లేదో అప్పుడు మనం చూడాలి. రూపాన్ని బట్టి చూస్తే మనకు ద్విసభల ప్రభుత్వం వుంది. ఎగువ సభ బూర్జువాలకు చెందినదని, కేవలం మోసకారి అని నా అభిప్రాయం. ఏక సభా ప్రభుత్వమే మంచిదిగా మనం భావించవచ్చని నేననుకుంటున్నాను.

రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి గురించి నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను. నేను విన్నదాన్ని బట్టి గవర్నర్‌కు అసాధారణ అధికారాలను కట్టబెట్టడం జరిగింది. శాసనసభకు అతీతంగా వ్యవహరించే గవర్నర్ నిరంకుశుడని రుజువవుతుంది. దీనిని మనం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి అని గాక రాష్ట్ర నిరంకుశత్వమని పిలవవచ్చు. ఇది వింతగొలిపే ప్రజాతంత్ర ప్రభుత్వ సంస్థ.

**"నేను ఇంతకుముందు చెప్పినట్లు ఏ ఒక్క విప్లవ పార్టీకైనా ఒక నిర్దిష్టమైన కార్యక్రమం తప్పకుండా వుండాలి. విప్లవమంటే కార్యాచరణ అని మీరు తెలుసుకోవాలి. దాని అర్థం సంఘటితంగా, క్రమపద్ధతిలో పనిచేయడం ద్వారా ఉద్దేశ్యపూర్వకంగా తెచ్చే మార్పు. ఆకస్మికంగానో, అనాలోచితంగానో, అసంఘటితంగానో, నాటి ప్రభుత్వాన్ని కూల్చడం ద్వారానో తెచ్చే మార్పు తద్వ్యతిరేకమైనది."**

మూడవ విషయం స్పష్టమైనదే. గత రెండేళ్ళుగా మాంటేగ్ చేసిన వాగ్దానాలను అమలు జరపకుండా వుండేందుకు బ్రిటిష్ రాజకీయ వేత్తలు ప్రయత్నిస్తూనే బ్రిటిష్ ఖజానా అంతా ఖాళీ అయ్యే వరకూ ప్రతి పదేళ్ళకొకసారి ఇతర సంస్కరణలు చేస్తామంటున్నారు.

ఇక భవిష్యత్ గురించి వారేమి నిర్ణయించారో చూద్దాం.

ప్రస్తుత పరిస్థితిని చర్చించాము. గనుక భవిష్యత్ కార్యక్రమం గురించి, మనం చేపట్టవలసిన కార్యాచరణ పంథా గురించి మనం చర్చిద్దాం.


నేను ఇంతకుముందు చెప్పినట్లు ఏ ఒక్క విప్లవ పార్టీకైనా ఒక నిర్దిష్టమైన కార్యక్రమం తప్పకుండా వుండాలి. విప్లవమంటే కార్యాచరణ అని మీరు తెలుసుకోవాలి. దాని అర్థం సంఘటితంగా, క్రమపద్ధతిలో పనిచేయడం ద్వారా ఉద్దేశ్యపూర్వకంగా తెచ్చే మార్పు. ఆకస్మికంగానో, అనాలోచితంగానో, అసంఘటితంగానో, నాటి ప్రభుత్వాన్ని కూల్చడం ద్వారానో తెచ్చే మార్పు తద్వ్యతిరేకమైనది. కార్యక్రమాన్ని రూపొందించాలంటే తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిందే.

1) లక్ష్యం, 2) మనం ఎక్కడ నుండి ప్రారంభం కావాలో అంటే నేడు నెలకొని వున్న పరిస్థితులు, 3) కార్యాచరణ పంథాకు సంబంధించి స్పష్టమైన అవగాహన లేనట్టయితే కార్యక్రమానికి సంబంధించి ఎవరూ ఏమీ చర్చించలేరు.

మనం ప్రస్తుత పరిస్థితిని కొంతమేరకు చర్చించాము. లక్ష్యాన్ని కూడా కొద్దిగా అందుకున్నాం. మనం కోరేది సోషలిస్టు విప్లవం. దానికి రాజకీయ విప్లవం అనివార్యంగా కావల్సిందే. మనం కోరేది అదే. రాజకీయ విప్లవమంటే అర్థం ప్రభుత్వం (లేక మరింత మొరటుగా చెప్పాలంటే అధికారం) బ్రిటిష్ వారి నుండి భారతీయుల చేతుల్లోకి మారడం కాదు. అంతిమ లక్ష్యసాధనలో కలిసివుండే వారు ప్రజామద్దతుతో అధికారం విప్లవ పార్టీ చేతుల్లోకి మారుతున్నప్పుడు మరింత జాగరూకతతో వుండాలి. ఆ తర్వాత సోషలిస్టు సూత్రాల ప్రాతిపదికగా సమాజం మొత్తాన్ని పునర్నిర్మించే పనిని త్వరితంగా సాగించాలి. మీ ఉద్దేశ్యంలో ఇది విప్లవం కాకపోతే దయాభిక్ష పొందండి. 'విప్లవం వర్ధిల్లాలి' అని నినాదాలు చేయడం మానండి. విప్లవమనే పదాన్ని ఇతరులు తెలియక వాడినా, దుర్వినియోగం చేసినా మనకు మాత్రం అది చాలా పవిత్రమైనది. జాతీయ విప్లవం కోసం వేమున్నామని మీరు చెప్పేటట్లయితే మీ పోరాట లక్ష్యాలు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా తరహా భారత రిపబ్లిక్ కోసం ఉద్దేశించినవే. అటువంటి విప్లవం తీసుకురావడానికి మీరు ఏ శక్తుల మీద ఆధారపడతారో, మీకు తోడ్పడే శక్తులేవో నాకు చెప్పమని నేనడుగుతున్నాను. ఏ విప్లవం తేవాలన్నా అది జాతీయ విప్లవం కానివ్వండి, సోషలిస్టు విప్లవం కానివ్వండి మీరు ఆధారపడవలసింది రైతాంగం, కార్మికుల మీద మాత్రమే. ఆ శక్తులను సంఘటిత పరచడానికి కాంగ్రెస్ నాయకులు సాహసించడం లేదు. ఈ శక్తులు లేకపోతే తాము పూర్తిగా నిస్సహాయులమౌతామని ఇతరుల కంటే వారికే బాగా తెలుసు. సంపూర్ణ స్వరాజ్యం కోసం వారు తీర్మానం ఆమోదించినప్పుడు అది నిజానికి విప్లవం కోసం ఉద్దేశించింది కాదు. వారు దానిని అందుకోసం ఉద్దేశించలేదు. యువజనులు, ఇతర శక్తుల వొత్తిడి వల్ల వారా తీర్మానం చేయాల్సి వచ్చింది. తామనుకున్న అధినివేశ ప్రతిపత్తిని సాధించడం కోసం దానిని వినియోగించుకోవాలని వారనుకున్నారు.

గతంలో జరిగిన మూడు కాంగ్రెస్ మహాసభల తీర్మానాలను అంటే మద్రాస్, కలకత్తా, లాహోర్ సభలలో చేసిన తీర్మానాలను అధ్యయనం చేసినట్లయితే మనం సులభంగా

**"మీరు నాయకులుగా పార్టీకి ఎందుకూ పనికిరారు. సాయంత్రం వేళల్లో గంటల తరబడి ఉపన్యాసాలివ్వగల నాయకులనేమంది మనకిప్పటికే వున్నారు. వారి వల్ల ఉపయోగంలేదు. లెనిన్ మాటలకు దగ్గర పదం వాడాలంటే వృత్తిరీత్యా విప్లవకారులు, విప్లవం తప్ప జీవితంలో మరే పని లేనటువంటి, ఇతర కోర్కెలు లేనటువంటి, పూర్తికాలం పనిచేసే కార్యకర్తలు కావాలి."**



జాతీయోద్యమ నాయకలు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ

ఈ విషయం తెలుసుకోవచ్చు. కలకత్తా మహాసభలో 12 మాసాలలోగా డొమినియన్ ప్రతిపత్తి నివ్వాలనీ లేకపోతే సంపూర్ణ స్వరాజ్యమే తమ లక్ష్యంగా స్వీకరించాల్సి వస్తుందని తీర్మానం చేశారు. 1929 డిసెంబర్ 31 తరువాత అటువంటి బహుమానం కోసం ఎంతో ఆదుర్దాతో ఎదురు చూశారు. అప్పుడు స్వరాజ్య తీర్మానాన్ని ఆమోదించడం గౌరవప్రదమని వారు భావించారు. అన్యథా అయితే వారలా కోరేవారు కాదు. అప్పుడు కూడా రాజీ కోసం ద్వారాలు తెరిచే వున్నాయన్న విషయాన్ని మహాత్మాజీ రహస్యంగా వుంచలేదు. అసలు అంతరార్థం అదీ, తాము సాగించే ఉద్యమం తుది వరకూ సాగబోదని, ఏదో రాజీతో సమాప్తమౌతుందని వారికి మొదటి నుండీ తెలుసు. పోరాటం జరుగుతున్న ఒక ప్రత్యేక దశలో రాజీ పడుతున్నందుకు గాక కపటంతో వ్యవహరిస్తున్నందుకే మనం వారిని ద్వేషించేది. ఏమైనా విప్లవం కోసం మనం పోరాడేటప్పుడు ఏ శక్తుల మీద ఆధారపడవచ్చు అన్న విషయాన్ని మనం చర్చిస్తున్నాం. కార్మికుల, రైతుల క్రియాశీలక మద్దతు కోసం మనం వారిని కలుపుకుంటామని చెప్పొచ్చు. ఏవో నమ్మకమైన మాటల ద్వారా వారు మోసగింపబడరని మీరు నాకు చెప్పండి. త్యాగాలు చేయమని మీరు వారిని కోరుతున్నందుకు మీరు తెచ్చే విప్లవం వల్ల తమ కొరిగేదేమిటని వారు మిమ్మల్ని సూటిగా అడుగుతారు. భారత ప్రభుత్వ అధినేతగా లార్డ్‌రీడింగ్ అయితేనేమి, సర్ పురుషోత్తమ దాస్ ఠాకూర్ దాస్ అయితేనేమి, వారికి తేడా ఏముంది? అతనికున్న జాతీయ విశ్వాసం కోసం అభ్యర్థించటం నిరుపయోగం. మీ ప్రయోజనం కోసం అతన్ని "ఉపయోగించుకో" కూడదు. విప్లవం నీ కోసం, నీ మంచి కోసం సాగుతున్నదని అతనికి అర్థమయ్యేటట్లు చేయాలంటే మీకు పట్టుదల వుండాలి. కార్మిక విప్లవం కార్మికుల కోసమే.

మీ లక్ష్యాల గురించి ఇటువంటి స్పష్టమైన అవగాహన కలుగజేసినట్లయితే అటువంటి కార్యాచరణ కోసం మీరు మీ శక్తులను సక్రమంగా త్వరగా సంఘటిత పరచగలరు. ఇప్పుడు మీరు రెండు విభిన్న దశలగుండా ప్రయాణించాల్సి వుంటుంది. మొదటిది సన్నాహాలు చేయడం. రెండవది కార్యాచరణకు ఉపక్రమించడం.

ఇప్పటి ఉద్యమం ముగిశాక నిజమయిన విప్లవ కార్యకర్తల మధ్య నిరాశా నిస్పృహలు మీకు కన్పిస్తాయి. అయితే అందుకు మీరు బాధపడాల్సిన పని లేదు. విప్లవమనేది చాలా క్లిష్టమైనది. విప్లవం తీసుకురావడమన్నది ఏఒక్క వ్యక్తికీ సాధ్యమయేది కాదు. నిర్ణయించిన తేదీకి తీసుకొచ్చేదికాదు. అది ప్రత్యేక సాంఘిక, ఆర్థిక, పరిసర ప్రభావాలతో తీసుకొచ్చేది. ఈ పరిస్థితులు ఇచ్చే ఏ అవకాశాన్నైనా వినియోగించుకునే సంఘటిత పార్టీ ఒకటి పని చేయాలి. విప్లవానికి ప్రజా బాహుళ్యాన్ని సన్నద్ధం చేసి ఆ శక్తులను సంఘటిత పరచడమన్నది చాలా క్లిష్టమైన కర్తవ్యం. ఇందుకు విప్లవ కార్యకర్తలు మహత్తర త్యాగాలు చేయవలసి వుంటుంది. వీరు వ్యాపారస్తులో లేక బాగా స్థిరపడ్డవారో లేక ధనిక కుటుంబీకులో నాకు చెప్పండి. దయచేసి నిప్పుతో చెలగాటమాడవద్దు.

మీరు నాయకులుగా పార్టీకి ఎందుకూ పనికిరారు. సాయంత్రం వేళల్లో గంటల తరబడి ఉపన్యాసాలివ్వగల నాయకులనేమంది మనకిప్పటికే వున్నారు. వారి వల్ల ఉపయోగంలేదు. లెనిన్ మాటలకు దగ్గర పదం వాడాలంటే వృత్తిరీత్యా విప్లవకారులు, విప్లవం తప్ప జీవితంలో మరే పని లేనటువంటి, ఇతర కోర్కెలు లేనటువంటి, పూర్తికాలం పనిచేసే కార్యకర్తలు కావాలి. ఇటువంటి కార్యకర్తలను పార్టీకి అధిక సంఖ్యలో సమీకరించినట్లయితే మీరు జయప్రదం కావడానికి ఎక్కువ అవకాశాలు వుంటాయి.

క్రమపద్ధతిలో ముందుకు సాగాలంటే స్పష్టమైన భావాలతో పై విషయాలను చర్చించి సునిశిత పరిశీలన, చొరవ, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగిన కార్యకర్తలతో కూడిన పార్టీ మీకు అవసరమౌతుంది. పార్టీ ఉక్కు శిక్షణ కలిగి వుండాలి. అది అజ్ఞాత పార్టీ అయి ఉండాల్సిన పని లేదు. తద్విరుద్ధంగానూ ఉండనక్కర్లేదు. స్వచ్ఛందంగా జైలుకెళ్ళే విధానం ఉన్నప్పటికీ తప్పనిసరైై అజ్ఞాతజీవితం కూడా గడపవలసి రావచ్చు. అప్పుడు కూడా అదే ఉత్సాహంతో కృషి చేయాల్సి వుంటుంది. ఈ తరహాకు చెందిన కార్యకర్తల బృందవే నిజంగా అవకాశమొచ్చే నాటికి కావలసిన సమర్థులైన నాయకులను తయారు చేస్తుంది.

యువజనోద్యమం ద్వారానే పార్టీలోకి కార్యకర్తలను చేర్చుకోవాల్సి వుంటుంది. కనుక యువజనోద్యమాన్ని మనం మన కార్యక్రమానికి ప్రారంభకేంద్రంగా ఎంచుకోవాలి. యువజనోద్యమం అధ్యయన కేంద్రాలను, ఉపన్యాసాలను నిర్వహించాలి. పుస్తకాలను. పత్రికలను, కరపత్రాలను ప్రచురించి నడపాలి.

రాజకీయ కార్యకర్తలను చేర్చుకోవడానికి శిక్షణ గరపడానికి ఇది మంచి ప్రాతిపదిక.

తమ భావాలను వంటబట్టించుకున్న యువకుల్లో అనేకమంది తమ జీవితాలను విప్లవం కోసం, పార్టీ కోసం అంకితం చేయడానికి సిద్ధపడతారు. వారిని పార్టీలోకి తీసుకోవాలి. పార్టీ కార్యకర్తలు సదా యువజనోద్యమాన్ని, నిర్వహణను నియంత్రిస్తూ మార్గదర్శకత్వం నెరపాలి. జనబహుళ్యంలో ప్రచారానికి దారితీసే కార్యక్రమంతో పార్టీ పని ప్రారంభించాలి. అది ఎంతో అవసరం. గదర్ పార్టీ (1914–15) ప్రయత్నాలు విఫలం గావడానికి మౌలిక కారణాలలో ఒకటి నిర్లక్ష్యం, అజ్ఞానం, కొన్ని కొన్ని సందర్భాలలో వారికి ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావటం, రైతుల, కార్మికుల సానుభూతి పొందటం, వారిని సంఘటితపరచడం తప్పనిసరి. పార్టీ పేరు కమ్యూనిస్టు పార్టీగానీయండి, మరొకటి గానీయండి ఆ పార్టీ రాజకీయ కార్యకర్తలదై వుండాలి. గట్టి క్రమశిక్షణగల్గి ఇతర ఉద్యమాలన్నింటినీ నిర్వహించగలిగినదై ఉండాలి. అది రైతులకు, కార్మికులకు చెందిన పార్టీలను కూడా సంఘటితం చేయాలి. కార్మిక సంఘాలు కాంగ్రెస్‌ను లేదా ఆ రకమైన సారూప్యత కలిగిన రాజకీయ పార్టీలను అధీనంలోకి తెచ్చుకోవచ్చు. రాజకీయ చైతన్యం కలిగించడానికి జాతీయ రాజకీయాలనే కాకుండా వర్గ రాజకీయాలను కూడా బోధించాలి. పార్టీ పెద్ద ఎత్తున ప్రచురణ కార్యక్రమాన్ని నిర్వహించాలి. సోషలిస్టు సిద్ధాంతాన్ని ప్రజాబాహుళ్యానికి వివరించేందుకు అన్ని సమస్యలపైనా గ్రంథాలను ప్రచురించి సులభంగా వారికి అందేలా, పంపిణీ అయ్యేలా చూడాలి. రచనలు సులభశైలిలో స్పష్టంగా వుండాలి.

రాజకీయ స్వేచ్ఛ లేకుండానే కార్మికులకు, రైతులకు ఆర్థిక స్వేచ్ఛ వుండాలనే కొన్ని అవహేన్య భావాలు కలిగిన ప్రజలు కార్మికోద్యమాలలో వున్నారు. వారు విచ్ఛిన్నకులు లేదా గందరగోళపరిచేవారు. అటువంటి భావాలు ఊహింపశక్యంగానివి, ప్రకృతి విరుద్ధమైనవి. ప్రజా బాహుళ్యానికి ఆర్థిక స్వాతంత్ర్యం కావాలన్నది మన భావన. అందుకోసమే మనం అధికారాన్ని హస్తగతం చేసుకోవాలంటున్నాం. ప్రారంభంలో ఈ తరగతులకు చెందిన ప్రజల చిన్న చిన్న ఆర్థిక కోర్కెల కోసం, హక్కుల కోసం మనం పోరాడాలనడంలో ఎటువంటి సందేహం లేదు. రాజకీయాధికారాన్ని జయించే అంతిమ

> **"నేను టెర్రరిస్టును కానేకాదు. విప్లవ జీవిత ప్రారంభదినాలలో మినహా నేనెన్నడూ టెర్రరిస్టుగా లేను. ఆ పద్ధతుల ద్వారా మనం సాధించేదేమీ లేదని నేనర్థం చేసుకున్నా. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ సంస్థ చరిత్ర ద్వారా ఎవరయినా ఈ నిర్ణయానికి రాగలరు. మన కార్యక్రమాలన్నీ ఒక లక్ష్యంవైపు ఉద్దేశించబడ్డాయి."**

పోరాటానికి కావలసిన చైతన్యాన్ని కలిగించేందుకు ఈ పోరాటాలే సరైన మార్గాలు. ఇంతే గాకుండా మనం సైనిక విభాగాన్ని నిర్వహించాల్సిన అవసరం కూడా వుంది. ఇది చాలా ముఖ్యం. అవసరమొచ్చినప్పుడు దీని అవసరం ఎంతగానో వున్నట్లు భావిస్తాం. అయితే అప్పటికప్పుడు ఆ విభాగాన్ని ఏర్పాటు చేసి, దాన్ని శక్తివంతంగా పనిచేసేటట్లు చేయలేదు. జాగ్రత్తగా వివరించాల్సిన అంశమిది. ఈ అంశాన్ని పొరపాటుగా అర్థం చేసుకొనేందుకు ఎక్కువ అవకాశం వుంది.

పైకి నేను టెర్రరిస్టుగా వ్యవహరించినట్లు కనిపిస్తాను. కాని నేను టెర్రరిస్టును కాను. ఇక్కడ చర్చించినట్లుగా సుదీర్ఘ కార్యక్రమంతో నిర్దిష్ట భావాలు కలిగిన విప్లవకారుణ్ణి నేను. రామ్ ప్రసాద్ బిస్మిల్ వంటి సాయుధులైన నా కామ్రేడ్స్ నేను కండెమ్డ్ సెల్‌లో వుండి ఒక విధమైన మార్పుకు లోనైనందుకు (ఇది నిజం కాదు) నన్ను నిందించవచ్చు. నేను మునుపటి భావాలతోనే, మునుపటి దృఢనిశ్చయంతోనే, మునుపటి ఉత్సాహంతోనే వున్నాను. వెలుపల ఎలా ఉన్నానో ఇక్కడ కూడా అంత పట్టుదలతోనే ఉన్నాను. అందువల్ల నామాటలను చదవబోయేముందు నేను నా పాఠకులను హెచ్చరిస్తున్నాను. ఈ వ్యాఖ్యలను వక్రంగా చదవడానికి వారు యత్నించరాదు. నేను విస్పష్టంగా చెప్పదలిచాను. నేను టెర్రరిస్టును కానేకాదు. విప్లవ జీవిత ప్రారంభదినాలలో మినహా నేనెన్నడూ టెర్రరిస్టుగా లేను. ఆ పద్ధతుల ద్వారా మనం సాధించేదేమీ లేదని నేనర్థం చేసుకున్నా. హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ సంస్థ చరిత్ర ద్వారా ఎవరయినా ఈ నిర్ణయానికి రాగలరు. మన కార్యక్రమాలన్నీ ఒక లక్ష్యంవైపు ఉద్దేశించబడ్డాయి. అంటే మహా ఉద్యమంలోనూ దాని సైనిక విభాగంలోనూ మన స్థానం నిర్ణయించుకుంటున్నాము.

నా గురించి ఎవరైనా అపార్థం చేసుకుంటే వారు తమ అభిప్రాయాన్ని మార్చుకోవాలి. బాంబులు, పిస్టోళ్ళు నిరుపయోగమైనవన్నది నా భావన కాదు. బాంబులు విసరటమన్నది నిరుపయోగమేగాకుండా కొన్ని కొన్ని సందర్భాలలో హానికరం కూడా. పార్టీ సైనిక విభాగాన్ని యుద్ధ పరికరాలన్నింటితో సర్వదా సంసిద్ధంగా వుంచాలి. అప్పుడే అది అత్యవసర సమయాలలో కర్తవ్యం నిర్వహించగలదు. పార్టీ రాజకీయ కార్యక్రమ నిర్వహణకు అది అండగా వుండాలి. అది స్వతంత్రంగా వ్యవహరించరాదు.

పైన పేర్కొన్న మార్గాన పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించాలి. నిర్ణీత వ్యవధిలో సమావేశాలు, సదస్సులు నిర్వహించడం ద్వారా వారు అన్ని అంశాలపై కార్యకర్తలను చైతన్యవంతుల్ని, విజ్ఞానవంతుల్నిచేయాలి.

ఈ మార్గాలలో మీరు పనిచేయడం ప్రారంభించినట్టయితే చాలా ఉత్సాహంగా వుండాలి. ఈ కార్యక్రమం నెరవేరాలంటే కనీసం 20 సంవత్సరాలు పడుతుంది. పదేళ్ళలోనే విప్లవం వస్తుందనే కుర్రతనపు కలలను, ఏడాదిలో స్వరాజ్యమొస్తుందనే గాంధీ కాల్పనిక వాగ్దానాలను ప్రక్కన పెట్టండి. విప్లవానికి కావలసింది ఉద్రేకం, చావటం కాదు. నిరంతర పోరాటం కావాలి. బాధలను భరించాలి. త్యాగం కావాలి. ముందు నీ అహంభావాన్ని తొలగించు. వ్యక్తిగత సౌఖ్యానికి సంబంధించి కలలను తుడిచెయ్యి. అప్పుడు పని ప్రారంభించు. ఇందుకు ధైర్యం, సంరక్షణ, అకుంఠిత దీక్ష అవసరం. ఎటువంటి కష్టాలూ అడ్డంకులూ నిన్ను నిరుత్సాహపరచవు. ఏ వైఫల్యమూ, విచ్ఛిన్నతలూ నిన్ను అధైర్యపరచవు. నీపై మోపే ఎటువంటి బాధలూ నీలోని విప్లవ చేవను చంపలేవు. బాధల అగ్నిపరీక్షలను తట్టుకొని త్యాగాల ద్వారా నీవు విజయునిగా బైటకి వస్తావు. ఈ వ్యక్తిగత విజయాలే విప్లవానికి విలువైన ఆస్తులౌతాయి. ❋

చరిత్ర

# సింధు ప్రజల వాణిజ్యం

**యం.వి.ఎస్. శర్మ**




రచయిత సంపాదకులు

సింధు నాగరికత విలసిల్లిన కాలంలో వాణిజ్యం విస్తృతంగా సాగింది. మొహంజదారో, హరప్పా పట్టణాలతో బాటు కాలీబంగన్ (ప్రస్తుత రాజస్థాన్‌లో) లోథల్ (ప్రస్తుత గుజరాత్‌లో) వంటి పట్టణాలు ఈ వాణిజ్యం యొక్క విస్తృతిని సూచిస్తున్నాయి. ఈ వాణిజ్యం మూడు స్థాయిలలో జరిగింది. మొదటిది: గ్రామాలకు, పట్టణాలకు నడుమ: రెండవది: సింధునాగరికత విస్తరించిన మొత్తం ప్రాంతం అంతటా ఒక మూల నుంచి ఇంకొక మూలకు సాగిన దూర ప్రాంత వ్యాపారం: మూడవది: సింధు ప్రాంతానికి ఆవల భూగోళం మీద ఇతర ప్రదేశాలతో జరిగిన వ్యాపారం.

గ్రామాల నుండి పట్టణాలకు ప్రధానంగా ధాన్యం వర్తకం జరిగేది. మొహంజొదారో, హరప్పా నగరాల్లో బైటపడిన పెద్ద పెద్ద ధాన్యాగారాలు ఈ వ్యాపార విస్తృతిని సూచిస్తున్నాయి. ఎద్దుబళ్లు, నదీమార్గాన అయితే చిన్న పడవలు ఈ ధాన్యం రవాణాలో వినియోగించారు. పట్టణాల్లో సాగిన మరో వ్యాపారం చేతివృత్తులు. శంఖాలు, కెంపులు, రంగు చలువలరాళ్లు, చెకుముకి రాళ్లు వంటి పనిముట్లను ఆభరణాల తయారీలో వాడేవారు. సముద్రతీరాల్లో దొరికే శంఖాలు సముద్రానికి దూరంగా ఉండే పట్టణాల్లోని చేతివృత్తుల ఉత్పత్తి కేంద్రాల వద్ద లభించాయి. దీనినిబట్టి సుదూరప్రాంతాలకు ఈ రకమైన సరుకులను తీసుకుపోయి వ్యాపారం చేసినట్టు స్పష్టం అవుతోంది. సింధు, దాని ఉపనదుల ప్రవాహ మార్గాలు ఈ సరుకు రవాణాకి బాగా తోడ్పడ్డాయి. దూరప్రాంతాలకు రహదారులు ఏర్పడని ఆ కాలంలో అంతంత దూరాలకు ఎడ్లబండ్లపై సరుకులను రవాణా చేయడం కష్టం అవుతుంది.

సింధు నాగరికత ప్రాంతం అంతటా ఇటుకలు ఒకే విధమైన కొలతలతో తయారై ఉన్నాయని మనం గతంలోనే చెప్పుకున్నాం. వీటిని కొన్ని కేంద్రాలలో ఉత్పత్తి చేసి అన్ని ప్రాంతాలకూ తరలించి ఉంటారని అనుకోలేం. అంత భారీ పరిమాణంలో ఇటుకలను వేరువేరు ప్రాంతాలకు

**టెబుల్ 2.2 సింధు లోయలోని కొన్ని ముఖ్యమైన చిహ్నాలు**



| | |
|---|---|
| 1 | చేప |
| 2 | మనిషి |
| 3 | శ్రామికుడు |
| 4 | జాడి |
| 5 | మూడు జాడీలు |
| 6 | భిన్నమైన చేప |
| 7 | మరొక భిన్నమైన చేప |
| 8 | వేరొక భిన్నమైన చేప |
| 9 | కుడివైపున కనిపించిన భిన్నమైన చిహ్నం |
| 10 | కుడిచివర కనిపించి భిన్నమైన చిహ్నం |
| 11 | ఎడమచివర కనిపించిన భిన్నమైన చిహ్నం |
| 12 | ఎడమచివర కనిపించిన భిన్నమైన చిహ్నం |
| 13 | ఐదవ భాగంలోని మూడు జాడీలు |
| 14 | పదిహేను? |
| 15 | చానూ దారో |
| 16 | ఏడు నక్షత్రాలు |




చిత్రం 2.19
క్రూరమృగాల మధ్య దేవుని విగ్రహం



చిత్రం 2.23
ఇద్దరు యోధుల మధ్య పోరాటాన్ని ఆపుతున్న మహిళ



2.21
మొహంజదారోలో తల్లి దేవత మట్టి శిల్పం



చిత్రం 2.18
హరప్పాలో ఒక జంతు చిహ్నం

**"సింధు ప్రజలు ఒకే ఒక మతాన్ని, ఆరాధన పద్ధతిని ఆచరించారని చెప్పే దాఖలాలు లేవు. వేరు వేరు తరగతుల ప్రజలు, వేరు వేరు ప్రాంతాల్లో రకరకాల మతాచారాలను పాటించారని అనుకోవచ్చు. లభించిన సీళ్లలో అత్యధిక భాగం ఒంటికొమ్ముతో ఉండే మూపురం లేని ఎద్దు ఆకృతితో ఉన్నాయి. ఇటువంటి జంతువు ఖచ్చితంగా కాల్పనిక జంతువే."**

తరలించగలిగే రవాణా సాధనాలు ఆ కాలంలో లేవు. కనుక ఇటుకల తయారీ టెక్నాలజీని అన్ని నగరాల్లోకి దిగుమతి చేసుకుని ఆ నైపుణ్యాన్ని వాడుకున్నారని భావించాలి.

ఐతే ఆ కాలంలో వ్యాపారం జరిగిందంటే సరుకుల మార్పిడి, లేదా కొనుగోళ్లు, అమ్మకాలు ఏ ప్రాతిపదికన జరిగి ఉండాలి? సింధు నాగరికత తవ్వకాలలో నాణేలు ఎక్కడా లభించలేదు. సరుకుల మార్పిడికే (బార్టరు పద్ధతికే) పరిమితం అయితే అంత విస్తృతంగా వ్యాపారం జరిగే అవకాశం లేదు. కనుక మారకపు సాధనాలుగా నిర్దిష్ట పరిమాణంలో ధాన్యం, లేదా కెంపులు, రంగురాళ్లు, శంఖాలు వంటివి ఉపయోగపడి ఉండాలి. వీటితోపాటు అక్కడ విస్తారంగా లభించిన సీళ్లు కూడా ఒక విధమైన హామీగా (నేటి ప్రామిసరీ నోట్లు మాదిరి) ఉపయోగించి ఉండాలి. ఈ సీళ్లు ఒకే నిర్దిష్టమైన సైజులో ఉన్నాయి. అయితే ప్రతి వర్తకునికీ ప్రత్యేకమైన సీళ్లు ఉండి వుండొచ్చు. ఆ సీళ్లమీద ఉన్న గుర్తులు, బొమ్మలను బట్టి ఈ అంశం ధృవపడుతోంది.

రాజస్థాన్ ప్రాంతం ఈ వ్యాపారంలో ఒక కేంద్రస్థానం కలిగి ఉంది. ఇక్కడ విస్తారంగా లభించిన రాగి నిల్వలు ఇందుకు కారణం. మొత్తం సింధు నాగరికత విస్తరించిన ప్రాంతం అంతటికీ రాగి పరికరాలను సరఫరా చేసే కేంద్రాలు ఈ రాజస్థాన్ ప్రాంతపు పట్టణాల నుండి పనిచేశాయి. కాశ్మీర్ ప్రాంతంలో ఇదే కాలంలో (క్రీ.పూ 2500–2000 మధ్య) పింగాణీ సరుకుల తయారీ సాగింది. అక్కడి పింగాణీ సరుకులు సింధు ప్రాంతానికి వచ్చి వుండొచ్చు. దానితో పాటు సింధు ప్రాంత హస్తకళా శిల్పులు ఉంగరాల్లో, గొలుసుల్లో ఉపయోగించిన మరకతపు రాళ్లు కాశ్మీర్ నుంచే తెచ్చుకుని ఉండాలి. చైనాలోని ఖోటాన్‌ప్రాంతం (ప్రస్తుత సిన్ జియాంగ్) నుండి కాశ్మీర్ వ్యాపారులు కారకోరం పర్వత శ్రేణుల గుండా ఈ మరకతపు రాళ్లను దిగుమతి చేసుకున్నారు.

ఇటు సింధు ప్రాంతానికి దిగువన ప్రస్తుత మహారాష్ట్రలోని ఎగువ గోదావరి లోయ ప్రాంతాల్లో క్రీ.పూ 1900–1700 మధ్యకాలానికి చెందిన కొన్ని అవశేషాలు చూస్తే అక్కడ సింధు ప్రాంతపు సీళ్లు, రంగురాళ్లు దొరికాయి. అటువంటి ఆధారాలే మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ప్రాంతంలోనూ దొరికాయి. దీనిని బట్టి అటు కాశ్మీర్ నుండి ఇటు మధ్యప్రదేశ్– మహారాష్ట్ర వరకూ సింధు నాగరికత కాలంలో వ్యాపారం జరిగినట్టు భావించాలి.

ఇక సింధు నాగరికత తవ్వకాలలో దొరికిన ఆధారాలను బట్టి పరిమితంగానైనా సింధు ప్రజలు వెండి లోహాన్ని ఉపయోగించిన దాఖలాలు ఉన్నాయి. ఉత్తర ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోని పంజ్‌శిర్ లోయ నుండి ఎక్కువ భాగం వెండి నదీ మార్గాల గుండా సింధు ప్రాంతానికి రవాణా అయింది. ఇంద్రనీల మణి రాళ్లు విస్తృతంగా దొరికే ప్రాంతం కూడా ఇదే. ఆ రాళ్లు కూడా సింధు ప్రాంతానికి ఎగుమతి అయ్యాయి.

ఆఫ్ఘనిస్తాన్ నుంచి మరింత ఉత్తర వాయవ్యదిశగా ఉన్న తుర్క్‌మెనిస్థాన్‌లో దొరికిన ఆధారాలను బట్టి సింధు ప్రజలకు ఇక్కడి ప్రజలతో వ్యాపార సంబంధాలు ఉండినట్టు కనపడుతోంది. ఇరాన్, ఒమన్ సింధుశాఖ, ఇరాక్‌లో దొరికిన ఆధారాలు, సీళ్లు, రంగురాళ్లు, కుండలు, పనిముట్లు సింధు నాగరిక ప్రజలు ఆ ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు కలిగివున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. అరేబియా సముద్రతీరం వెంబడి తెప్పలలో వ్యాపారులు ఈ రాకపోకలను సాగించి ఉండాలి.

నేటికి 4,500 సంవత్సరాల క్రితం ఇటు చైనా నుంచి అటు మెసపుటేమియా (ఇరాక్) వరకు వ్యాపార సంబంధాలు కలిగి ఉండడం అందునా ఎటువంటి సమాచార వ్యవస్థా అభివృద్ధి చెందని కాలంలో ఇది జరగడం ఆశ్చర్యం గొలిపే విషయం.

(మిగతా 31వ పేజీలో)

# కరోనా వైరస్ కట్టడిలో చైనా ఆదర్శం



రచయిత మార్క్సిస్టు సంపాదకులు

ఎస్. వెంకట్రావు

కరోనా వైరస్ అంటువ్యాధిని నిరోధించడంలో ప్రపంచం అబ్బురపడే విధంగా చైనా ప్రభుత్వం, కమ్యూనిస్టు పార్టీ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు రెండు విషయాలను ప్రముఖంగా వెల్లడిస్తున్నాయి. మొదటిది, కష్టకాలం వచ్చినప్పుడు, వైపరీత్యాలు సంభవించేటప్పుడు ప్రజలను రక్షించడంలో ప్రజా ప్రభుత్వం, ప్రభుత్వ రంగం నిర్వహించే మహత్తర కృషిని ప్రపంచానికి చూపిస్తున్నాయి. లాభాలే పరమావధిగా పనిచేసే ప్రయివేటు రంగానికి పెద్ద పీట వేసే దేశాలకు భిన్నంగా చైనా ప్రభుత్వం, ప్రభుత్వ రంగం, ప్రజలూ, పార్టీ అంతా ఒకే లక్ష్యంతో వైరస్‌పై జరుపుతున్న యుద్ధం సోషలిస్టు వ్యవస్థ గొప్పదనాన్ని, కమ్యూనిస్టు పార్టీ దక్షతనూ వెల్లడిస్తోంది. ఇక రెండవది, ఈ వ్యవస్థ విశిష్టతను ప్రజలు అర్థం చేసుకోకుండా వారిని గందరగోళ పరచడం కోసం ఈ సందర్భంగా పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా, దాని మీడియా చేస్తున్న దుష్ప్రచారం ప్రచ్ఛన్న యుద్ధం నాటి పరిస్థితిని తలపిస్తోంది.

చైనాలోని హుబీ రాష్ట్రంలోని వూహాన్ నగరం కేంద్రంగా బయలు దేరిన కరోనావైరస్ అంటువ్యాధిని చైనా వైద్యాధికారులు జనవరి 21న గుర్తించారు. 25 నుండి చైనా కొత్త సంవత్సరం ప్రారంభ వేడుకలకు సన్నాహాలు జరుగుతుండగా వైరస్ సోకిన వ్యక్తులు జ్వరం, జలుబు, ఊపిరి పీల్చుకోలేకపోవడం వంటి లక్షణాలతో వూహాన్ నగర ఆసుపత్రులకు రావడం ప్రారంభించారు. కొద్ది రోజుల్లోనే వేల సంఖ్యకు చేరుకున్నారు. నెల చివరికి ఈ కేసులు 10 వేలకు చేరుకున్నాయి. జనవరి 23న ఈ వ్యాధితో మరణించిన వారి సంఖ్య 8 కాగా మరునాటికి రెట్టింపయి 16కి పెరిగింది. క్రమంగా మృతుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఫిబ్రవరి 27 నాటికి దేశంలో 78,000 మందికి వ్యాధి సోకగా 2,800 మంది మరణించారు.

ప్రపంచ వ్యాపితంగా చైనా కాకుండా మరో 48 దేశాలకు వ్యాధి పాకింది. మధ్య ప్రాచ్యంలోని ఎనిమిది దేశాలు, తూర్పు ఆసియాలో జపాన్‌తో సహా అనేక దేశాలు, యూరప్‌లో ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలకు ఈ అంటువ్యాధి సోకింది. అమెరికాలో కూడా కరోనా వైరస్ కేసులు నమోదైనాయి. చైనా బయట ఇప్పటి వరకు 2900 మందికి పైగా ఈ వ్యాధి సోకగా ఇరాన్‌లో 26 మంది, దక్షిణ కొరియాలో 13 మంది, ఇటలీలో 14 మంది చనిపోయారు. ఇరాన్, దక్షిణ కొరియా, ఇటలీ, జపాన్‌లలో వ్యాధి శీఘ్రంగా వ్యాపిస్తోంది.

చైనా నుండి మరీ ముఖ్యంగా ఆ దేశంలోని హూబీ రాష్ట్రంలోని వూహాన్ నగరం నుండి ప్రపంచ మంతటికీ వ్యాధి వ్యాపించినట్లు చెబుతున్నారు. కానీ అనేక దేశాల్లో ఎటువంటి ప్రయాణాలు చేయని, చైనాతో సంబంధం లేని వారికి ఈ వ్యాధి సోకిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఫ్రాన్స్, అమెరికాల్లో అసలు ఎవరితోనూ సాంగత్యంలేని వ్యక్తులకు ఈ వ్యాధి సోకిన కేసులు బయటపడ్డాయి. అంటే వారికి మనుషుల ద్వారా కాకుండా ఇంకో వాహకం ద్వారా సోకిందన్న మాట. అమెరికాతో సహా ఇది ప్రపంచ మంతటా పెద్ద ఎత్తున వ్యాపించే ప్రమాదం ఉందని ఈ సంస్థ హెచ్చరించింది.

కోవిడ్-19 (కరోనా వైరస్ డిసీజ్-19) గా పిలవ బడుతున్న ఈ వ్యాధి ఒకవైపు ప్రపంచ మంతటా వ్యాపిస్తుంటే చైనాలో వ్యాధిని నిరోధించడంలో, వ్యాధి సోకిన వారికి వైద్యం అందించడంలో, వ్యాధి ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అడ్డుకోవడంలో అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రపంచాన్ని అబ్బురపరిచాయి.

జనవరి 25న చైనా కొత్త సంవత్సరం సందర్భంగా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్ నాయకత్వంలో జరిగిన పార్టీ స్థాయి సంఘ సమావేశం కరోనావైరస్‌పై 'ప్రజా యుద్ధం' ప్రకటించింది. మనుషుల ఊపిరితిత్తులకు ఈ వైరస్ సోకి అక్కడి కణజాలాలను నాశనం చేస్తుంది. వ్యాధి సోకిన తరువాత నాలుగైదు రోజులకు వ్యాధి లక్షణాలు (దగ్గు, జలుబు, జ్వరం, ఆయాసం) బయటపడతాయి, వ్యాధి ముదిరితే 14 రోజులకు రోగులు చనిపోతారు. ఉపశమనం కల్పించడం, రోగనిరోధక శక్తి పెంచడం మినహా వైరస్‌కు మందులేదు. అందువల్ల వైరస్ ఇతరులకు సోకకుండా నివారించడం, సోకినవారికి చికిత్స అందించడం ప్రధాన లక్ష్యాలుగా చైనా ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మొత్తం కదిలింది. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం అత్యంత ప్రధానం అని సి జిన్‌పింగ్ ప్రకటించారు. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడం, నియంత్రించడం అన్ని స్థాయిల్లో పార్టీ, ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యం అని పార్టీ కేంద్రకమిటీ ఆదేశించింది. జనవరి 27న జిన్‌పింగ్ ఒక ప్రకటన చేస్తూ పార్టీ నాయకులు, సభ్యులు యుద్ధ రంగంలో ముందు వరసలో ఉండాలని ఆదేశించారు. యుద్ధంలో అంతర్జాతీయ సహకారంతో చైనా ప్రజలు విజయం సాధిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

పార్టీ ఆదేశాల మేరకు పార్టీ, ప్రజలు, సైన్యం అంతా ఒకే లక్ష్యంతో యుద్ధ రంగంలోకి దిగారు. కొత్త సంవత్సరం సెలవులను మరో పదిరోజులు పొడిగించారు. వైరస్ మనిషి నుండి మనిషికి వ్యాపిస్తుంది గనుక రోగం బారిన పడ్డ మనుషులను వేరుచేయాలి. అయితే ఈ కరోనా వైరస్ రోగలక్షణాలు కనబడక ముందే ఇతరులకు వ్యాపిస్తోంది. అందువల్ల వైరస్ పుట్టిన వూహాన్ నగరం మొత్తాన్ని వేరు చేసేశారు. నగరంలో ఒకరిని ఒకరు

తాకకుండా, నగరం నుండి ప్రజలు బయటకు వెళ్లకుండా, నగరంలోకి ఇతరులు రాకుండా చేశారు. నగర ప్రజలకు ఆహారం, మందులు, నిత్యావసరాలను ఇంటింటికీ వాలంటీర్లు అందించడం ప్రారంభించారు. కోటీ పది లక్షల మంది ప్రజలున్న నగరాన్ని బయటి ప్రపంచం నుండి కటాఫ్ చేయడం అంత తేలికైన విషయం కాదు. అయినా ప్రజల సహకారంతో సాధించారు. వైరస్ ఒకరినుండి ఒకరికి సోకకుండా దేశంలో పారిశ్రామిక కార్యకలాపాలు నిలిపేశారు. వ్యాపారాలు బంద్ చేశారు. రోగం నుండి రక్షించుకోడానికి కావలసిన దుస్తులు, వైద్య పరికరాలు, డిజిటల్ థర్మోమీటర్లు, మాస్కుల ఉత్పత్తి పెంచారు. ప్రజల శరీర ఉష్ణోగ్రత గుర్తిండానికి డిజిటల్ థర్మోమీటర్లు విస్తృతంగా ఉపయోగించారు.

వైరస్‌ను గుర్తించిన కొద్ది రోజుల్లోనే చైనా శాస్త్రవేత్తలు దాని జన్యు నిర్మాణాన్ని గుర్తించి ఇంటర్‌నెట్‌లో పెట్టారు. దాంతో ఈ జన్యునిర్మాణం అధారంగా వ్యాక్సిన్ తయారీ కృషి ప్రపంచ వ్యాపితంగా ప్రారంభమైంది.

ఇంకో వైపు ప్రపంచాన్నే ఆశ్చర్య పరిచే విధంగా రెండు వారాల వ్యవధిలో వెయ్యికి పైగా పడకలు గల రెండు పెద్ద ఆసుపత్రులను వూహాన్‌లో నిర్మించారు. మొదటిది, 'హూషెన్‌షాన్' ఆసుపత్రి. 15 ఎకరాల స్థలంలో రెండు అంతస్తుల్లో 1000 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని జనవరి 22న ప్రారంభించి 10 రోజుల్లో పూర్తి చేశారు. ఈ నిర్మాణాన్ని సోషల్ మీడియాలో పది రోజులపాటు లైవ్ ప్రసారం చేశారు. ఈ నిర్మాణం పూర్తి చేయడానికి 7,500 మంది కార్మికులు రాత్రింబవళ్లు పనిచేశారు. "మేం ఇక్కడ తొమ్మిది రోజులుగా పని చేస్తున్నాం. రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్రపోతున్నాం" అని నిర్మాణంలో పాల్గొన్న ఒక కార్మికుడు చెప్పాడు. పది రోజుల్లో నిర్మాణం పూర్తి చేయడమే కాదు రెండు రోజుల్లో ఆసుపత్రికి అధునాతన పరికరాలు అమర్చి వినియోగంలోకి తెచ్చారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన వైద్య నిపుణుడు రాబర్ట్ యేట్స్ ఈ ఆసుపత్రి నిర్మాణం గురించి మాట్లాడుతూ "ఇంత వేగంగా ఆసుపత్రిని నిర్మించడం అనేది చాలా మందికి ఒక పాఠం కావాలి" అన్నారు. "ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రంగంలోకి దిగాలి. ప్రయివేటు పెట్టుబడులతో నడిచే ఆరోగ్య వ్యవస్థ ఇటువంటిదాన్ని ఎన్నడూ సాధించలేదు. అందువల్ల ప్రభుత్వ రంగ ఆరోగ్య వ్యవస్థకు ఇది గొప్ప ప్రచారంగా చెప్పవచ్చు" అని ఆయన పేర్కొన్నారు.

**"దేశంలోని వనరులన్నిటినీ వైరస్‌పై యుద్ధానికి తరలించారు. వూహాన్ నగరంలోనూ, ఈ నగరం ఉన్న హుబీ రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలన్నిటా వాలంటీర్లు వ్యాధినిరోధక మందులు చల్లారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని ఆదేశించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్లకు బందీ అయినారు. అత్యవసర సర్వీసులు మినహా మొత్తం దేశంలో రవాణా వ్యవస్థను నిలిపేశారు."**

ఈ హూషెన్‌షాన్ ఆసుపత్రికి 30 కిలో మీటర్ల దూరంలో 'లీషెన్‌షాన్' పేరుతో మరో 1300 పడకల ఆసుపత్రిని నిర్మించి ఫిబ్రవరి 5న ప్రారంభించారు. వీటితోపాటు వూహాన్‌లోని ఒక ఫుట్‌బాల్ స్టేడియంనీ, ఒక పెద్ద సాంస్కృతిక కేంద్రాన్ని తాత్కాలిక ఆసుపత్రులుగా మార్చేశారు. ఈ ఆసుపత్రుల్లో పనిచేయడానికి 1400 మంది సైనిక వైద్య సిబ్బంది తరలి వెళ్లారు.

దేశంలోని వనరులన్నిటినీ వైరస్‌పై యుద్ధానికి తరలించారు. వూహాన్ నగరంలోనూ, ఈ నగరం ఉన్న హుబీ రాష్ట్రంలోని పట్టణాలు, గ్రామాలన్నిటా వాలంటీర్లు వ్యాధినిరోధక మందులు చల్లారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని ఆదేశించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్లకు బందీ అయినారు. అత్యవసర సర్వీసులు మినహా మొత్తం దేశంలో రవాణా వ్యవస్థను నిలిపేశారు. బిగ్ డేటా, కృత్రిమ మేధ ఇతర అధునాతన సాంకేతిక శాస్త్రాన్ని ఉపయోగంలో పెట్టారు. ఉదాహరణకు ప్రధాన నగరాల్లో ఎవరైనా మాస్కులు లేకుండా తిరుగుతుంటే వారిని హెచ్చరించే రోబోలను మోహరించారు. వూహాన్ ఇతర నగరాలకు నిత్యావసరాల సరఫరాలకు డ్రోన్‌లను ఉపయోగించారు. వైరస్ వ్యాపించిన ప్రాంతాల నుండి వచ్చే వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ఒక యాప్ విడుదల చేసింది. ఈ యాప్ బిగ్ డేటాను ఉపయోగించుకుని వివరాలు సేకరిస్తుంది.

హుబీ రాష్ట్రంలోని ఒక్కో పట్టణాన్ని దేశంలోని ఇతర పట్టణాలకు "అనుసంధానించే" (పెయిరింగ్ అప్) విధానం చేపట్టారు. చైనా కమ్యూనిస్టు పార్టీ ఇటువంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ప్రజలను కాపాడ్డం కోసం ఈ విధానాన్ని ఎప్పటినుండో అమలు చేస్తోంది. అనుసంధానించబడిన నగరం హుబీ రాష్ట్రంలోని తన తోటి పట్టణానికి అన్ని విధాలా సహకరిస్తుంది. ఆహారం, నిత్యావసరాలు అందిస్తుంది. వాలంటీర్లను పంపుతుంది. ఆ విధంగా అన్ని సంస్థలు, విద్యాలయాలు, ఫ్యాక్టరీల నుండి వాలంటీర్లు హుబీ రాష్ట్రానికీ, వూహాన్ నగరానికీ చేరుకుని సేవలందించారు. అలా సేవలందించడానికి వెళ్లిన వైద్య సిబ్బందిలో కొందరికి వ్యాధి సోకింది. కొందరు మరణించారు కూడా. ముఖ్యంగా ఈ వైరస్ గురించి కొద్ది రోజులు ముందుగానే హెచ్చరించిన లి వెన్‌లియాంగ్ అనే డాక్టర్ వైరస్ సోకిన రోగులకు సేవలు చేస్తూ మరణించడం చాలా మందిని కలచివేసింది. మరణానికి ముందు న్యూయార్క్ టైమ్స్ చేసిన ఇంటర్వ్యూలో వెన్ లియాంగ్ మాట్లాడుతూ "నాకు ఆరోగ్యం కుదుటపడిన వెంటనే వైరస్‌తో పోరాడుతున్న వైద్య సిబ్బందితో చేరి పనిచేస్తాను. అది నా బాధ్యత" అన్నాడు. నిజానికి వెన్ లియాంగే కాదు చైనా ప్రజలంతా ఏకమై ఈ యుద్ధంలో భుజం భుజం కలిపి పోరాడారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యమే పరమావధిగా పనిచేసే ప్రభుత్వం, ఆ ప్రభుత్వం పట్ల పూర్తి విశ్వాసంతో పనిచేసే ప్రజలు మనకు ఈనాడు చైనాలో కరోనా వైరస్‌పై జరుగుతున్న యుద్ధంలో కనిపిస్తారు. అందుకే వ్యాధి ప్రబలిన కొద్ది వారాల్లోనే వారు దాని తీవ్రతను అడ్డుకోగలిగారు.

వైద్యాన్ని ప్రయివేటు రంగానికి అప్పగించి బాధ్యతల నుండి ప్రభుత్వాలు తప్పుకుంటున్న దేశాల్లో ఇది ఏ మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే ప్రయివేటు పెట్టుబడులకు లాభాలే పరమావధి. లాభాల కోసమే అవి ఏ పని అయినా చేస్తాయి. రోగాలు ప్రబలి ప్రజలకు మందులు అవసరమైతే లాభాలొస్తాయంటే పెట్టుబడిదారులు వాటిని ఉత్పత్తిచేస్తారు. రోగాలతో చనిపోయే వారి శవపేటికలు ఉత్పత్తి చేస్తే మరిన్ని లాభాలొస్తాయనుకుంటే వారు తమ పెట్టుబడులన్నిటినీ మందుల ఉత్పత్తి నుండి శవపేటికల ఉత్పత్తికి తరలిస్తారు. అందువల్ల ప్రయివేటు రంగానికి ప్రాధాన్యత

**"చైనా ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రస్తుతం చైనాలో వ్యాధి సోకుతున్న వారి సంఖ్యకన్నా వ్యాధి నయమై ఆసుపత్రుల నుండి ఇంటికి వెళుతున్న వారి సంఖ్య పెరిగింది. కొత్తగా వ్యాధి సోకుతున్న వారి సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. జనవరి 23న రోజుకు 1000 మందిలోపు ఉన్న వీరి సంఖ్య ఫిబ్రవరి 5కి రోజుకు 4000కు పెరిగింది. తరువాత క్రమంగా తగ్గుతూ ఇప్పుడు వెయ్యి లోపుకు తగ్గింది."**



కరోనా భాదితుల కోసం 10 రోజులలోనే నిర్మించిన ఆధునిక ఆస్పత్రి

నిచ్చే దేశాల్లో నేడు చైనాలో చేసినట్లు లాభాలతో నిమిత్తం లేకుండా వనరులన్నిటినీ కొద్ది రోజుల్లో ప్రజారోగ్యానికి మళ్లించడం సాధ్యం కాదు.

చైనా ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ప్రస్తుతం చైనాలో వ్యాధి సోకుతున్న వారి సంఖ్యకన్నా వ్యాధి నయమై ఆసుపత్రుల నుండి ఇంటికి వెళుతున్న వారి సంఖ్య పెరిగింది. కొత్తగా వ్యాధి సోకుతున్న వారి సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. జనవరి 23న రోజుకు 1000 మందిలోపు ఉన్న వీరి సంఖ్య ఫిబ్రవరి 5కి రోజుకు 4000కు పెరిగింది. తరువాత క్రమంగా తగ్గుతూ ఇప్పుడు వెయ్యి లోపుకు తగ్గింది. మొత్తంగా ఈ వ్యాధి ఏప్రిల్ నాటికి పూర్తిగా అదుపులోకి వస్తుందని అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అంటువ్యాధుల నిపుణుడు ఝూంగ్ నిషాన్ చెప్పారు.

కానీ అమెరికా, పశ్చిమ దేశాల మీడియా మాత్రం కరోనావైరస్‌ను ఉపయోగించుకుని చైనాపై తీవ్రమైన దుష్ప్రచారానికి తెరతీసింది. ఈ ప్రచారం ప్రచ్ఛన్నయుద్ధ కాలంలో సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రచారాన్ని తలపిస్తోంది. మొదటిది, వైరస్‌పై చైనా ప్రజలు జరుపుతున్న యుద్ధాన్ని వక్రీకరించడం, తక్కువచేసి చూపడం. దీన్ని ఉపయోగించుకుని చైనీయుల ఆహారపు అలవాట్లపై జాతివివక్ష పూరిత వ్యాఖ్యానాలు చేయడం. రెండవది, వైరస్‌తో చైనా ఆర్థికంగా దెబ్బతింటే అమెరికాలో ఉద్యోగాలు పెరుగుతాయంటూ అమెరికా ఉన్నతాధికారులే ప్రకటనలు చేయడం. మూడవది అన్నిటికన్నా ముఖ్యమైనది చైనాలో ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛ లేకపోవడం వల్లనే వ్యాధి ప్రబలిందని పెద్ద ఎత్తున చేస్తున్న ప్రచారం.

నిజానికి వూహాన్ అధికారులు వ్యాధి ప్రారంభ దినాల్లో కొంత తడబాటుకు గురైనారు. డాక్టర్ వెన్ లియాంగ్ మరికొందరు వి-చాట్‌లో సార్స్ వంటి వ్యాధి ప్రబలుతోందని డిసెంబర్ చివరిలోనే హెచ్చరికలు చేస్తే అధికారులు పట్టించుకోకపోగా ఆయనను నివారించడానికి ప్రయత్నించారు. దాని వల్ల వ్యాధిని గుర్తించడం కొన్ని రోజులు ఆలస్యమైంది. అలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే దీన్ని సాకుగా తీసుకుని పశ్చిమ దేశాల మీడియా సోషలిస్టు వ్యవస్థపైనే పెద్ద ఎత్తున బురద జల్లుతోంది. ప్రాణాంతక వ్యాధిని అదుపుచేయడానికి అంతటి పెద్ద కృషి చేయడం చైనా సోషలిస్టు వ్యవస్థ వల్లే సాధ్యమైందని ప్రపంచ ప్రజలంతా గుర్తిస్తున్న సమయంలో దాన్ని వమ్ము చేయడానికి కార్పొరేట్ మీడియా ఈ దుష్ప్రచారానికి పాల్పడుతోందన్నది స్పష్టం.

వ్యాధిని నివారించడానికి చైనా ప్రజలు చూపిస్తున్న "నిబద్ధత గొప్పది" అని పోప్ ఫ్రాన్సిస్ వాటికన్‌లో ఒక ప్రకటన చేస్తూ కొనియాడారు. చైనాలోనూ, ఇతర దేశాలకూ వైరస్ వ్యాపించకుండా అక్కడి నాయకత్వం, ప్రజలు తీసుకుంటున్న చర్యలను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసించింది. సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధానమ్ ఘెబ్రెయేసస్ మాట్లాడుతూ "ఈ వ్యాధి విషయంలో చైనా స్పందించిన తీరును ముఖ్యంగా చైనా నాయకత్వ నిబద్ధతను మెచ్చుకోక తప్పదు. వాళ్లు ఈ విషయంలో చాలా పారదర్శకంగా వ్యవహరించారు. వైరస్ జన్యు సమాచారాన్ని ఇతరులకు తెలియజేశారు." అని పేర్కొన్నారు.

కానీ పశ్చిమ దేశాల మీడియా మాత్రం ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా చేసిన ప్రచారాన్ని తలపించే రీతిలో చైనా వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. ఈ సందర్భంగా చైనీయులపై జాతి వివక్షాపూరిత ప్రచారాన్ని లంఘించుకోవడం దురదృష్టకరం. చైనీయులు నానా రకాల జంతువులను తింటారు గనుక ఈ వ్యాధి వ్యాపించిందని ఒక ప్రచారం. గబ్బిలాల నుండి ఈ వ్యాధి మనుషులకు వ్యాపించి ఉండవచ్చునన్న అనుమానాన్ని శాస్త్రవేత్తలు పేర్కొన్న వెంటనే పశ్చిమ దేశాల మీడియాలో ఒక చైనా మహిళ గబ్బిలం మాంసం సూప్ తాగుతున్నట్లు ఇంటర్నెట్‌లో వీడియోలు వైరల్ అయినాయి. కానీ ఆమె చైనాకు చెందిన విదేశీ పర్యాటక వార్తలు ప్రసారం చేసే మహిళ అనీ, ఆమె పసిఫిక్ దీవి అయిన పలావు లో ఆమె అరుదైన ఆహారాన్ని పరిచయం చేస్తున్న వీడియో క్లిప్ అది అనీ తరువాత తెలిసింది. నిజానికి చైనీయులు గబ్బిలం మాంసం తినరు. వాస్తవానికి చాలా రకాల వైరస్‌లు జంతువుల నుండే మనుషులకు వ్యాపిస్తాయి. స్వైన్ ఫ్లూ వ్యాధి పందుల ద్వారా అమెరికాలో వ్యాపించి

ప్రపంచ వ్యాపితమైంది. అలాగే కోళ్ల నుండి బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపించింది.

దీనిపై సోషల్ మీడియాలో కుట్ర సిద్ధాంతాలను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. చైనా జీవ ఆయుధాల తయారీ పరిశోధనాశాలల్లో కొత్త రకం జీవ ఆయుధాన్ని తయారు చేస్తున్నప్పుడు అది అదుపుతప్పి జనం మీదకు వచ్చిందన్నది ఒక వాదన. చైనాను దెబ్బతీయడానికి అమెరికా చైనాపై కరోనా వైరస్ అనే ఈ జీవ ఆయుధాన్ని ప్రయోగించిందన్నది మరో వాదన. ప్రపంచంలో పెద్ద ఘటనలు జరిగిన ప్రతిసారీ ఇటువంటి కుట్ర సిద్ధాంతాలు బయలుదేరుతూనే ఉంటాయి.

ఇంకోవైపు చైనాపై జరుపుతున్న వాణిజ్య యుద్ధంలో భాగంగా అమెరికా ఈ వైరస్ సమస్యను ఉపయోగించుకుంటున్నది. వ్యాధి పేరుతో చైనా నుండి రాకపోకలను పూర్తిగా నిలిపేసింది. ఎగుమతి, దిగుమతులపై ఆంక్షలు పెట్టింది. పశ్చిమ దేశాలు వ్యాధి తీవ్రతకు మించి చైనాపై ప్రయాణ, ఇతర ఆంక్షలు విధించాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొన్నది. చైనాలోనే కాదు ఏ దేశంలోనైనా వైరస్ వ్యాధి ప్రమాదానికి మించి ప్రయాణ, ఇతర ఆంక్షలు పెట్టడం నష్టదాయకం అని అది హెచ్చరించింది. నేటి ప్రపంచీకరణ యుగంలో చైనా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం చాలా ప్రతికూలంగా ఉంటుంది. ఇప్పటికే చైనా నుండి దిగుమతులు ఆగిపోయి చాలా దేశాల్లో పారిశ్రామికోత్పత్తి దెబ్బతింటోంది. మరోవైపు ప్రపంచ వ్యాపితంగా టూరిజం పరిశ్రమ క్షీణిస్తోంది. చాలా దేశాలు విమాన ప్రయాణాలను నిలిపివేయడంతో విమానయాన సంస్థల ఆదాయాలు తగ్గాయి. కరోనా వైరస్ ప్రపంచమంతటా వ్యాపిస్తోందన్న భయాలు అన్ని దేశాల్లోనూ స్టాక్ మార్కెట్లను కుదేలెత్తిస్తున్నాయి.

చైనాలో కరోనా వైరస్ గత డిసెంబర్‌లో బయటపడింది. వేగంగా వ్యాపించింది. ప్రస్తుతం వ్యాధి సోకుతున్నవారి సంఖ్య, మృతుల సంఖ్య కూడా చాలా వరకు తగ్గుముఖం పట్టింది. వ్యాధి సోకిన వారిలో చికిత్స పొంది, వ్యాధి నయమై ఇంటికి వెళుతున్న వారి సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 72,000 మంది చైనీయులకు వ్యాధి సోకితే 32,500 మందికి నయమైంది. కొద్ది పాటి అనుమానం ఉన్న వారిని కూడా చైనా అధికారులు గుర్తించి నయం చేసేందుకు, వ్యాధి ఇతరులకు వ్యాపించకుండా చేసేందుకు తీసుకున్న అసాధారారణ చర్యల వల్ల ఇది సాధ్యమైంది.

**"2002-2003 సంవత్సరంలో చైనాలో వ్యాపించిన సార్స్ వైరస్‌కన్నా ఈ కరోనా వైరస్ వేగంగా వ్యాపించినప్పటికీ వ్యాధి సోకినవారిలో మరణాల సంఖ్య సార్స్ వైరస్ కన్నా తక్కువ. 2009-10లో అమెరికాలో పుట్టి ప్రపంచమంతా వ్యాపించిన హెచ్1ఎన్1 స్వైన్‌ఫ్లూ వల్ల 12 మాసాల్లో అమెరికాలోనే 6.1 కోట్ల మంది వ్యాధిగ్రస్తులయ్యారు, 2 లక్షల 74 వేల మంది ఆసుపత్రుల పాలయ్యారు,"**



కరోనా వైరస్ అదుపు చర్యలను పర్యవేక్షిస్తున్న చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్

2002-2003 సంవత్సరంలో చైనాలో వ్యాపించిన సార్స్ వైరస్‌కన్నా ఈ కరోనా వైరస్ వేగంగా వ్యాపించినప్పటికీ వ్యాధి సోకినవారిలో మరణాల సంఖ్య సార్స్ వైరస్ కన్నా తక్కువ. 2009-10లో అమెరికాలో పుట్టి ప్రపంచమంతా వ్యాపించిన హెచ్1ఎన్1 స్వైన్‌ఫ్లూ వల్ల 12 మాసాల్లో అమెరికాలోనే 6.1 కోట్ల మంది వ్యాధిగ్రస్తులయ్యారు, 2 లక్షల 74 వేల మంది ఆసుపత్రుల పాలయ్యారు, 12,500 మంది మరణించారని అమెరికాలోని వ్యాధి నియంత్రణ కేంద్రం (సిడిసి) తెలిపింది. ప్రపంచవ్యాపితంగా 2.5 నుండి 3.5 కోట్ల మందికి వ్యాధి సోకిందని అంచనా. అమెరికా కన్నా పరిమితమైన వనరులున్న చైనా వ్యాధి తీవ్రతనూ, మరణాల సంఖ్యనూ తగ్గించగలిగిందీ అంటే అక్కడి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఇచ్చిన ప్రాధాన్యత, దేశ ఆర్థిక వ్యవస్థమీద ప్రభుత్వానికీ, ప్రభుత్వ రంగ సంస్థలకూ ఉన్న పట్టు వల్ల సాధ్యమైంది.

ఏమైనా కరోనా వైరస్‌పై జరుగుతున్న యుద్ధాన్ని రాజకీయ ప్రచారాలకు ఉపయోగించుకోకుండా ప్రపంచ దేశాలు పరస్పర సహకారంతో పని చేయాల్సి ఉంది. ప్రస్తుతం చైనాలో తగ్గుముఖం పడుతున్న వ్యాధి ఇతర దేశాల్లో శీఘ్రంగా వ్యాపిస్తోంది. చైనాతో సంబంధం లేకుండానే ఈ వ్యాధి అనేక దేశాల్లో వ్యాపిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఇది మరింత వ్యాపించకుండా అన్ని దేశాలూ కలిసి కట్టుగా చర్యలు తీసుకోవాలి. "కరోనా వైరస్ అంటువ్యాధి ఇప్పుడు ఒక నిర్ణయాత్మక దశలో ఉంది" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ డాక్టర్ టెడ్రోస్ అధానమ్ పేర్కొన్నారు. "మనం గనుక తీవ్రమైన చర్యలు తీసుకుంటే ప్రజలు అనారోగ్యం పాలు కాకుండా చేయవచ్చు, మరణాలను నివారించ వచ్చు. ఈ వ్యాధి పెద్ద అంటువ్యాధి అయినప్పటికీ అది వ్యాపించకుండా నివారించవచ్చు కూడా" అని డాక్టర్ టెడ్రోస్ పేర్కొన్నారు. మా దేశానికి ఈ వ్యాధి రాదు అనుకుంటే అది ప్రాణాంతక ప్రమాదం అవుతుంది అని ఆయన హెచ్చరించారు.

బలమైన ఆరోగ్య వ్యవస్థ ఉన్న చైనాలోనే ఇంతటి ప్రభావం చూపించిన వైరస్ బలమైన ఆరోగ్య వ్యవస్థలు లేని దేశాల్లో పెద్ద నష్టం కలిస్తుంది. ముఖ్యంగా కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే వ్యాక్సిన్‌లను వెంటనే కనిపెట్టాలి. దీనిపై చైనాలోనూ, అమెరికాలోనూ, యూరప్, ఇతర దేశాల్లోనూ జరుగుతున్న ప్రయత్నాలు త్వరగా జయప్రదం కావాలని మనందరం కోరుకోవాలి.

❋

మతోన్మాదం

# ముస్లింలపై ఆర్‌ఎస్‌ఎస్ అసత్య ప్రచారం



రచయిత
మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

**ఎ. కోటిరెడ్డి**

వివిధ రాజకీయ పార్టీలు ముస్లింలను బుజ్జగిస్తున్నాయని, వారిని ఓటుబ్యాంకులుగా మార్చుకోవటం కోసం వారికి లంగిపోతున్నారని, ముస్లింల కోసం హిందువుల ప్రయోజనాలను బలిపెడుతున్నాయని సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్నది. మిగతా ప్రజానీకంలో ముస్లింలను గురించి భయాందోళనలు కలిగించటం, వారిపై వ్యతిరేకతను పెంచటం లక్ష్యంగా ఈ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇస్లాం విదేశీ మతమని, ముస్లింలంటే టెర్రరిస్టులని, వారు మనదేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తారని, "లవ్ జిహాద్"తో హిందు బాలికలను మోసంచేసి పెళ్ళి చేసుకొంటున్నారని చెబుతున్నారు. హిందువులకు పవిత్రమైన ఆవును చంపితింటారు. "ఉయ్ దో, హమారే దో, వో పాంచ్, ఉన్‌కే పచ్చీస్" (మేం ఇద్దరం, మాకు ఇద్దరు. వారు ఐదుగురు, వారికి ఇరవై ఐదుమంది)గా ముస్లిం జనాభా పెరుగుతున్నదని, ఆ విధంగా అసాధారణంగా ముస్లిం జనాభా పెరగటం వలన కొద్ది సంవత్సరాలలోనే హిందువులు దేశంలో మైనారిటీలుగా మారతారని, అపుడు వారు ముస్లింల ఆధిపత్యంలో బతకాల్సి వస్తుందని పచ్చి అబద్ధాలు చెబుతున్నది. ఇటువంటి అబద్ధాలతో లేని ముస్లిం ప్రమాదం గురించి ప్రజలను నమ్మించేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తున్నది.

**ఓటుబ్యాంకు రాజకీయాలు**

ఓటుబ్యాంకు రాజకీయాలు అనుసరిస్తున్నారని ఇతర పార్టీలను నిందిస్తున్న సంఘ్ పరివార్ తానే ఓటుబ్యాంకు రాజకీయాలను అనుసరిస్తున్నది. మతం ప్రాతిపదికగా ఓటు బ్యాంకును ఏర్పరచుకోవాలని ప్రయత్నం చేస్తున్నది. దేశంలో మతం రీత్యా మెజారిటీగా ఉన్న హిందువులను తనవైపు తెచ్చుకొని, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని వారు భావిస్తున్నారు. అందుకోసం ముస్లిం వ్యతిరేకతను పెంచటం, వారిపట్ల భయాందోళనలు కలిగించటం, ద్వేషాన్ని పెంచటం ద్వారా హిందువులను సమీకరించటానికి ప్రయత్నం చేస్తున్నది. ఆ విధంగా మతోన్మాదాన్ని పెంచుతూ, మతాల మధ్య ఉద్రిక్తతలను సృష్టిస్తున్నది. ఈ క్రమంలో హిందువులందరికి తానే ప్రతినిధినని ప్రచారం చేసుకొంటున్నది. తాను ఓటుబ్యాంకు రాజకీయాలను అనుసరిస్తూ ఇతరులు ఆ పని చేస్తున్నారని ప్రచారం చేయటం ద్వారా సంఘ్ పరివార్ తన కుటిల స్వభావాన్ని వెల్లడించుకొంటున్నది.

**ఇస్లాం విదేశీ మతం అని ప్రచారం**

ఇస్లాం మతం భారతదేశంలో పుట్టలేదని, విదేశాలలో పుట్టినదని, ఆ మతాన్ని అనుసరించేవారు ఆ మతం పుట్టిన దేశం ప్రయోజనాల కోసమే పనిచేస్తారని ప్రచారం చేస్తున్నారు. వాస్తవమేమిటంటే మతాలకు దేశాలు, ప్రాంతాలు, ఖండాల సరిహద్దులు ఉండవు. ఏ దేశంలో పుట్టిన మతమైనా ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రచారం పొందటం, ఆ మతం పుట్టిన ప్రాంతానికి సుదూరంలోని ప్రజలలో కూడా ఆదరణ పొందటాన్ని చూస్తున్నాం. భారతదేశంలో పుట్టిన బౌద్ధమతం అనేక దేశాలకు వ్యాపించింది. చాలా దేశాలలో మెజారిటీ ప్రజలు అనుసరించే మతంగా ఉంది. శ్రీలంక, కొరియా, భూటాన్, చైనా, మయన్మార్ తదితర దేశాల ప్రజలు బౌద్ధమతాన్ని అనుసరిస్తున్నారు. సంఘ్ పరివార్ చేస్తున్న ప్రచారం ప్రకారం ఆయా దేశాలలో బౌద్ధమతాన్ని అనుసరించే వారు తమ దేశ ప్రయోజనాలను పక్కన పెట్టి, భారతదేశ ప్రయోజనాల కోసం పనిచేయాలి. కాని ఏ దేశంలో ఉన్న బౌద్ధులైనా తమ దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా భారతదేశ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారా? ఏసుక్రీస్తు జెరుసలెంకు సమీపంలోని బెత్లెహేంలో పుట్టినప్పటికీ క్రైస్తవమతం ప్రపంచవ్యాపితంగా విస్తరించింది. అమెరికా, యూరప్ ఖండంలోని మెజారిటీ దేశాలలో క్రైస్తవమతాన్ని అనుసరించేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఆ దేశాలలో ఉన్న ప్రజలు, ప్రభుత్వాలు ఎవరి దేశ ప్రయోజనాల కోసం వారు పనిచేస్తున్నారు మినహా తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా క్రీస్తు పుట్టిన దేశం కోసం పనిచేయటం లేదు. హిందుమతం భారతదేశంలో పుట్టినా హిందువులు మెజారిటీగా ఉన్న నేపాల్‌లోని హిందువులు భారతదేశ ప్రయోజనాల కోసం పనిచేయటం లేదు. మోడి ప్రధాని అయిన తర్వాత నిత్యావసరాల సరఫరాకు సంబంధించి భారత్‌తో ఒప్పందాలు కుదరకపోవటంతో నేపాల్ చైనాతో ఒప్పందం చేసుకున్నది మినహా ఒకే మతస్తులు ఉన్నారని, ఏ విధంగానైనా భారత్‌తోనే ఒప్పందం చేసుకోవాలని ప్రయత్నం చేయలేదు. ఇస్లాం మతాన్ని అనుసరించేవారు కూడా అంతే. సౌది అరేబియాలో ప్రారంభమైన ఇస్లాం ప్రపంచంలోని 50కి పైగా దేశాలకు వ్యాపించింది. అనేక దేశాలలో మెజారిటి ప్రజలు అనుసరించే మతంగా ఉంది. సంఘ్ పరివార్ ప్రవచనాల ప్రకారం అయితే ప్రపంచంలోని ముస్లింలందరూ సౌది అరేబియా కోసం పనిచేయాలి. కాని ఏ దేశంలోని ముస్లింలైనా అలా చేస్తున్నారా? ఏ దేశంలో ఉన్న ముస్లింలు ఆ దేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారు. తమతమ దేశాల ప్రయోజనాల కోసం ఇతర దేశాలలోని ముస్లింలతో ఘర్షణ పడుతున్నారు. దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలలో రెండువైపులా లక్షలాది మంది ముస్లింలు మరణిస్తున్నారు. భారత్‌లోని ముస్లింలు కూడా అంతే. వారు భారతీయులు. భారతదేశ ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారు.

**అన్ని రంగాలలో అట్టడుగు స్థాయిలో ముస్లింలు**

వివిధ పార్టీలు ముస్లింలను బుజ్జగిస్తున్నాయని, వారు అధికారంలో ఉన్నపుడు

హిందువుల ప్రయోజనాలను పక్కనపెట్టి ముస్లింలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నాయని సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్నది. కాని ముస్లింల దుస్థితిని గురించి వివిధ కేంద్ర ప్రభుత్వసంస్థలు ప్రకటిస్తున్న లెక్కలు, వివిధ ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న సర్వేలలో వెల్లడౌతున్న వాస్తవాలు సంఘ్ పరివార్ ప్రచారం చేస్తున్న అబద్ధాలను పటాపంచలు చేస్తున్నాయి. విద్య, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు, సంపద, భూమిని కలిగివుండటం, ఆర్థికంగా ఉన్నతస్థానంలో ఉన్నవారి శాతం తదితరాలన్నింటిలోనూ ముస్లింలు వెనుకబడి ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన సచార్ కమిటీ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో ముస్లింల దయనీయ స్థితిని వెల్లడించింది. సామాజిక, ఉద్యోగరంగాలు, న్యాయవ్యవస్థ, ప్రాసిక్యూటర్లలో ముస్లింలు అతి తక్కువ శాతం ఉన్నారని, వారిలో దరిద్రం ఎక్కువని చెప్పింది. దేశంలో ముస్లిం జనాభా 13.4 శాతం ఉండగా, కేంద్ర ప్రభుత్వ సర్వీసులలో ఉన్న ముస్లింల శాతం ఈ విధంగా ఉంది. గ్రూపు ఎలో 1.61 శాతం, గ్రూపు బి లో 3 శాతం, గ్రూపు సి లో 4.41 శాతం, గ్రూపు డి లో 5.12 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. విద్యారంగంలో దళితుల కన్నా ముస్లింలు వెనుకబడి ఉన్నారని, ఇతర అన్ని రంగాలలో వెనుకబడిన తరగతుల కన్నా దిగువ స్థాయిలో ఉన్నారని సచార్ కమిటి చెప్పింది. భూమిని కలిగి ఉండటంలో కూడా ముస్లింలు అట్టడుగునే ఉన్నారు. అతి తక్కువ మంది ముస్లింలు మాత్రమే స్వంతభూమిని కలిగి ఉన్నారు.

ప్రైవేటురంగంలో కూడా ముస్లింల పరిస్థితి ఇదే విధంగా ఉంది. తాతా, బిర్లా కంపెనీలలో ముస్లింలు 8.16 శాతం ఉండగా, దళితులు 11.5 శాతం ఉన్నారు. ఎగ్జిక్యూటివ్‌లలో 1.5 శాతం మాత్రమే ముస్లింలు ఉన్నారు. చిన్న, పేదరైతులు, వ్యవసాయ కార్మికులు, ఇతర భూమిలేని కార్మికులకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవటంలో వెనుకబడి ఉన్నారు. వారిలో అత్యధిక మంది అతి తక్కువ ఆదాయం వచ్చే స్వయం పోషకమైన వృత్తులు చేసుకోవటం లేదా అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. నిర్మాణం, రిక్షా, ట్యాక్సి, ట్రక్ డ్రైవర్లు, టైలర్లు, కూలీలు, ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, మెకానిక్, కార్పెంటర్లు, పేవ్‌మెంట్లపై చిన్నచిన్న సరుకులను అమ్ముకునే వ్యాపారులుగా ఉన్నారు.

> **"వాస్తవమేమిటంటే జనాభా పెరుగుదల బహు భార్యాత్వంపై ఆధారపడి ఉండదు. అందుకు భిన్నంగా పిల్లలను కనగల వయసులో ఉన్న మహిళల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు పిల్లలను కనగల వయసున్న మహిళలు లక్షమంది ఉంటే బహు భార్యత్వం ఉన్నా, ఒక్కభార్యతోనే ఉన్నా లక్షమంది మాత్రమే పిల్లలను కనగలరు."**

మిగతా మతాలకు చెందిన వారి కన్నా ముస్లింలలో అత్యధికులు నిరక్షరాస్యులుగా ఉన్నారు.

ముస్లింలు నాలుగు వివాహాలు చేసుకుంటారని, వారి జనాభా ఎక్కువగా పెరిగిపోతున్నదని, వారు త్వరలోనే హిందు జనాభాను మించిపోతారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వాస్తవమేమిటంటే జనాభా పెరుగుదల బహు భార్యాత్వంపై ఆధారపడి ఉండదు. అందుకు భిన్నంగా పిల్లలను కనగల వయసులో ఉన్న మహిళల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు పిల్లలను కనగల వయసున్న మహిళలు లక్షమంది ఉంటే బహు భార్యత్వం ఉన్నా, ఒక్కభార్యతోనే ఉన్నా లక్షమంది మాత్రమే పిల్లలను కనగలరు. 2001 సెన్సస్ ప్రకారం హిందువులలో 1000 మంది పురుషులకు 931 మంది మహిళలు ఉండగా, ముస్లింలో 1000 మంది పురుషులకు 936 మంది మహిళలు ఉన్నారు. ఇటువంటి స్థితిలో ముస్లింలలో ఒక్కో పురుషుడు నలుగురు భార్యలను చేసుకొంటే మూడొంతుల మంది పురుషులు పెళ్ళిళ్ళు కాకుండా ఉండాలి. కాని హిందువులలో వలెనే ముస్లింలలో కూడా యువకులకు పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. హిందువుల వలెనే ముస్లింలు కూడా ఒకభార్యతోనే ఉంటున్నారని, హిందువులు, ముస్లింలు ఉభయులలోనూ బహు భార్యత్వం తగ్గుతున్నదని పైన పేర్కొన్న అంశాలు స్పష్టం చేస్తున్నాయి. ముస్లింల కన్నా హిందువులలో స్త్రీ, పురుష నిష్పత్తి తక్కువగా ఉన్నది. కొన్ని ప్రాంతాలలో హిందువులలోని కొన్ని కులాలలో ఆడ శిశువులను గర్భంలోనే చిదిమివేయటం కారణం.

సెన్సస్‌లలో వెల్లడౌతున్న మతాల వారీ జనాభా పెరుగుదల వివరాలు కూడా వీరి తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతున్నాయి. 1971 సెన్సస్ ప్రకారం దేశంలో హిందువుల జనాభా 82.7 శాతం, ముస్లిం జనాభా 11.2 శాతం ఉండగా, 1991 సెన్సస్‌లో 82.6, 11.4 శాతంగా ఉన్నారు.

మతాల కన్నా దరిద్రం, విద్య లేకపోవటమే జనాభా పెరగటానికి ప్రధాన కారణం. ముస్లింలలో విద్యశాతం ఎక్కువగా ఉన్న కేరళలో జననాల రేటు తక్కువగా ఉంది. దరిద్రం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉంది. దేశంలో దరిద్రరేఖకు దిగువనున్న వారు 28 శాతం కాగా, ముస్లింలలో 44 శాతం దరిద్రరేఖకు దిగువన ఉన్నారు. 92-93లో జరిగిన ముంబయి అల్లర్లు, 2002లో గుజరాత్ మారణకాండ తర్వాత ముస్లింలను టెర్రరిస్టులుగా ముద్రవేయటం, అనుమానంతో చూడటం, కొన్ని ప్రధానమైన నగరాలు, పట్టణాలలో వారి నివాసాలను నిర్ణీత ప్రాంతానికి -ఘెట్టోలకు- పరిమితం చేయటంతో వారిలో అభద్రత పెరిగింది. దీనితో సంస్కరణల దృక్పథం వెనక్కుపోయి మతతత్వం వైపు మొగ్గటం పెరుగుతున్నది.

ముస్లింలలో బహు భార్యత్వం వలన జనాభా పెరుగుదల ఎక్కువగా ఉందని చెబుతున్నారు. కాని వివిధ సందర్భాలలో ప్రభుత్వం సేకరించిన సమాచారాన్ని పరిశీలిస్తే భారతదేశంలో ఇతర మతాలలోని వారికన్నా ముస్లింలలోనే బహు భార్యత్వం తక్కువగా ఉందని స్పష్టమౌతున్నది. 1961 సెన్సస్ ప్రకారం గిరిజనులలో 15.25 శాతం, బౌద్ధులలో 7.97 శాతం, జైనులలో 6.7 శాతం, హిందువులలో 5.8 శాతం, ముస్లింలలో 5.7 శాతం మాత్రమే బహు భార్యత్వం ఉంది. అందువలన ముస్లింలలో బహు భార్యత్వం ఎక్కువని చేస్తున్నది తప్పుడు ప్రచారమని స్పష్టమౌతున్నది. ముస్లిం మతపెద్దలు కుటుంబ నియంత్రణ పాటించటానికి వ్యతిరేకమని, అందువలన వారి

**"హిందువులను మైనారిటీలుగా మార్చటానికి ముస్లింలు కుట్ర చేస్తున్నారని, వారి జనాభా విపరీతంగా పెరిగిపోతున్నదని సంఘ్ పరివార్ చేస్తున్న దుష్ప్రచారాన్ని సచార్ కమిటి నివేదికలో వెల్లడైన వాస్తవాలు తిరస్కరిస్తున్నాయి. మిగతా వారితో పోలిస్తే ముస్లింలలో కుటుంబ నియంత్రణ విధానాలను అనుసరిస్తున్న వారిసంఖ్య వేగంగా పెరుగుతున్నది."**



ఆవు పేరుతో ముస్లింలను కొట్టి చంపుతున్న దుండగులు

జనాభా అదుపులేకుండా పెరుగుతున్నదని ప్రచారం చేస్తున్నారు. కొందరు మత పెద్దలు ఆ విధంగా ఆంక్షలు పెడుతున్న మాట వాస్తవమే. అలా ఆంక్షలు పెడుతున్న వారు, ఎక్కువ మంది పిల్లలను కనమని ప్రోత్సహించేవారు హిందుమతంలో కూడా ఉన్నారు. కాని ముస్లింలలోని అనేకమంది మత పెద్దలు కుటుంబ నియంత్రణ పద్ధతులను వ్యతిరేకించటం లేదు. సామాన్యప్రజలు తమ కుటుంబ సౌలభ్యం చూసుకుంటున్నారు మినహా మతపెద్దల మాటలపై ఆధారపడటం లేదు. మతపెద్దలు చెపుతున్నది తమ అవసరాలకు అనుగుణంగా లేకపోతే ఇతర మతాల వారి వలెనే ముస్లింలు కూడా పాటించటం లేదు. ముస్లింలు మెజారిటీగా ఉన్న టర్కి, ఇండోనేషియా లాంటి దేశాలలో కూడా విస్తృతంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తున్నారు.

హిందువులను మైనారిటీలుగా మార్చటానికి ముస్లింలు కుట్ర చేస్తున్నారని, వారి జనాభా విపరీతంగా పెరిగిపోతున్నదని సంఘ్ పరివార్ చేస్తున్న దుష్ప్రచారాన్ని సచార్ కమిటి నివేదికలో వెల్లడైన వాస్తవాలు తిరస్కరిస్తున్నాయి. మిగతా వారితో పోలిస్తే ముస్లింలలో కుటుంబ నియంత్రణ విధానాలను అనుసరిస్తున్న వారిసంఖ్య వేగంగా పెరుగుతున్నది. 1990లలో ముస్లింలలో పిల్లలను కనటం (టోటల్ ఫెర్టిలిటి రేటు) 0.9 శాతం తగ్గగా, మిగతా వారిలో 0.5 శాతం మాత్రమే తగ్గింది. గర్భధారణను నిరోధించే విధానాలను ముస్లింలలో 37 శాతం అమలు చేస్తుండగా, హిందువులలో 48 శాతం అమలు చేస్తున్నారు. విద్య, అభివృద్ధి వలన అన్ని మతాలలోనూ గర్భ నిరోధక వద్దతులను అనుసరిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది.

**లవ్ జిహాద్**

హిందు యువతులను ఇస్లాం మతంలోకి మార్చటం కోసం ముస్లిం యువకులు ప్రేమ పేరుతో లవ్ జిహాద్ జరుపుతున్నారని సంఘ్ పరివార్ ఆరోపిస్తున్నది. ముస్లింలపై వ్యతిరేకతను రెచ్చగొట్టటానికి దీనిని ఒక సాధనంగా వినియోగించుకొంటున్నారు. ఆధునిక సమాజంలో యువతీ యువకులు కుల, మత కట్టుబాట్లను అధిగమించి, తమకిష్టమైనవారిని పెళ్ళాడుతున్నారు. జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల మధ్య సరిహద్దులు ప్రేమకు అడ్డుకట్టలు వేయలేకపోతున్నాయి. అనేకమంది తమ కులం కానివారిని, మతం కానివారిని, భాష, జాతికి సంబంధం లేనివారిని పెళ్ళాడుతున్నారు. విభిన్న కులాలకు చెందిన వారు ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలలోని యువతులు విదేశీ యువకులను, ఇక్కడి యువకులు విదేశీ యువతులను పెళ్ళాడుతున్న ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఆ విధంగానే ముస్లిం యువతీ యువకులు హిందు యువతీ యువకులు ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. వివిధ కులాలు, మతాలకు చెందిన వారి మధ్య వివాహాలకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ పెద్దగా ప్రచారం చేయటం లేదు. ముస్లిం యువతులు, హిందు యువకులకు మధ్య జరుగుతున్న వివాహాలకు కూడా అంతగా వ్యతిరేకించటం లేదు. కేవలం హిందు యువతులు ముస్లిం యువకుల మధ్య జరుగుతున్న వివాహాలకే లవ్ జిహాద్ అని పేరుపెట్టి, ముస్లింలపై ద్వేషం పెంచేలా ప్రచారం చేస్తున్నారు. వాస్తవాలను పరిశీలించినపుడు వివిధ కులాలు, మతాలకు చెందిన వారి మధ్య, ముస్లిం యువతులు, హిందు యువకుల మధ్య జరుగుతున్న దామాషాలోనే ముస్లిం యువకులతో హిందు యువతుల వివాహాలు కూడా జరుగుతున్నాయి. కాని తన రాజకీయ ప్రయోజనాల కోసం సంఘ్ పరివార్ ముస్లిం యువకులతో హిందు యువతులకు జరుగుతున్న వివాహాల గురించి దుష్ప్రచారం చేస్తున్నది.

**పవిత్రమైన ఆవులను చంపుతున్నారని ప్రచారం**

ఆవు హిందువులకు పవిత్రమైనదని, ముస్లింలు ఆవులను చంపి మాంసం తింటారని ప్రచారం చేస్తున్నారు. ముస్లింలు, దళితులు, హిందుమతంలోని కొన్ని కులాలకు చెందినవారు కూడా ఆవు, గేదెలు, దున్నపోతుల మాంసం తింటారు. దేశంలోని ప్రతివారికీ తమకు ఇష్టమైన తిండితినే హక్కు ఉంది. ఆవుపై హిందువులలో కొందరికి ఉన్న భక్తిభావాన్ని అడ్డం పెట్టుకొని ముస్లింపై దాడులుచేసి, కొట్టి చంపుతున్నారు. పాలిచ్చే ఆవుల రేటు ఎక్కువగా ఉంటుంది. వాటి పాలను అమ్మటం వలన వారికి ఎక్కువ లాభం వస్తుంది. అందువలన పాలిచ్చే ఆవులను ఎవరూ చంపి తినరు. వట్టిపోయిన వాటిని మాత్రమే తింటారు. పాలివ్వటం మానివేసిన తర్వాత ఆవులు రైతులకు భారంగా మారతాయి. అందువలన తప్పనిసరిగా వాటిని అమ్ముతారు. అవి మాంసం కోసం మినహా మరెందుకూ ఉపయోగపడవు. ముస్లింలు ఆవులను చంపుతున్నారని దాడులు చేస్తున్న సంఘ్ పరివార్ హిందువులు ఆవులను చంపుతుంటే మాత్రం నోరెత్తదు. అనేకమంది హిందువులు,

**"దేశంలో సంఘ్ పరివార్ అతిపెద్ద టెర్రరిస్టు సంస్థగా ఉన్నది. దేశంలోని చట్టాలను, రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా తనచిత్తం వచ్చిన విధంగా సాయుధ మూకలను తయారు చేసి, ముస్లింలు, దళితులపై దాడులు చేయిస్తున్నది. సంఘ్ పరివార్ అనుయాయులు అనేకచోట్ల బాంబుపేలుళ్ళకు పాల్పడుతున్నారు. దాడులు, హత్యలు చేస్తున్నారు."**

సంఘ్ పరివార్ అనుయాయులు ఆవులను చంపి, మాంసాన్ని ఎగుమతి చేస్తున్నారు. వారిపై ఎటువంటి దాడులు లేవు. నిజంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆవును పవిత్రమైనదిగానే చూస్తున్నదా? అయితే ఆవు మాంసాన్ని ఎగుమతి చేస్తున్న సంస్థలపై ఎందుకు దాడులు చేయటం లేదు? హిందువులు చంపే ఆవులకు పవిత్రత ఉండదా? ముస్లింలు చంపే ఆవులే పవిత్రమైనవా? ముస్లింలపై వ్యతిరేకతను పెంచటం కోసమే ఆర్‌ఎస్‌ఎస్ ఆవును పాచికగా వినియోగించుకొంటున్నది.

**ముస్లింలు టెర్రరిస్టులని ప్రచారం**

ముస్లింలంటే టెర్రరిస్టులని, తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడతారని, పార్లమెంటు, ముంబాయి దాడులు తదితరాలను అందుకు సాక్ష్యంగా చూయిస్తుంటారు. కాని మతాన్ని బట్టి తీవ్రవాదం ఉండదు. తీవ్రవాదానికి పాల్పడేవారు, బాంబుదాడులు, తుపాకి కాల్పులతో అమాయక ప్రజలను చంపేవారు అన్ని మతాలలోనూ ఉన్నారు. ఒక మతాన్ని అనుసరించేవారు కొందరు తీవ్రవాదానికి పాల్పడినంత మాత్రాన ఆ మతానికి చెందిన వారందరినీ తీవ్రవాదులని ముద్ర వేయటం సరికాదు. అమెరికాలో దాదాపుగా ప్రతిరోజూ దుండగులు జరుపుతున్న కాల్పులలో నిరపరాధులైన ప్రజలు మరణిస్తున్నారు. దుండగులలో ఎక్కువ మంది క్రైస్తవ మతానికి చెందిన వారే. అలాగే లాటిన్ అమెరికాలోని అనేక దేశాలలో తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడే గ్రూపులున్నాయి. యూరప్ ఖండంలో కూడా తీవ్రవాద ఘటనలు జరుగుతున్నాయి. మరి వారిని క్రైస్తవ టెర్రరిస్టులు అని ఎందుకు అనటం లేదు? ముస్లింలలో కొద్దిమంది తీవ్రవాద ఘటనలలో పాల్గొంటే ఆ మతానికి ఎందుకని తీవ్రవాద ముద్ర వేస్తున్నారు? తన ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లింలకు తీవ్రవాద శిక్షణ ఇచ్చి, గతంలో ఆఫ్ఘనిస్థాన్‌లోని కమ్యూనిస్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో పావులుగా ఉపయోగించుకున్న అమెరికా తన అవసరం తీరిపోయిన తర్వాత వారిని ముస్లిం తీవ్రవాదులని ప్రచారం చేస్తున్నది.

దేశంలో సంఘ్ పరివార్ అతిపెద్ద టెర్రరిస్టు సంస్థగా ఉన్నది. దేశంలోని చట్టాలను, రాజ్యాంగాన్ని లెక్క చేయకుండా తనచిత్తం వచ్చిన విధంగా సాయుధ మూకలను తయారు చేసి, ముస్లింలు, దళితులపై దాడులు చేయిస్తున్నది. సంఘ్ పరివార్ అనుయాయులు అనేకచోట్ల బాంబుపేలుళ్ళకు పాల్పడుతున్నారు. దాడులు, హత్యలు చేస్తున్నారు. ఎన్‌ఆర్‌సి, సిఎఎలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై గూండాల చేత దాడులు చేయిస్తున్నారు. సంఘ్ పరివార్ నాయకత్వంలోని ప్రభుత్వాలు, నాయకులు రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారు. గుజరాత్‌లో మోడి ముఖ్యమంత్రిగా ఉండగా 2002లో ఆయన రూపొందించిన పథకం ప్రకారం 3000 మంది ముస్లింను హత్య చేశారు. సోహ్రాబుద్దీన్ షేక్, ఇష్రత్ జహాన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులలో ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నిందితునిగా ఉన్నాడు. మాలెగావ్, మక్కామసీదు, అజ్మీర్ దర్గా, లాహోర్‌కు వెళ్ళే బస్‌లో బాంబులు పేల్చి, ప్రజల ప్రాణాలు తీసినవారు సంఘ్ పరివార్‌కు సంబంధించిన టెర్రరిస్టులేనని తేలింది. నిందితులలో ఒకడిగా ఉన్న స్వామి అసీమానంద తన నేరాంగీకార పత్రంలో ఆ పేలుళ్ళ జరపటంలో తమలక్ష్యం, అందుకు రూపొందించిన పథకం, దానిని అమలు చేసిన తీరును సవివరంగా, రాతపూర్వకంగా వెల్లడించాడు. ప్రభుత్వాధికారాన్ని ఉపయోగించుకొని సామూహిక మారణకాండకు పాల్పడిన వారు, పథకం ప్రకారం టెర్రరిస్టు చర్యలకు పాల్పడుతున్న వారు టెర్రరిస్టులు కారా? దీనిని ఆసరాగా చేసుకొని హిందువులు టెర్రరిస్టులని ముద్రవేయటం సరైనదవుతుందా? మరి ముస్లిమేతర మతాలకు చెందిన వారు టెర్రరిస్టు చర్యలకు పాల్పడితే మత ప్రస్తావన లేకుండా టెర్రరిజాన్ని గురించి మాట్లాడుతూ, ముస్లిం మతానికి చెందిన వారు టెర్రరిస్టు చర్యలకు పాల్పడితే ఆ మతానికి ఆపాదించటం సరికాదు. మతం ప్రసక్తి లేకుండా ఎవరు టెర్రరిస్టు చర్యలకు పాల్పడినా ఖండించాలి. వారిపై కఠినచర్యలు తీసుకోవాలి.

సంఘ్ పరివార్‌కు చెందిన అరాచక గూండా గుంపులు పాడి కోసం ఆవులను కొనుక్కెళుతున్న ముస్లింలను కొట్టి చంపుతున్నారు. చనిపోయిన ఆవుచర్మం వలుస్తున్నారన్న కారణంతో దళితులపై దాడులు చేస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల పరిధిలో ఎన్‌ఆర్‌సి, సిఎఎలకు వ్యతిరేకంగా జెఎన్‌యు, జామియా మిలియా, ఇతర యూనివర్సిటీలు, కాలేజీలలో ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై గూండాల చేత దాడులు చేయిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన వారిని దేశద్రోహులని ముద్రవేస్తున్నారు. దారుణమైన అణచివేత చర్యలకు పాల్పడుతున్నారు. వీటిలో ఏ ఒక్క ఘటననూ ఇప్పటి వరకూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వం ఖండించలేదు. ఇటువంటి టెర్రరిస్టు చర్యలకు పాల్పడుతున్న సంఘ్ పరివార్ కన్నా తీవ్రవాద సంస్థలు దేశంలో ఉన్నాయా?

దేశపౌరులుగా ఉండి, మిగతా ప్రజలతో కలిసి దేశాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్న ముస్లింలే దేశానికి శత్రువులని చూపటానికి ఆర్‌ఎస్‌ఎస్ పథకం ప్రకారం ప్రయత్నం చేస్తున్నది. బడా పెట్టుబడిదారులు, ఆర్‌ఎస్‌ఎస్, దాని చేతిలోని ప్రభుత్వ యంత్రాంగం ముస్లింలపై దేశ వ్యతిరేకులని ముద్రవేసి, ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటానికి పూనుకుంటున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తు ఈ విధానాలు దేశ విచ్ఛిన్నానికి దారితీస్తాయి. బడా పెట్టుబడిదారుల చేతుల్లో కేంద్రీకృతమైన మీడియా వారి దోపిడీ నుండి ప్రజల దృష్టిని మళ్ళించటం కోసం ఆర్‌ఎస్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని భుజానికెత్తుకున్నది. ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయటం ద్వారా ప్రభుత్వ, ప్రజల ఆస్తులను కబళించటానికి దేశ, విదేశీ పెట్టుబడిదారులు గోతికాడ నక్కల్లా కాచుకొని ఉన్నారు. ఇందుకు సాధనంగా సంఘ్ పరివార్ వ్యవహరిస్తున్నది. సంఘ్ పరివార్ కుట్రలను తిప్పికొట్టి, దేశ ఐక్యతను, ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. దేశప్రజలు అందుకు సన్నద్ధం కావాలి.

# విద్య సరుకు కాదు ప్రాథమిక హక్కు

సుబిన్ డెన్నిస్

న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ విద్యార్థులు పెంచిన హాస్టల్ ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నారు. విద్య అనేది సరుకు కాదు అది ఒక హక్కు అని చాలా కాలం నుంచి ప్రజాస్వామిక విద్యార్థి ఉద్యమం స్పష్టం చేస్తూనే ఉంది.

కొంతకాలం నుండి కేంద్ర నిధులతో నడిచే అనేక ఉన్నత విద్య సంస్థల్లో విద్యార్థుల ఆందోళనలు చోటు చేసుకోవడం మనం చూస్తున్నాం. చెన్నై, గౌహతి, ముంబాయి లాంటి అనేక భారతీయ సాంకేతిక విద్యా సంస్థల్లో కూడా ఈ ఆందోళనలు జరుగుతూ ఉండడం మనం గమనించాల్సిన పరిణామం. అఖిలభారత వైద్య విజ్ఞానసంస్థ (ఎయిమ్స్), న్యూఢిల్లీకి చెందిన విద్యార్థులు, డాక్టర్లు, విద్యార్థుల ఫీజులు, యూజర్ ఛార్జీలను పెంచుతూ చేసిన ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. న్యూఢిల్లీకి చెందిన అంబేద్కర్ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ విద్యార్థులు కూడా తమ ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇతర అనేక సంస్థలకు చెందిన విద్యార్థులు, పరిశోధక మేధావులు జరుగుతున్న పోరాటాలకు సంఘీభావంగా ప్రకటనలు ఇస్తున్నారు. బహిరంగసభలు పెట్టి తమ మద్దతు తెలుపుతున్నారు. ఢిల్లీకి చెందిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పి.హెచ్.డి పరిశోధక మేధావులు, అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన విద్యార్థి సంఘ నాయకులు, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి సంఘం మద్దతు తెలుపుతూ ప్రకటనలు చేశారు. జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో జరుగుతున్న పోరాటాలకు మద్దతుగా కాలికట్ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు కేంద్ర మంత్రి సంజయ్ ధోత్రే ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

విద్యాహక్కుకు మద్దతుగా నవంబర్ 23న ఢిల్లీలో జరిగిన పెద్ద పౌర ప్రదర్శనలో వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులుగా ఉన్న యువత, ఉపాధ్యాయులు ఇంకా అనేక రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో విద్య అందరికి చౌకగా అందుబాటులో ఉండనందుకు నవంబర్ 27న దేశవ్యాప్తంగా నిరసన దినంగా పాటించారు.

మూడు దశాబ్దాల ఆర్థిక "సంస్కరణల "తరువాత ప్రతిరంగం ప్రైవేటీకరణలోకి నెట్టబడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అనేక మంది ప్రజలు విద్య ఒకహక్కు అనే ఆలోచనను స్వీకరిస్తున్నట్లుగా కన్పిస్తున్నది. విద్య ఒక హక్కుగా ఎలా ఉండగలదు? విద్యను పొందడానికి మనం డబ్బు చెల్లిస్తున్నాం, ఇదే విధంగా ప్రతి ఒక్కరూ చేయగలరా ? స్వేచ్ఛా వ్యాపారులు మొత్తం డబ్బును పొందే హక్కుగా మార్చే సబ్సిడీతో కూడిన విద్యా హక్కు కాదు కావలసింది, పూర్తిగా ఉచిత విద్య అని డిమాండ్ చేస్తున్నారు.

విద్య ఒక సరుకు అని నమ్మే కొంతమంది లేవనెత్తుతున్న ప్రశ్నలలో కొన్ని ఇలా ఉన్నాయి. విద్య ఒక సరుకు అని మొరటుగా వాదించేవారు విద్య కోసం ప్రతి ఒక్కరూ డబ్బు చెల్లించాలి అంటున్నారు. డబ్బులులేని వారు ఋణాలు తీసుకొని తమ ఖర్చులను భరించాలి అని వాదిస్తున్నారు. ఇందులో మరికొన్ని కొత్త వాదనలు కూడా ఉన్నాయి. వారు చెప్పేదేమంటే ఆర్థికంగా స్థితిమంతమైన కుటుంబాల నుంచి వచ్చే విద్యార్థులు అధిక ఫీజులు కట్టనివ్వండి. అలా వారి చేత అధికంగా కట్టబడిన ఫీజులు తక్కువ ఫీజులు కట్టిన పేద విద్యార్థులకు ఉపయోగించవచ్చునని చెబుతూ, దీనిని తారతమ్య ఫీజుల వ్యవస్థగా పిలుస్తున్నారు.

పైన చెప్పిన రెండురకాల వాదనలను తిరస్కరించాలి. అది ఎలాగో పరిశీలిద్దాం.

**విద్య సరుకు అనే వాదన**

మూర్ఖపు వాదనకు వ్యతిరేకంగా మాట్లాడడం, నిరూపించడం తేలిక. విద్యా సంస్థలు తాము చేస్తున్న ఖర్చులను పూర్తిగా రాబట్టుకొనే విధంగా ఫీజులు వసూలు చేయాలని నిర్ణయిస్తే ఎక్కువ మంది విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండాపోతుంది. భారతదేశం విషయంలో ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం 85 శాతం జనాభా కుటుంబ ఆదాయం నెలకు 10 వేల రూపాయల కంటే తక్కువగా ఉంది. అందువల్ల ఋణాలు తీసుకొని అధిక ఫీజులు కట్టగలగడం అనేది కూడా అందరికీ సాధ్యం కాదు. దీనికి మంచి ఉదాహరణగా అమెరికాను చెప్పవచ్చు. అక్కడ లక్షలాది మంది విద్యార్థులు విద్యారుణాలు చెల్లించలేక పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. వారు సుఖంగా ఉండడం, జీవన ప్రమాణాల మీద ఈ పరిణామాలు చాలా తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. అమెరికాలో లక్షలాది మంది వృద్ధులు ఇప్పటికీ వారి విద్యారుణాలు చెల్లిస్తూనే ఉన్నారు. ఆర్థికవ్యవస్థ సరిపోయినన్ని ఉద్యోగాలను సృష్టించలేకపోవడం, ప్రత్యేకించి విద్యారుణాలు తీసుకున్న వారు ఋణాలు తిరిగి చెల్లించే విధంగా వారికి ఉద్యోగాలు కల్పించలేకపోవడం అమెరికాలో ప్రస్తుతం చాలా తీవ్రంగా ఉంది. భారతదేశంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీలేదు.

**తారతమ్య ఫీజుల వ్యవస్థ**

ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి కొన్ని మౌలిక సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలి. విద్యార్థులలో అత్యధిక మెజారిటీ సొంత ఆదాయ వనరులు కలిగిన వారుగాలేరు. వారు వారి తల్లిదండ్రుల (లేదా ఋణాలు తీసుకోవడం) మీద ఆధార పడి ఉన్నారు. తమ పిల్లల యొక్క పాఠశాల విద్య కోసం ఫీజులు చెల్లించే తల్లిదండ్రులలో చాలా మంది ఉన్నత విద్యలో పిల్లలు కోరుకునే చదువులకు ఫీజులు కట్టడానికి సిద్ధంగాలేరు .ప్రత్యేకించి ఏంఫిల్, పి.హెచ్.డి లాంటి పరిశోధక డిగ్రీలు చేసే విషయంలో ఈ సమస్య చాలా తీవ్రంగా ఉంది. ఎక్కడైనా అరుదుగా కొద్దిమంది తల్లిదండ్రులు ఉన్నత విద్యకు ఫీజులు కట్టడానికి సుముఖత వ్యక్తం చేసినా, వారిలో కూడా చాలా ఎక్కువ మంది విద్యార్థులు ప్రాధాన్యతనిచ్చే చదువుల కంటే తాము ప్రాధాన్యత ఇచ్చేరంగాల కోసం పిల్లలను ఒత్తిడి చేస్తున్నారు. మొత్తం మీద అధిక మొత్తం ఫీజు చెల్లించడానికి

సిద్ధపడినవారు కూడా వారు కూడా వారు కట్టిన డబ్బు త్వరగా తిరిగి సంపాదించటనికి అవకాశం ఉన్న రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫీజుగా కట్టబడిన మొత్తం కంటే ఎక్కువ మొత్తం త్వరగా సంపాదించే విధంగా వృత్తి విద్యకే ప్రాధాన్యత నిచ్చి చదవాలని తల్లిదండ్రులు చాలా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు.

ప్రభాత్ పట్నాయక్ మాటల్లో చెప్పాలంటే ఎప్పుడైతే విద్య సరుకుగా మారినపుడు ఆ సరుకును కొనుగోలు చేసిన కొనుగోలుదారుడు మార్కెట్‌లో ఆ సరుకును అధిక మొత్తానికి అమ్మాలని ప్రయత్నం చేయడం జరుగుతుంది. ఉదాహరణకు – ఒక విద్యార్థి స్వయంగా 50 లక్షలు ఫీజు కట్టి ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివాడనుకుందాం. అటువంటి వారు మెడికల్ డిగ్రీ పొందగానే, ఆ డిగ్రీ పొందడానికి పెట్టిన ఖర్చులు సంపాదించడమే వారికి అత్యధిక ప్రాధాన్యత కలిగిన విషయంగా ఉంటుంది. అందువల్ల అటువంటి డాక్టర్లు అత్యధిక ఖర్చుతో కూడిన వైద్యాన్ని అందించే ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు బలవంతంగా నెట్టబడతారు. వాస్తవానికి వారు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయడానికి ప్రాధాన్యతనిచ్చినా, పేదలు, అవసరమైన వారికి సేవ చేయాలనే లక్ష్యం ఉన్నా, వారు పెట్టిన ఖర్చుల రీత్యా అనివార్యంగా వారు ప్రైవేటు వైపు నెట్టబడుతున్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రుల్లో బాగా ఖరీదైన మందులు రాయడం, అవసరం లేని, ఖర్చుతో కూడిన రోగ నిర్ధారణ పరీక్షలు తదితర ఖరీదైన పద్ధతులు అనుసరించే విధంగా డాక్టర్లు ఒత్తిడి చేయబడుతున్నారు.

> **"ఉదాహరణకు - ఒక విద్యార్థి స్వయంగా 50 లక్షలు ఫీజు కట్టి ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివాడనుకుందాం. అటువంటి వారు మెడికల్ డిగ్రీ పొందగానే, ఆ డిగ్రీ పొందడానికి పెట్టిన ఖర్చులు సంపాదించడమే వారికి అత్యధిక ప్రాధాన్యత కలిగిన విషయంగా ఉంటుంది."**

పైన పేర్కొన్న కారణాలే కాకుండా భారతదేశ పరిస్థితుల్లో మరో ముఖ్యమైన అదనపు కారణం కూడా ఉంది. అధిక ఫీజులు పర్యవసానంగా తల్లిదండ్రుల మీద అదనంగా ఆధారపడడం వల్ల విద్యార్థులు తమ ఆకాంక్షలకు వ్యతిరేకంగా, ఎవరో ఒకరిని వివాహమాడే పరిస్థితులలోకి బలవంతంగా నెట్టబడుతున్నారు. మహిళల విషయంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. ఇక అనేక మంది మహిళల విషయంలో ఎక్కడైతే ఫీజులు తక్కువగా ఉంటాయో, విద్యార్థులకు స్కాలర్ షిప్స్ కల్పించబడతాయో లేదా పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్స్ అందుబాటులో ఉంటాయో ఆ యూనివర్సిటి ప్రాంగణాలు కొంత మేరకు శ్వాస తీసుకునే వెసులుబాటును కల్పిస్తున్నాయి. పైన చెప్పిన బెదిరింపులకు, ఒత్తిళ్ళకు వ్యతిరేకంగా నిలబడగలిగే శక్తిని ఇస్తున్నాయి .చాలా మంది పురుషులు కూడా వారికి ఇష్టం లేని ఉద్యోగాలు చేసే విధంగా ఒత్తిడికి గురవుతున్నారు. అలాగే వారి ఆకాంక్షలకు వ్యతిరేకంగా జీవిత భాగస్వామిని ఎంచుకొని జీవితంలో స్థిరపడే విధంగా ఒత్తిడి చేయబడుతున్నారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే, ఒకసారి అధిక ఫీజులు చెల్లించి డిగ్రీ సంపాదించినట్లైతే కుటుంబం యొక్క ఇష్టాయిష్టాలకు బానిసగా మారడమో లేదా మార్కెట్‌కు దాసోహమనడమో, ఖర్చు పెట్టిన డబ్బును సాధ్యమైనంత త్వరగా తిరిగి సంపాదించే విధంగా ఆ శక్తులు చేస్తాయి. విద్య అనేది ప్రజలను వారంతటవారు స్వేచ్ఛా జీవులుగా మారే విధంగా సహాయపడాలి. స్వేచ్ఛగా విహరింప చేయాలి కానీ సంకెళ్ళుగా మారకూడదు.

మొత్తం మీదపరిశోధక మేధావుల(ఎవరైతే ఎంఫిల్, పిహెచ్‌డిలను ఎంచుకున్నారో)కు వారి కృషికి తగిన విధంగా పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది. మొత్తం సమాజానికి సంబంధించిన కోణంలో చూసినప్పుడు మన యొక్క విజ్ఞాన పునాదులను విస్తరింపచేయడంలో పరిశోధన ప్రధాన పాత్ర పోషిస్తుంది. కేవలం సంప్రదాయ బద్ధమైన అధ్యయనం అనే భావనలో కాదు. ప్రాథమిక విజ్ఞాన శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, కళలు, మానవాభివృద్ధి తదితరాలను కూడా కలుపుకొని అన్ని విభాగాలలో పరిశోధనలు జరగడం అవసరం. గతంలో మనలాంటి వలసలుగా ఉన్న దేశాలలో మేధోపరమైన స్వావలంబనను సాధించడానికి పరిశోధనలు చాలా ముఖ్యమైనవి. ప్రైవేటు ద్వారా నిధుల కల్పన సంఖ్య రీత్యా చాలా పరిమితంగా కొద్ది మందికే అందుబాటులో ఉంటాయి. అలాగే దేనికోసం, ఏమి పరిశోధన చేయబడుతుంది అనే దానితో కూడా ముడిపడి ఉంటుంది. చేసే పరిశోధనలపై కూడా అనేక నిబంధనలు విధిస్తారు. నిధులు ఏర్పాటు చేసిన వారు కోరిన విధంగా చేస్తేనే అది కుదురుతుంది. అందువల్ల ఈ రకమైన పరిశోధనలన్నీ తప్పనిసరిగా ప్రభుత్వ నిధులతోనే జరపాలి.

ఒక దశాబ్దం క్రితం జాతీయ వైజ్ఞానిక సంస్థ పూర్తిగా తీవ్రవాద విభాగం కాకపోయినా కింది పేర్కొన్న కొన్ని సిఫార్సులు చేసింది.

"సాధారణంగా ఆసక్తి, ప్రతిభ కలిగిన ప్రజలు రీసెర్చి విభాగాలను ఎంచుకుంటారు. వారు భవిష్యత్తులో మంచి సంపాదన కలిగిన అవకాశాల కోసం ప్రయత్నం చేస్తారు. అంతే కాకుండా వేతన సమస్యల వలన అనేక మందిని ఆకర్షించే విషయంలో విధానపరంగా విఫలం కావడం జరుగుతున్నది. అందువల్ల వేతనాలు నిర్ణయించడం, అవకాశాలు కల్పించడం అనేవి చాలా ముఖ్యమైన కారణాలుగా ఉంటున్నాయి. పి.హెచ్.డి మరియు ఇతర సాధారణ మైన మొత్తం విద్యా సంబంధంమైన అంశాల ద్వారా ఫెలోషిప్స్‌కు చెల్లించబడే మొత్తం రెగ్యులర్‌గా పెంచబడుతూ ఉండాలి''. చాలా సంవత్సరాలుగా భారతదేశంలో కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు చేసే మేధావుల్లో అత్యధిక శాతానికి ఫెలోషిప్‌గా చెల్లించే మొత్తం స్థిరంగా నెలకు 5000/–గా మాత్రమే ఉంది. ఎంఫిల్, పి.హెచ్.డి చేసేవారికి మాత్రం 8000/–ఉంది. ఫీజులు పెంచడం ద్వారా విద్యార్థులు మరియు పరిశోధకుల యొక్క జీవన వ్యయాలను ప్రమాదకరంగా పెంచే దానికి బదులు పరిశోధక మేధావులకు ఫెలోషిప్ మొత్తాన్ని పెంచాలి. అలాగే ఇతర డిగ్రీలు చదివే పేద విద్యార్థులకు సరిపోయినంత స్కాలర్ షిప్ పొందే ఏర్పాటు ప్రభుత్వం చేయాలి.

**ప్రభుత్వ విద్యా సంస్థలో ప్రమాణాలు తక్కువగా ఉన్నాయా ?**

ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో ప్రమాణాలు తక్కువగా ఉంటున్నాయని కొంత మంది ఆరోపిస్తున్నారు. కానీ వాస్తవాలు ఇది

> **“ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో ప్రమాణాలు తక్కువగా ఉంటున్నాయని కొంత మంది ఆరోపిస్తున్నారు. కానీ వాస్తవాలు ఇది తప్పు అని నిరూపిస్తున్నాయి. మన ఉత్తమమైన ఉన్నత విద్యా సంస్థలు - జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, హైదరాబాద్ యూనివర్సిటి, ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తదితర సంస్థలన్నీ ప్రభుత్వరంగంలోనే ఉన్నాయి.”**



ఐ.ఐ.టి ముంబాయి

తప్పు అని నిరూపిస్తున్నాయి. మన ఉత్తమమైన ఉన్నత విద్యా సంస్థలు – జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీ, హైదరాబాద్ యూనివర్సిటి, ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తదితర సంస్థలన్నీ ప్రభుత్వరంగంలోనే ఉన్నాయి. ఇక పాఠశాలల విషయంలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాసంస్థలు ఉన్నతమైన ప్రమాణాలు కలిగిన ఉన్న విషయం అందరికి తెలిసిందే. ఇక్కడ అతిముఖ్యమైనది నిధుల సమస్యే. సరిపోయినన్ని నిధులు కేటాయించినట్లైతే ప్రభుత్వ పాఠశాలలు అద్భుతంగా ఉంటాయని కేరళ, ఢిల్లీ నిరూపిస్తున్నాయి. అదే సమయంలో వాటిని ప్రైవేటీకరణ వైపు నడిచే విధంగా సిద్ధం చేయడానికి బదులు ఆ పాఠశాలలు బాగా నడవడానికి కావలసిన శ్రద్ధ పెట్టడం అవసరం.

**నిధుల సంగతేమిటి?**

ప్రపంచంలో చాలా దేశాలతో పోల్చితే భారతదేశం విద్య మీద చాలా తక్కువ ఖర్చు పెడుతున్నది. భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య కోసం ఉమ్మడిగా పెడుతున్న ఖర్చు స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 3 శాతం మాత్రమే. ఇది సోషలిస్టు క్యూబా తోనే కాదు. అనేక పాశ్చాత్య, యూరోపియన్ దేశాలు, స్కాండినేవియన్ దేశాలు లాంటి విద్యను ఉచితంగా అందించే దేశాలతో మాత్రమే కాదు. ఇతర అభివృద్ధి చెందుతున్న బ్రెజిల్, దక్షిణాఫ్రికా మరియు కెన్యా లాంటి దేశాల కంటే తక్కువగా ఉంది.

ప్రభుత్వం విద్య, వైద్యం కోసం మరింత ఎక్కువగా నిధులను ఖర్చు చేయాలని, ఉద్యోగ కల్పన కోసం అధిక మొత్తంలో ప్రభుత్వ నిధులను కేటాయించాలని యువత, విద్యార్థి ఉద్యమాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనికి జవాబుగా అత్యధిక శాతం పాలక రాజకీయ నాయకులు, ప్రధాన స్రవంతికి చెందిన ఆర్థికవేత్తలు ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది అని అడుగుతున్నారు. దానికి సంక్షిప్త సమాధానం “ధనికులపై పన్ను” గా ఉంటుంది.

**ధనికుల పై పన్ను విధించాలి**

భారతదేశంలో ధనికులు పన్నులు చెల్లించడానికి అయిష్టతను వ్యక్తం చేస్తారు. వారు పన్నుల నుంచి చాలా ఎక్కువ మినహాయింపులు పొందే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ నియంత్రణ చేస్తారు. ప్రజాసేవ చేయడానికి తగినంత ఆదాయాన్ని పెంచలేని, నిధులు కేటాయించలేని పరిస్థితులలోకి భారతదేశం వెళ్ళింది. ఇది భారతదేశం యొక్క పన్ను, జిడిపి నిష్పత్తిలో కనిపిస్తుంది. భారత్‌లో జిడిపి పన్ను నిష్పత్తి ప్రపంచంలోనే అతి తక్కువగా 17.8 శాతంగా ఉంది. అభివృద్ధిలో ముందున్న, బలమైన ప్రజాసేవలు, సామాజిక భద్రతా కల్పిస్తున్న దేశాలలో జిడిపి పన్ను నిష్పత్తిలో అధికంగా ఉన్నది. స్వీడన్‌లో ఇది 44.6 శాతం, ఫ్రాన్స్‌లో 47.9 శాతం, బ్రిటన్‌లో 34.8 శాతం ఉంది. చివరికి సామాజిక భద్రతా వ్యవస్థ బలహీనంగా ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కూడా 26.3 శాతంగా ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు బ్రెజిల్, దక్షిణాఫ్రికాలలో కూడా వరుసగా వాటి శాతం 33.8 శాతం, 29.4 శాతంగా ఉంది.

పన్ను మినహాయింపులకు దూరంగా ఉండడం, వారసత్వ పన్నుతో కూడిన సంపద పన్నువిధించడం ద్వారా ఆదాయాలను గణనీయంగా పెంచుకోవచ్చని ఆర్థికవేత్తలు చాలా కాలం నుంచి చెబుతున్నారు.

విద్యార్థి, యువజన ఉద్యమాలు తమ ముఖ్యమైన డిమాండ్లకు మరికొన్ని డిమాండ్లను కూడా కలుపుకోవలసిన అవసరం ఉంది. ఆ విధంగా చేయడం ద్వారా అపారమైన విలువ కలిగిన ఆదాయాలకు మార్గం ఏర్పర్చవచ్చు. “నిధుల కొరత” అనే వాదనలతో అనేక వర్గాలకు చెందిన ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. వీటి ద్వారా ఆచరణలో సరిపోయినన్ని నిధులను పెంచుకోవచ్చు అని నిరూపించవచ్చు.

“ధనవంతుల మీద పన్ను వేయండి” అనే డిమాండ్ చాలా సులభంగా, ఉపయోగకరంగా విద్యార్థి ఉద్యమంలో చేర్పించవచ్చు. తద్వారా పెంచిన అధిక ఫీజులను తగ్గించండి, అధిక స్కాలర్ షిప్‌లు, ఫెల్ షిప్స్ ఇవ్వండి అనే డిమాండ్ బలంగా తీసుకెళ్ళవచ్చు.

1968 మేలో జరిగిన ఫ్రెంచ్ విద్యార్థి ఉద్యమంలో ప్రముఖ నినాదాలలో ఒక నినాదం “వాస్తవవాదులుగా ఉండండి. అసాధ్యాన్ని డిమాండ్ చేయండి. ఈ నినాదంలో ఉన్న స్పష్టమైన వైరుధ్యం ఏమంటే ఈ వ్యవస్థ వారి యొక్క నినాదాలను నెరవేర్చటాన్ని అసాధ్యం చేస్తుంది. ఏది ఏమైనా ఈ రోజు మనం మాట్లాడుతున్న డిమాండ్లు సాధ్యమైనవి మాత్రమే.

**(అనువాదం: కె. నాగమల్లేశ్వరావు)**

❋

# కార్మికవర్గమే విప్లవానికి నాయకత్వం వహించగలదు

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**ఫిబ్రవరి నెల 5,6 తేదీలలో ప్రజాశక్తిలో పనిచేస్తున్న పార్టీ సభ్యులకు జరిగిన రాజకీయ శిక్షణా తరగతులలో వచ్చిన ప్రశ్నలు:**

**సిపిఐ, నక్సలైట్లు, మన కార్యక్రమానికి తేడా ఏమిటి?**

భారత కమ్యూనిస్టు పార్టీ 1964లో చీలి రెండు పార్టీలు ఆవిర్భవించాయి – సిపిఐ(ఎం), సిపిఐ. మరల 1967లో ఒక బృందం సిపిఐ(ఎం) నుండి చీలి సిపిఐ(ఎంఎల్)గా ఏర్పడింది. ఈ అతివాద ధోరణికి గురైన బృందం తర్వాత చీలికలు పీలికలై అనేక గ్రూపులుగా ఏర్పడ్డారు.

1964లో సిపిఐ, సిపిఐ(ఎం)లు రెండూ కార్యక్రమాలను ఆమోదించుకున్నాయి. సిపిఐ(ఎం) మారిన పరిస్థితులను గమనంలో పెట్టుకుని తన పార్టీ కార్యక్రమాన్ని 2000 సంవత్సరంలో తాజాపర్చుకుంది. సిపిఐ తన కార్యక్రమాన్ని సవరించుకోవడానికి 1989లో ఒక చిత్తును రూపొందించింది. చర్చల తర్వాత 1992లో తాత్కాలికంగా ఒక కార్యక్రమ పత్రాన్ని ఆమోదించింది. చివరికి 2015లో పూర్తిస్థాయి కార్యక్రమాన్ని రూపొందించుకుంది. 1970వ దశకంలో కమ్యూనిస్టు పార్టీలు చీలిపోయినపుడు సిపిఐ రివిజనిస్టు ధోరణితో కూడిన కార్యక్రమాన్ని రూపొందించుకుంది. నక్సలైట్లుగా విడిపోయినవారు ఒక దుందుడుకువాద విధానాన్ని ముందుకుతెచ్చారు. అటు రివిజనిజాన్ని, ఇటు దుందుడుకువాదాన్ని తిరస్కరించి, అటు రష్యా కమ్యూనిస్టు పార్టీ, ఇటు చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయంగా ముందుకుతెచ్చిన పొరపాటు వాదనలను కాదని, భారతదేశ పరిస్థితులకు మార్క్సిజం – లెనినిజాన్ని అన్వయించుకుని ఒక స్వతంత్రమైన కార్యక్రమాన్ని సిపిఐ(ఎం) రూపొందించు కున్నది.

భారత రాజ్య స్వభావం, విప్లవ సంఘటన పొందిక, విప్లవ దశ, విప్లవ స్వభావం మొదలగు అనేక అంశాలపై అటు సిపిఐ ఇటు నక్సలైట్ పార్టీలకు భిన్నంగా, సరైన వైఖరి సిపిఐ(ఎం) తీసుకున్నది. ఈ భిన్న వైఖరులను వివరిస్తూ గతంలో అనేక గ్రంథాలు ప్రచురించబడ్డాయి. సరైన అవగాహన పొందాలంటే వాటిని అధ్యయనం చేయడం మంచిది.

ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవడానికి గత చరిత్రను తెలుసుకోవాల్సిందే. కానీ మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వామపక్షాల మధ్య ఐక్యత ఎంతో అవసరం. సైద్ధాంతిక తేడాలను విస్మరించకుండానే ప్రస్తుతం ఐక్య కృషికి తోడ్పడే అంశాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అందుకే సిపిఐ(ఎం) వామపక్ష ఐక్యతను సాధించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి కృషి చేస్తున్నది.

**విప్లవానికి కార్మికులే నాయకత్వం వహిస్తారని చెబుతున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మిక సంఘాలను పెట్టుకోవడానికి కూడా యాజమాన్యాలు అంగీకరించటం లేదు. ఈ విధమైన ప్రతికూలతలు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో మనంఒక్క కార్మికవర్గం మాత్రమే విప్లవానికి నాయకత్వం వహిస్తుందని భావించటం సరైనదేనా?**

**మధుకర్**

ప్రపంచవ్యాప్తంగా సరళీకరణ విధానాలు వచ్చిన తర్వాత కార్మికోద్యమంపై తీవ్రమైన ఎదురుదాడి జరిగింది. కార్మికసంఘాలను బలహీనం చేయడానికి ప్రభుత్వాలు, యాజమాన్యాలు అనేక పద్ధతులు అనుసరిం చాయి. సంఘాలను ఏర్పాటు చేసుకునే అవకాశాలను చట్టబద్ధంగాను, చట్ట విరుద్ధంగాను దెబ్బకొట్టాయి. ఈ పాలకవర్గ దాడికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడుతూనే ఉన్నారు. అయితే కార్మికసంఘాలపై దాడి ఉన్నంతమాత్రాన కార్మిక ఉద్యమాలు ఆగిపోవు. పెట్టుబడిదారీ విధానం ప్రారంభ దినాలలో సంఘాలు లేకపోయినా కార్మిక పోరాటాలు జరిగాయి. గతంలోనూ, ఇప్పుడు కూడా ప్రజాస్వామ్యం లేకుండా నియంతల పాలనలో ఉన్న దేశాలలో అనేక ఇబ్బందులు, కష్టాలను ఎదిరించి కార్మికులు పోరాడుతున్నారు. అందువలన కార్మికులు సంఘాలు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయా లేవా అనేదాన్ని బట్టి విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించగలదా లేదా అనేది నిర్ణయం కాదు. ఆధునిక సమాజంలో ఉన్న అన్ని వర్గాలు, తరగతులతో పోల్చుకున్నపుడు సమాజాన్ని సమూలంగా మార్చాలనే ఆకాంక్ష, శక్తి కలిగి, ఇతర తరగతులను సమీకరించి ఐక్యతను సాధించగలిగే అవకాశం కార్మికవర్గానికి అధికంగా ఉన్నందునే ఈ వర్గం విప్లవానికి నాయకత్వం వహించగలదని భావిస్తున్నాము. కార్మికవర్గ నాయకత్వం అంటే అర్థం ఇతర వర్గాలు, తరగతులు అవసరం లేదని కాదు, అవి విప్లవ పోరాటంలో తగిన పాత్ర నిర్వహించలేవని కాదు. సామాన్య రైతాంగం, అభ్యుదయకరమైన మధ్యతరగతి, విసిగిపోయిన మేధావివర్గం కూడా విప్లవంలో వివిధ స్థాయిల్లో కీలకపాత్ర నిర్వహిస్తాయి. అయినంతమాత్రాన అవి విప్లవానికి నాయకత్వం వహించలేవని, ఆ వర్గాల, తరగతుల స్వభావరీత్యానే అది సాధ్యం కాదని మార్క్సిజం భావిస్తుంది.

నేడు మన దేశంలో పాలకవర్గాలు ఒక్క కార్మికవర్గాన్నే అణచివేయడంలేదు. రైతాంగం, మధ్యతరగతి, దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలు – ఒకటేమిటి అన్ని తరగతుల బలహీన వర్గాల హక్కులపై, జీవన పరిస్థితులపై దాడి చేస్తున్నాయి. కార్మికవర్గంతో సహా అన్ని వర్గాలు, తరగతులు నిర్బంధాన్ని ఎదుర్కొంటు న్నాయి. ఇందులో ఒకరు ఎక్కువా తక్కువా అని కాదు. అందరూ పోరాడాల్సిందే, అందరూ సహకరించుకోవాల్సిందే, ఐక్యం కావలసిందే. ఇందులో కార్మికవర్గం చొరవ చూపించాలి. బాధ్యత వహించాలి. అది చూపించే చొరవ, అది వహించే బాధ్యతను బట్టి దాని ప్రత్యేకతను అందరూ గుర్తిస్తారు. తద్వారా అది నాయకత్వ పాత్ర నిర్వహిస్తుంది. కార్మికవర్గానికి నాయకత్వ పాత్ర ఎవరో ఇస్తే వచ్చేది కాదు. తన మార్గదర్శకత్వం ద్వారా అది సాధించుకోవాలి.

**మత ప్రాతిపదికపై బిజెపి చేస్తున్న విధ్వంసం పెట్టుబడిదార్లకు కూడా నష్టమే కదా? అయినా వారు బిజెపికే ఎందుకు మద్దతిస్తున్నారు?**

**సంతోష్**

బిజెపి పాలనలో ప్రజలపై జరుగుతున్న అత్యాచారాలు, మూకదాడులు, నేరాలు, మత ఉద్రిక్తతలలాంటివన్నీ అశాంతి వాతావారణాన్ని సృష్టిస్తున్నందున ఈ పరిస్థితి పెట్టుబడిదారులకు నష్టం గదా, ఎందుకు వారు బిజెపిని సమర్థిస్తున్నారు అన్న భావం మీ ప్రశ్నలో ఇమిడి ఉన్నది. దోపిడీకి ఇబ్బందులు వచ్చినపుడు, దోపిడీని ఎదిరించే పరిస్థితులు, ప్రతిఘటన జరిగే పరిస్థితులు ఉత్పన్నమయినపుడు పెట్టుబడిదారులు వాటిని ఎదుర్కొనేందుకు హింసాయుత కార్యకలాపాలను, అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తారు. అందువలన పెట్టుబడిదారులు శాంతి, అశాంతి పరిస్థితులను తమ లాభం

దృష్టి నుండే చూస్తారు. ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి నిరోధక రాజకీయ శక్తులను పెట్టుబడి ప్రోత్సహిస్తున్నది. సరళీకరణ విధానాల వల్ల ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని అదుపుచేసేందుకు, పక్కదోవ పట్టించేందుకు ఈ అభివృద్ధినిరోధక శక్తులు పెట్టుబడికి తోడ్పడతాయి. మన దేశంలో కూడా పెట్టుబడి అత్యంత అభివృద్ధి నిరోధక, మతోన్మాద శక్తి అయిన బిజెపిని ఎగదోస్తున్నది.

కేంద్రంలో బిజెపి నాయకత్వంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ ప్రభుత్వం అనేక ప్రమాదకర నిర్ణయాలు తీసుకుంటున్నది. ఇప్పటివరకూ కొన్ని మౌలికమైన విలువలు అనుకుంటున్న లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయానికి ఈ నిర్ణయాలు తీవ్ర ప్రమాదం తెచ్చిపెడుతున్నాయి. ప్రజాస్వామిక హక్కులకు, వ్యవస్థలకు హాని చేస్తున్నాయి. ఈ ప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థికపరమైన నిర్ణయాలు సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నాయి. ఇప్పటివరకూ ఉన్న కార్మిక చట్టాలలో కొద్దిపాటిగానైనా ఉన్న ప్రయోజనకరమైన అంశాలను తొలగించి కార్మిక కోడ్ల పేరుతో కొత్త చట్టాలను ఇటీవల పార్లమెంటు ఆమోదించింది. ఈ కోడ్లు కార్మిక హక్కులను కాలరాచి పెట్టుబడిదారుల దోపిడీకి స్వేచ్ఛని కల్పించాయి. విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి, నిష్క్రమణకు ఇంకా మిగిలి ఉన్న ఆటంకాలను పూర్తిగా తొలగించివేసింది. ప్రభుత్వరంగ సంస్థలను – విద్య, వైద్యం, రైల్వే, రక్షణ, రవాణా – ఏ రంగాన్నీ వదిలిపెట్టకుండా ప్రైవేటీకరణ చేస్తున్నది. తాజా బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రజలకిస్తున్న రాయితీలకు, సంక్షేమ పథకాలకు, సబ్సిడీలకు కోత పెట్టింది. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చింది. ఈ ప్రభుత్వ విధానాల మూలంగా దేశ ఆర్థికవ్యవస్థ తీవ్రమైన మాంద్యంలో పడింది. ఈ మాంద్యం నుండి బయటపడటానికి ప్రజలమీద భారాల మోపి పెట్టుబడిదారీ వర్గంయొక్క నష్టాలను భర్తీ చేస్తున్నది.

అందుకే స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులు ఎటువంటి మినహాయింపు లేకుండా ఈరోజు బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులకు మద్దతిస్తున్నాయి. తమ ప్రయోజనాలు కాపాడగల శక్తి బిజెపియేనని అవి భావిస్తున్నాయి. అందుకే ఈ మధ్య కాలంలో జరిగిన ఎన్నికలన్నింటిలోనూ కార్పొరేట్ సంస్థలు జారీ చేసిన వేలకోట్ల రూపాయల ఎన్నికల బాండ్లలో అత్యధిక భాగం బిజెపి ఖజానాలోకే చేరాయి. సంఘ్‌పరివార్ శక్తులు పెంచిపోషిస్తున్న మతోన్మాదం, మత ఉద్రేకాలు, కలహాలు అన్నీ ప్రజలమధ్య చిచ్చుపెట్టి, విభజన చేసి తమకు జరుగుతున్న అన్యాయాలపై ఐక్య పోరాటాలకు సన్నద్ధం కాకుండా ఆపగలుగుతున్నాయి. ఈవిధంగా కూడా బిజెపి పాలన ఈరోజు పెట్టుబడిదారీ వర్గానికి సహాయకారిగా ఉన్నది. అందువలన బిజెపి చేష్టలు పెట్టుబడిదారులకు నష్టం అని అనుకోరాదు.

**బిఎస్‌పి ప్రజల పార్టీనా, పెట్టుబడిదారుల పార్టీనా? కులం ద్వారా రాజ్యాధికారం సాధించటం సాధ్యమౌతుందా?**

కులం ద్వారా రాజ్యాధికారం సాధించటం సాధ్యం కాదు. వేలకువేల కులాలుగా చీలిన దేశంలో ఏదో ఒక కులమే అధికారం చేపట్టవచ్చు అనుకోవడం భ్రమ అవుతుంది. ఒకవేళ కులం ద్వారా అధికారం సాధ్యమైనా అది కష్టజీవులకు ఉపయోగపడదు. కులవ్యవస్థ కష్టజీవులను విభజన చేస్తుంది, అణచివేస్తుంది. అటువంటిదాని ప్రాతిపదికపై రాజ్యాధికారం సాధ్యమనుకున్నా అది విభజనకు, అణచివేతకే దారితీస్తుంది.

ఉత్తరప్రదేశ్‌లో బహుజనులు అంటే దళితులు, ఇతర బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీగా బిఎస్‌పి ఆవిర్భవించింది. కొంతకాలం రాష్ట్రస్థాయిలో అధికారంలో కూడా కొనసాగింది. బలహీన వర్గాల చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చిందని చాలామంది భావించారు. ఒక బలహీన వర్గం నుండి వచ్చిన వ్యక్తి ముఖ్యమంత్రి కావడమనేది నిజం. అయితే బలహీన వర్గాల నుండి ముఖ్యమంత్రులు కావడం బిఎస్‌పితోనే మొదలుకాలేదు. అనేక పార్టీలు కూడా అధికారానికి వచ్చినపుడు బల హీన వర్గాల నుండి ముఖ్యమంత్రులను చేశాయి. అయితే ఈ పార్టీల పాలనా అను భవాలను చూస్తే బలహీన వర్గాల నుండి ముఖ్యమంత్రి అయినంత మాత్రాన ఈ వర్గాలకు రాజ్యాధి కారం వచ్చిందని భావించడం సరి కాదని విదితమవుతుంది. బిఎస్‌పి విషయంలో కూడా అంతే. బిఎస్‌పి అధికారంలో ఉన్నపుడు దళితు లకు, బలహీన వర్గాలకు తాత్కాలికంగా ఉపశమనం ఇచ్చే కొన్ని పనులను చేపట్టింది. అదే సందర్భంలో రాష్ట్రంలోని పాలకవర్గా లయిన పెట్టుబడిదారులు, భూస్వాములు, అగ్ర కుల పెత్తందారుల ప్రయోజనాలకు అనుగుణంగానే పరిపాలన సాగించింది. అందువలన బిఎస్‌పిని స్థూలంగా ఒక ప్రాంతీయ, బూర్జువా, పెటీ బూర్జువా పార్టీగానే పరిగణించాల్సి ఉంటుంది.

**ఆర్థికపోరాటాలు సామాజిక, రాజకీయ పోరాటాలుగా మారకపోవటానికి కారణం ఏమిటి? మనకృషిలో లోపమా? బాహ్య పరిస్థితుల ప్రభావమా?**

సమాజంలో వర్గపోరాటం నిరంతరాయంగా జరుగుతుంటుంది. కొన్నిసార్లు బహిరంగంగా, కొన్నిసార్లు అంతర్లీనంగా ఉండవచ్చు. కొన్ని సందర్భాలలో శాంతియుతంగా, మరికొన్ని సందర్భాలలో హింసాత్మకంగా ఉండవచ్చు. ఈ వర్గపోరాటంలో కొన్నిసార్లు దోపిడీవర్గాలది పైచేయి కావచ్చు, కొన్నిసార్లు కష్టజీవులది పై చేయి కావచ్చు. అలాగే వర్గపోరాటం సమాజంలోని అన్ని స్థాయిల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలలో వ్యక్తం కావచ్చు. ఈ పోరాటాలన్నీ మామూలు పరిస్థితుల్లో కొంత పరస్పర ప్రభావం చూపుకున్నా, స్థూలంగా దేనికవే విడివిడిగా జరుగుతాయి. మొత్తం సమాజం తీవ్రమైన సంక్షోభంలో పడినప్పుడు ఈ పోరాటాలన్నీ ప్రజానీకంలో ఒక ఉన్నతస్థాయి చైతన్యాన్ని కలిగించి ప్రస్తుత వ్యవస్థను భరించలేమని కొత్త వ్యవస్థను సృష్టించుకోవాలన్న భావనను ముందుకు తీసుకువస్తాయి. అప్పుడు ప్రజలు విప్లవకరమైన మార్పు కోసం అత్యున్నత రాజకీయ పోరాటాన్ని ఎంచుకుంటారు. మన దేశంలో అటువంటి పరిస్థితులు ఇప్పుడు లేవు. అందువలన అత్యున్నత స్థాయి రాజకీయ పోరాటానికి పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని మనం అనుకోవడం లేదు. ఇప్పుడు లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి బూర్జువా ప్రజాస్వామిక అంశాలను రక్షించుకోవాల్సిన పరిస్థితుల్లో ఉన్నాము. వీటిని రక్షించుకునే పోరాటం కూడా రాజకీయ పోరాటమే. ప్రస్తుత వ్యవస్థను దాటి ముందుకు పోవాలనేవి కాకపోయినా వీటిని కూడా రాజకీయ పోరాటాలుగానే పరిగణించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సిఎఎ-ఎన్ ఆర్‌సి-ఎన్‌పిఆర్ లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం రాజకీయ పోరాటమే.

ఆర్థిక పోరాటాలలో రాజకీయ అంశాలు ఉండవనుకోరాదు. జనవరి 8వ తేదీన జరిగిన కార్మికవర్గ సార్వత్రిక సమ్మె డిమాండ్లలో అనేక ఆర్థిక అంశాలతో పాటు రాజకీయ అంశాలు కూడా ఉన్నాయి. పైగా అది కేంద్ర బిజెపి విధానాలను ప్రతిఘటించడానికి జరిగిన సమ్మె. అందువలన ఆర్థిక, రాజకీయ పోరాటాలను సంబంధంలేని పోరాటాలుగా చూడకూడదు. అయితే మీ ప్రశ్నలో నేను అర్థం చేసుకున్నమేరకు ఆర్థిక పోరాటాలు ప్రస్తుత దోపిడీ సమాజాన్ని మార్చాలనే రాజకీయ స్థాయికి ఎందుకు ఎదగడం లేదు అన్న భావం ఉందనుకుంటున్నాను. పైన పేర్కొన్నట్లే అన్ని రంగాల్లోనూ చాలా తీవ్రమైన స్థాయిలో పోరాటాలు ఉధృతమై వాటన్నింటిలో ప్రజలను సమైక్యపరచి వ్యవస్థనే మార్చాలనే రాజకీయ శక్తి బలీయమై, ఇక ఏమాత్రం ప్రస్తుత వ్యవస్థ పాత పద్ధతిలో కొనసాగే అవకాశం లేని పరిస్థితులు వచ్చినపుడు ఈ పోరాటాలు విప్లవ రాజకీయ స్థాయికి చేరుకుంటాయి. ఈ దృక్పథంతో రాజకీయ పోరాటాలను అంచనా వేసినపుడు ఆ స్థాయికి చేరుకోడానికి ఇంకా చాలా కృషి జరగాల్సి ఉంటుంది. ❋

# సింధు ప్రజల వాణిజ్యం

(17వ పేజీ తరువాయి)

**సింధు నాగరికత- లిపి- కళలు- మతం**

సింధు నాగరికత సాధించిన ప్రధానమైన విజయాలలో ఒకటి లిపిని కనుగొనడం. ఆ నాగరికత ఆరంభమైన క్రీ.పూ 2500 తో మొదలై అది అంతరించిన క్రీ.పూ 2000తో ఈ లిపి కూడా అదృశ్యం అయిపోయింది. ప్రపంచంలో అతి పురాతనమైన నాలుగు లిపులలో సింధు లిపి ఒకటి. ఇది లోగో– సిలబిక్ లిపి. కొన్ని ప్రాంతాలను/ ఘటనలను/ వ్యాపకాలను సూచించే సంకేతాలు 'లోగో' అంటాం. అటువంటి లోగోలతో పాటు కొన్ని అక్షరాల వంటి సంకేతాలను కలగలిపిన లిపి ఇది. అదే కాలంలో మెసపుటేమియా ప్రాంతంలో కూడా ఇదే లక్షణాలు గల లిపి ఉండేది. అయితే దురదృష్టం ఏమంటే ఇంతవరకూ ఈ రెండు లిపులనూ వివరించడం సాధ్యపడలేదు.

మట్టి సీళ్లమీద, రాగి సీళ్లమీద, కుండల మీద ఈ సింధు లిపి లిఖించబడింది. అదే గనుక ఏ వస్త్రాలపైనో, చెట్లబెరళ్లపైనా రాసి ఉంటే ఎప్పుడో నాశనమై మనకు తెలియకుండా పోయేది. ఈ లిపి సాధారణంగా కుడివైపు నుండి ఎడమవైపుకు రాయబడివుంది. (ఉర్దూలిపి మాదిరిగా) ప్రతీ సీలు మీద నాలుగైదు సంకేతాలే ఉన్నాయి. ఇటువంటివి మనకు 4000కు పైగా లభ్యం అయ్యాయి. ఈ సంకేతాల్లో తరచు మత్స్యం గుర్తు (చూ. టేబుల్‌లో 1,7,8 గుర్తులు) వస్తుంది. ఇదే గుర్తు 'బ్రహాయి' అనే ప్రాచీన భాషలో వాడారు. ఇది ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలో వాడిన భాష. ఈ 'బ్రహాయి' ఉత్తర ద్రవిడ భాష. దీనిని బట్టి అటు మెసపుటేమియా ఇటు ద్రవిడ సంబంధాలతో సింధు భాష ఉండేదని అనుకోవాలి. ఈ సీళ్లమీద లభించిన భాష బహుశ ఆనాటి మతాధికారులు, ప్రభువులు, వ్యాపార వర్గాలు వాడిన భాష అయి వుండాలి.

ఆ వ్యాపారపు లెక్కలకు, కొలతలకు తూకాలకు వారు వాడిన గణితం ఏ పాటిదో, ఆనాటి వారి శాస్త్ర విజ్ఞానం ఏమిటో, వారికి జామెట్రీ ఎంతమేరకు తెలుసో మనకు ఇదమిత్థంగా తెలియాలంటే సింధు లిపి చిక్కుముడి వీడాల్సిందే. ఐతే వారికి ఎంతో కొంతమేరకు నక్షత్ర మండలంలోని కదలికల గురించిన జ్ఞానం ఉండి వుండాలి. లేకపోతే సుదూర ప్రయాణాలు సాధ్యపడేవి కావు. దొరికిన అస్థిపంజరాలను బట్టి ఆ కాలంలో నొప్పిని శరీరం నుండి తొలగించడానికి పుర్రెకు రంధ్రం చేసే ఆపరేషన్లు (నిజానికి ఇవి చావును వేగవంతం చేస్తాయి) జరిగాయని అర్థం అవుతోంది.

మొహంజొదారో తవ్వకాలలో బయటపడిన అరుదైన శిల్పఖండాలు ఆనాటి ప్రజల వేషధారణను, వారు ఉపయోగించిన ఆభరణాలను సూచిస్తున్నాయి. ఐతే ఈ శిల్పఖండాలు చిన్న చిన్న ఆకృతుల్లోనే ఉన్నాయి తప్ప భారీ ఆకృతులు లేవు. అంతేగాక, శిల్పకారులు వీటిని కొందరు సంపన్నుల కోసమే తయారు చేసినట్టు అనిపిస్తుంది.

సింధు ప్రజలు ఒకే ఒక మతాన్ని, ఆరాధన పద్ధతిని ఆచరించారని చెప్పే దాఖలాలు లేవు. వేరు వేరు తరగతుల ప్రజలు, వేరు వేరు ప్రాంతాల్లో రకరకాల మతాచారాలను పాటించారని అనుకోవచ్చు. లభించిన సీళ్లలో అత్యధిక భాగం ఒంటికొమ్ముతో ఉండే మూపురం లేని ఎద్దు ఆకృతితో ఉన్నాయి. ఇటువంటి జంతువు ఖచ్చితంగా కాల్పనిక జంతువే. (చూ.2.18) కొన్నింటిపై అడవి దున్న, కొన్నింటిపై మూపురం ఉన్న ఎద్దు ఆకృతులు ఉన్నాయి. ఎక్కడా ఆవు ఆకృతి ఉన్న సీళ్లు లేవు. కుందేళ్ళు, గేదె ఆకృతులు కూడా ఉన్నాయి. బహుశ ప్రతి గణమూ ఏదో ఒక జంతువును తన చిహ్నంగా ఎంచుకుంటుంది గనుక ఈ సీళ్లు ఆయా గణాలను సూచించేవిగా పరిగణించాలి.

వివిధ జంతువులు చుట్టూ చేరి వుండగా యోగముద్రలో కూర్చొని ఉన్న ఒక ఆకృతిని చిత్రీకరించిన సీలు ఒకటి దొరికింది. ఇది మెసపుటేమియా ప్రాంతంలో ఆరాధించిన జంతుముఖపు దేవతల బొమ్మల మాదిరే ఉంది. (చూ.2.19) ఇంకొక సీలు మీద పులి శరీరంతో ఉన్న దేవత బొమ్మ ఉంది (చూ.2.23) మరొక సీలులో వృక్ష దేవత బొమ్మ ఉంది. చుట్టూ మనుషులు ఉన్నట్టుగా చిత్రీకరించబడింది. ఇవన్నీ ఆనాటి మతారాధనలను తెలియజేస్తున్నాయి. ప్రధానంగా ప్రకృతి దేవతలను, జంతు ఆకృతులతో కూడిన దేవతామూర్తులను ఆరాధించే విధానాలనే సింధు ప్రజలు పాటించినట్టు సూచిస్తున్నాయి. ఈ మతారాధనలకు, రుగ్వేదంలో ప్రస్తావనకు వచ్చే ఆరాధన పద్ధతులకు, దేవతామూర్తులకు బొత్తిగా ఎటువంటి సంబంధమూ లేదు. ఇళ్లల్లో స్త్రీ మూర్తులను పూజించిన దాఖలాలు ఉన్నాయి. మట్టితో చేసిన దేవతల విగ్రహాలు (చూ.2.21) లభించాయి. ఎక్కడా పురుషమూర్తులను ఆరాధించిన దాఖలాలు లేవు. వేదకాలంలో విరివిగా ఆచరించిన జంతుబలులు వంటివి సింధు నాగరికత కాలంలో అమలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవు.

మరణించిన వారి దేహాలను ఖననం చేయడమే అన్నిప్రాంతాలలోనూ ఆచరించినట్టు దాఖలాలు ఉన్నాయి. దహనం చేసే ఆచారం లేదు. మరణానంతర జీవితంపై ప్రజలకి విశ్వాసాలుండేవి అనడానికి నిదర్శనంగా పాతిపెట్టిన దేహాల పక్కనే వారు వాడిన ఆభరణాలను, తిండి గింజలను ఉంచినట్టు తవ్వకాలు తెలియజేశాయి. ❃


## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# కార్యాచరణకు ముసాయిదా

(2వ పేజీ తరువాయి)

కార్యక్రమాలు శ్రామిక ప్రజలను సన్నద్ధులను చేస్తాయి. సమ్మెలను రాజకీయ సమ్మెలుగా మలిచేందుకు చైతన్యవంతులైన కార్మికులు, విప్లవకారులు సహకరిస్తే, అవి ప్రజలు స్వాతంత్ర్యం కోసం చేసే విప్లవ పోరాటాలను ఒక అడుగు ముందుకు నడిపించడానికి ఉపయోగ పడతాయి.

సామూహిక విప్లవ పోరాటాలు రూపొందించడానికి, రాజకీయంగా ప్రజలకు శిక్షణ ఇవ్వడానికి, ఈ కింది డిమాండ్ల సాధనకు పోరాటాలు చేయాలని భారతకమ్యూనిస్టు పార్టీ భావిస్తున్నది.

1. బ్రిటిష్ సైన్యాన్ని బహిష్కరించాలి.

2. రాజకీయ ఖైదీలందరిని తక్షణమే విడుదల చేయాలి.

3. శ్రామిక జనులకు పరిమితులు లేని వాక్స్వాతంత్ర్యం, సభా స్వతంత్ర్యం, సమ్మెలు చేసే హక్కు, సంఘాలు నిర్మించుకునే హక్కు ఉండాలి, ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక చట్టాలను (వాణిజ్య వివాదాల చట్టం, పికెటింగ్ చేయడాన్ని నిషేధించడం, విప్లవకారులను బహిష్కరించే చట్టాలు, ప్రెస్ చట్టాలు వగైరా)తొలగించాలి.

4. కులం, స్థాయి, దేశం, జాతి, సమూహాల ప్రత్యేక హక్కులను తొలగించాలి, లింగ, మత, జాతి బేధాలు లేకుండా పౌరులందరూ సమానంగా ఉండాలి.

5. రాజ్యం నుండి మతం పూర్తిగా విడివడి ఉండాలి.

6. న్యాయవాదులు, అధికారులు ఎన్నుకోబడాలి. వారినెన్నుకున్న ప్రజలలో ఎక్కువ మంది కోరుకుంటే ఎప్పుడయినా వారిని తిరిగి వెనక్కి పిలిపించే హక్కు ఉండాలి. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ కింది అంశాల గురించి పోరాడుతుంది.

1. కార్మికుల పనిదినం పెద్దలకు 8 గంటలు, 16 నుంచి 20 సంవత్సరాల లోపు యువకులకు 6 గంటలు ఉండాలి. బొగ్గు గనుల లాంటి హాని కలిగించే పరిశ్రమలలో కార్మికుల పనిదినం 6 గంటలే ఉండాలి. ఈ పరిశ్రమలలో పనిచేసే కార్మికుల పిల్లలకు పాలు, వెన్న ఇవ్వాలి.

2. ప్రదర్శనలు, పికెటింగులు, సమ్మెలు చేయడానికి కార్మిక సంఘాలకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి.

3. మహిళలకు, పురుషులకు, యువకులకు సమాన పనికి సమాన వేతనం ఉండాలి.

4. బలవంతపు కాంట్రాక్టు పని విధానం, కార్మికుల చేత నిర్బంధంగా పని చేయించడం నిర్మూలించాలి.

5. ప్రతి కార్మికునికి పూర్తి వేతనంతో కూడిన వారాంతపు సెలవు ఉండాలి. ఏడాదికి పెద్దలకు నాలుగు వారాలు, యువకులకు ఆరు వారాలు సెలవు తప్పనిసరిగా ఉండాలి.

6. నిరుద్యోగం, అనారోగ్యం, యాక్సిడెంట్లు, పరిశ్రమలకు సంబంధించిన వ్యాధులు, వృద్ధాప్యం, పనిచేసే శక్తి కోల్పోవడం, వైకల్యం, అనాథలవడం మొదలైన వాటికి బీమా తప్పనిసరిగా ఉండాలి.

“మన దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఉన్నందువలన, ఇప్పటికీ లక్షలాది మంది బానిసత్వంలో ఉన్నారు. కోట్లాది మంది అంటరానివారుగా ఉండి సామాజిక వెలివేతను అనుభవిస్తున్నారు. వీరికి ఏ హక్కులు లేవు. భూస్వామ్య వ్యవస్థ, ప్రగతి నిరోధక కులతత్వం, మతంపేర వంచన, దాస్య సంప్రదాయాలు భారత ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తూ, స్వేచ్ఛ వైపు అడుగేయకుండా అడ్డుకుంటున్నాయి. ఇవన్నీ 20వ శతాబ్దంలో కూడా భారతదేశంలో కొందరిని తమ తోటి వారితో సమానమైన ఏ హక్కులూ పొందలేని, కలిసి ఒకే బావిలోని నీరు కూడా తాగలేని, కలిసి ఒకే బడిలో చదువుకోలేని పరిస్థితిని కల్పిస్తున్నాయి.

“నిర్దాక్షిణ్యంగా కులతత్వాన్ని రూపుమాపక పోతే, వ్యవసాయ విప్లవం సాధించకపోతే, పోరాటాల ద్వారా బ్రిటిష్ వారిని పారదోలకపోతే, సంపూర్ణంగా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, చట్టబద్ధమైన స్వేచ్ఛ కార్మిక కట్టు బానిసలకు దక్కదు.” “బానిసత్వాన్ని సంపూర్ణంగా రూపుమాపేందుకు, కులవ్యవస్థను నిర్మూలించేందుకు, అన్ని రూపాలలో కుల అసమానతలను తొలగించేందుకు, ఈ దేశంలోని కార్మికులందరూ సంపూర్ణంగా సమాన హక్కులు కలిగి ఉండేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుంది.

“భారతదేశంలో శ్రామిక మహిళలు అర్ధ బానిసత్వాన్ని అనుభవిస్తున్నారు. భూస్వామ్య వ్యవస్థ పూర్తిగా నశించని కారణంగా ఆ బరువు, దానితో పాటుగా ఆర్థిక, సాంస్కృతిక, చట్టపరమైన అసమానత్వం, శ్రామిక మహిళను తన భవిష్యత్తు నిర్ణయించుకొనే హక్కులేకుండా చేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో పరదాల వెనకే వారి జీవనం గడిచిపోతున్నది. ప్రజలకు సంబంధించిన ఏ అంశంలోనూ వారు భాగస్వాములు కాలేరు. అంతేకాదు కనీసం



పి.సి. జోషి

వారి తోటి పౌరులతో కూడా వీధులలో స్వేచ్ఛగా తిరగలేరు. కలుసుకోలేరు.


“మహిళల సామాజిక, ఆర్థిక, చట్టపరమైన సమానత్వం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుంది. మహిళలచే రాత్రి పనిచేయించడాన్ని, గనులలో పనిచేయించడాన్ని, వారికి హానికరమైన పనులు కేటాయించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది.

“శ్రామిక మహిళలకు ప్రసూతికి ముందు రెండు నెలలు, తరువాత రెండు నెలలు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని, విద్యార్థులకు 16 సంవత్సరాల వరకు మాతృభాషలో ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుంది. పిల్లలకు ఆహారం, వస్త్రాలు, పాఠ్య పుస్తకాలు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని పోరాడుతుంది. ప్రభుత్వం, యాజమాన్యం వృత్తి విద్యలలో యువకులకు ప్రవేశాన్ని కల్పించాలని పోరాడుతుంది.

సరైన కార్యక్రమాన్ని ప్రతిపాదించినప్పటికీ, ఈ పత్రంలో కొన్ని పొరపాట్లు, తప్పుడు అవగాహనలు ఉన్నాయి. కష్టజీవులందరితో సామ్రాజ్యవాదానికి, భూస్వాములకు, వడ్డీ వ్యాపారులకు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా ఐక్యవేదికను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చింది. అంటే సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్యవేదికను సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి, పెట్టుబడిదారి విధానానికి వ్యతిరేక వేదిక వైపుకు మళ్లించిందన్నమాట. ఈ అవగాహనతోనే సోవియట్ అధికారాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. 1934లో కార్యక్రమ పత్రాన్ని ఆమోదించే సమయంలో ఈ తప్పులను సరిచేసుకున్నారు.

కాని బి టి ఆర్ అన్నట్టు “అన్ని తరగతుల సమస్యలను పరిగణనలోనికి తీసుకుని, తక్షణ విప్లవపోరాట అవసరాలను దృష్టిలో పెట్టుకుని

ఒక విప్లవాత్మక ప్రకటన చేయడం భారతదేశం అంతకు మునుపెన్నడూ చూడలేదు."



సోహన్‌సింగ్ జోష్

**మీరట్ కుట్రకేసు నిందితుల ఉమ్మడి ప్రకటన**

మీరట్ కుట్రకేసు నిందితులలోని పద్దెనిమిది మంది కమ్యూనిస్టులు తాము ఏ సిద్ధాంతం కోసం పోరాడుతున్నామో వివరిస్తూ కోర్టుకు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. 400 పేజీలకు పైగా ఉన్న ఈ ప్రకటనని ఆర్ ఎస్ నింబకర్, 1931 డిసెంబర్ 2 న అధికారికంగా ప్రవేశ పెట్టడం మొదలు పెట్టి, 1932 జనవరి 18వ తేదీన పూర్తిచేశారు. ఆ సమయంలో ఎస్ఎ డాంగే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు కానందువలన, ఆయన ప్రత్యేకంగా వేరే ప్రకటనను ఇచ్చారు. (ఆయన క్రమశిక్షణా రాహిత్యానికి పార్టీ నుండి సస్పెండ్ చేయబడిఉన్నారు) నిందితులు సమర్పించిన ఈ ఉమ్మడి ప్రకటన, దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆలోచనలను వివరంగా తెలియచేసిన మొట్ట మొదటి పత్రం. ఇది వారి ఆలోచనలలోని దూరదృష్టిని తెలియచేసింది. ఈ ఉమ్మడి ప్రకటనలో కొన్ని భాగాలు క్రింద ఇస్తున్నాం.

‘‘బ్రిటీష్ పెట్టుబడిదారీ విధానం భారతదేశంలో ప్రవేశించినప్పుడు, అది దేశంలో అప్పుడున్న భూస్వామ్య వ్యవస్థకన్నా అభివృద్ధి చెందిన ఒక సామాజిక వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించింది. అందువలనే భారతదేశంలో దాని కార్యక్రమాలలో కొన్ని ప్రగతిశీల లక్షణాలు కనిపించాయి. బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి సంబంధించిన కొన్ని నిర్మాణాత్మక, కొన్ని వినాశకర చర్యలు తీసుకొంది. అప్పటికే కాలం చెల్లిన, సామాజిక, సాంస్కృతిక పురోగతికి అడ్డంకిగా ఉన్న ఫ్యూడలిజం అవశేషాలలో ఎక్కువ భాగాన్ని కొనసాగిస్తూ, మరింత బలోపేతం చేసింది.

ఫలితంగా ఆ విధానాలు ఇప్పుడు పూర్తిగా ప్రగతి నిరోధకంగా తయారయ్యాయి. ఇవి పరిశ్రమలు, వ్యవసాయం రెండింటికి సంబంధించిన ఉత్పాదక శక్తుల పురోగతికి సంకెళ్లుగా మారాయి. ఈ విధానాలు ప్రజల సామాజిక, సాంస్కృతిక జీవనానికి ఆటంకంగా ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే చైతన్య పూరితంగానే ఈ ప్రగతినిరోధక, ప్రతిఘాత భావాలను కొనసాగించారు.

“భారతదేశంలో విప్లవం వచ్చే అవకాశం ఉంది – త్వరలో లేదా సమీప భవిష్యత్తులో రావచ్చు. అయితే ఈ విప్లవ స్వభావం ఎలా ఉంటుందో తెలుసుకోడానికి ఈ క్రింది ప్రధాన అంశాలను అర్థం చేసుకోవాలి:

1. ‘‘దేశం జాతీయ స్వాతంత్ర్యాన్ని పొందుతుందని చాలా స్పష్టంగా చెప్పవచ్చు. బ్రిటిష్ పాలనని అంతంచేసి, రాజకీయ స్వాతంత్రం, పూర్తి స్వతంత్రం గల – ఆర్థిక స్వాతంత్రం, విదేశీ అప్పులను స్వాధీనం చేసుకోగలగడం వగైరా – జాతీయ రాజ్యంగా ఏర్పడాలి. అప్పుడే భారతదేశంపై జరుగుతన్న ఈ విధ్వంసకర దోపిడీని అడ్డుకోగలం. ఉత్పాదక శక్తుల పురోగతికి బాటలు వేయగలం.

2. “భూమి(భూస్వామ్యం)కి సంబంధించి, దేశంలోని అన్ని భూస్వామ్య, అర్ధ భూస్వామ్య వ్యవస్థలు (భారత దేశంలోని రాష్ట్రాలలో) పూర్తిగా రద్దు చేయబడతాయి. మన అంచనాలో ఇవి సామ్రాజ్యవాద దోపిడీ వ్యవస్థలో భాగం, ఆ వ్యవస్థ రద్దుకాగానే ఇవి కూడా రద్దు కావాలి. అంతేకాదు అవి వ్యవసాయం, గ్రామీణ జనాభా యొక్క పురోగతికి అడ్డంకిగా కూడా ఉన్నాయి, అందువలన వీటిని రద్దు చేసితీరాలి.

3. “విప్లవం ప్రజాదరణ పొందేదిగా ఉండాలి. ప్రస్తుతం భారతదేశం ఉన్న పరిస్థితులలో, ఇది ఒక దోపిడీ పాలకవర్గం స్థానంలో మరొక దోపిడీపాలక వర్గాన్ని నిలపడానికి మాత్రమే పరిమితం కాకూడదు. ఇది ప్రజాస్వామ్య పాలనను అందించాలి. ప్రజలకు నిత్యం అవసరమైన పారిశుధ్యం, ఆరోగ్యం, గృహ నిర్మాణం, విద్య, ఇతర సాంఘిక, సాంస్కృతిక అంశాల పురోగతి తదితరాలు ప్రజలకు అందేటట్లు చూడాలి.

4. ‘‘సంక్షిప్తంగా చెప్పాలంటే, భారతదేశంలో విప్లవం ఒక వలస దేశంలోని పరిస్థితులకు అనుగుణంగా, బూర్జువా ప్రజాస్వామ్య విప్లవ స్వభావం కలిగి ఉంటుంది”. విప్లవానికి ఎవరు నాయకత్వం వహిస్తారో వివరిస్తూ, ప్రకటనలో ఇలా ఉంది: “విప్లవం తెచ్చేది కార్మికవర్గం. రైతులు, పెట్టీ బూర్జువావర్గం దీనికి మద్దతునిస్తుంది. బూర్జువావర్గం విప్లవాన్ని అనివార్యంగా వ్యతిరేకిస్తుంది”.


ప్రస్తుత దశను వారు సోషలిస్టు విప్లవం కాదని ఎందుకంటున్నారో, బూర్జువా ప్రజాస్వామ్య విప్లవంగా ఎందుకు భావిస్తున్నారో ప్రకటన మరింత స్పష్టంగా వివరించింది. బూర్జువా ప్రజాస్వామ్య విప్లవ దశలో కమ్యూనిస్టులు ఏమి సాధించాలనుకుంటున్నారో పేర్కొన్నారు. ఇది స్వభావరీత్యా బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం అవుతుంది, అదే సమయంలో సామ్రాజ్యవాద పాలన నుండి స్వాతంత్ర్యం సాధించి, బూర్జువా నియంతృత్వం కాకుండా ప్రజల పాలనను స్థాపిస్తుంది. ప్రస్తుతం సామ్రాజ్యవాద బూర్జువాజీ అధీనంలో ఉన్న ఆర్థికాభివృద్ధి సాధనాలు – రవాణా వ్యవస్థ, రైల్వేలు, ఓడరేవులు, బ్యాంకులు, ఆర్థికసంస్థలు మొదలైనవి– జాతీయం చేయబడతాయి. విదేశీ అప్పులు, ఇతర ఒడంబడికలు రద్దు చేయబడతాయి. విప్లవానికి బూర్జువాజీ యొక్క అనివార్య శత్రుత్వాన్ని దృష్టిలో ఉంచుకుని, విదేశీ లేదా స్వదేశీ పెట్టుబడిదారుల నియంత్రణలో ఉన్న ప్రధాన పరిశ్రమలను పరిహారం చెల్లించకుండా జాతీయం చేయాలి.

అదే విధంగా విదేశీ వాణిజ్యం అంతా జాతీయం చేయబడుతుంది. చిన్న పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు, హస్తకళలు, చిన్న రిటైల్ వ్యాపారాలు మొదలైనవాటిని, కార్మికులను అతిగా దోచుకోకుండా, ప్రజలను మోసగించకుండా కఠినమైన నియంత్రణతో, వారి ప్రస్తుత యాజమాన్యాల ఆధీనంలో పనిచేయడానికి అనుమతించబడతాయి. కార్మికుల ప్రాథమిక డిమాండ్లు – చట్టబద్ధమైన కనీస వేతనం, 8 గంటల పనిదినం, వారంలో ఐదున్నర రోజుల పని, ఉపాధి కల్పన, వృద్ధాప్యం, అనారోగ్యం మొదలైన వాటికి ప్రత్యేక బీమా, సరైన పరిహారం మొదలైనవి ఖచ్చితంగా అమలు చేయబడతాయి. కార్మిక రక్షణచట్టాలు అమలు చేయబడతాయి. భూమి జాతీయం చేయబడుతుంది, భూస్వాములకు పరిహారం చెల్లించకుండా స్వాధీనం చేసుకుంటారు. నిజమైన సాగుదారులందరికీ భద్రత కల్పించబడుతుంది. భూమి ఉత్పాదకత ఆధారంగా ఆదాయాన్ని అంచనా వేస్తారు. ఆయా స్థాయిని బట్టి ఆదాయాలపై పన్నులు విధించబడతాయి. ఎక్కువ ఆదాయాలు కలవారు ఆ స్థాయిలో పన్నులు చెల్లించవలసి ఉంటుంది. వ్యవసాయ రుణాలు రద్దు చేయబడతాయి లేదా తగ్గించబడతాయి. వడ్డీ రేటు చట్టబద్ధంగా, సహేతుకమైన రేటుకి పరిమితం చేయబడుతుంది. ప్రభుత్వ రుణాలు అందుబాటులో ఉంచబడతాయి. ఇవన్నీ గ్రామ, జిల్లా రైతు మండల కౌన్సిల్స్ దిశానిర్దేశాల మేరకు జరుగుతాయి. విప్లవం సాధారణ బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం అయినందువలన,

వ్యవసాయ విప్లవం మొదటి అడుగు మాత్రమే పడుతుంది. వ్యవసాయ విప్లవం యొక్క రెండవ దశలో పేద రైతులు, వ్యవసాయ కూలీల నాయకత్వాన ధనిక పెట్టుబడిదారీ రైతుల భూమిని పంచడం సాధారణంగా జరగదు. అయినప్పటికీ కొన్ని పరిస్థితులలో,ప్రదేశాలలో వర్గశక్తుల సంబంధాలు తరువాతి దశకు చేరే అవకాశం ఉంది.

"ఒక ప్రజానుకూల కార్మిక, రైతుసైన్యం ఏర్పాటు చేయబడుతుంది. ప్రజలు ఆయుధాలు పట్టుకుని తిరగడంపై ఉన్న నిషేధం ఎత్తివేయబడుతుంది. విద్యలో త్వరితగతిన పురోగతిని సాధించేందుకు, సాధారణ పారిశుధ్యం, ఆరోగ్యం, గృహ నిర్మాణం, మహిళల విముక్తి, జనాభాలోని 'అణగారిన' తరగతుల, సాధారణ ప్రజల ఇతర కనీస సామాజిక అవసరాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోబడతాయి. సమాఖ్య వ్యవస్థ ద్వారా దేశంలోని వివిధ జాతుల, సమాజాల మధ్య సయోధ్య సాధించబడుతుంది. అన్ని ప్రాంతాల వారికీ, మైనారిటీలకు సాంస్కృతిక మరియు పరిపాలనా స్వయం ప్రతిపత్తి వారుకోరుకున్నంత కాలం ఇవ్వబడుతుంది. పరిశ్రమల అభివృద్ధి, దేశంలో కమ్యూనికేషన్ వ్యవస్థని అభివృద్ధి చేయడం, దాని సహజ వనరులను ప్రభుత్వ నియంత్రణలో అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇవే ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు హామీ ఇచ్చే ఏకైక మార్గంగా అమలులోకి వస్తాయి."

ఏర్పడబోయే రాజ్యం ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటుంది. ప్రతిఘాతుక విప్లవానికి మద్దతు ఇచ్చే వారు తప్ప మిగిలిన వారందరూ ఇందులో పాల్గొంటారు. దేశ చరిత్రలో తొలిసారిగా సంఘటితమవడానికి, చర్చలు జరపడానికి ప్రజలకు స్వేచ్ఛ ఉంటుంది. విప్లవంలో ప్రముఖపాత్ర పోషించిన, కార్మికులకు, రైతులకు సహజంగానే విధానపర నిర్ణయాలలో, అభివృద్ధి గమనంలో నిర్ణయాత్మకపాత్ర ఉంటుంది. అది 'కార్మికుల, రైతుల ప్రజాస్వామ్య నియంతృత్వం' అవుతుంది. సాధారణంగా మనమనుకునే విధంగా ఆ పార్లమెంటు ఉండదు. ఇటువంటి 'ప్రాతినిధ్యం' వహించే విధానం బూర్జువా ప్రయోజనాలను పునఃస్థాపితం చేయడానికి మాత్రమే దారితీస్తుంది. అందువల్ల అది ప్రతిఘాత విప్లవాన్ని పూర్తి చేస్తుంది. ప్రభుత్వ అంగాలైన కర్మాగారాల్లోని కార్మిక మండళ్లు, ఓడ రేవులు, గనులు, రైల్వే కేంద్రాలు మొదలైన వాటిలో పనిచేసే కార్మికులపై ఆధారపడి దేశనిర్మాణం ఉండాలి. గ్రామాల్లోని రైతులు, కార్మికవర్గం, గృహిణులు, చిన్న వ్యాపారులు, హస్తకళా కార్మికులు, అటువంటి అనేక ఇతర



అజయ్‌కుమార్ ఘోష్

వృత్తులలో పని చేసేవారితో, అనేక ప్రాంతాలలోని వృత్తులు చేసుకునే సమూహాల ద్వారా అభివృద్ధి జరగాలి.

"మహిళల సమస్యపై, ప్రకటన ఇలా చెప్పింది." మహిళల అణచివేత, దోపిడీ అనేది సామాజిక అణచివేత, దోపిడీలలో ఒకభాగం. పురుషులలో కూడా చాలా ఎక్కువ మంది దోపిడీకి గురవుతున్నారు. ఇది కేవలం లింగ ప్రాతిపదికనే కాక వర్గ ప్రాతిపదికన పరిష్కరించబడాలి. పార్టీ తన పనిలో, కార్మికవర్గ ఉద్యమంలో లింగ బేధాలు తొలగించి, సంపూర్ణ సమానత్వాన్ని నెలకొల్పాలి. ఈ విషయంలో కార్మిక వర్గంలో ఎటువంటి దురభిమానాలకు తావు లేకుండా చేయాలి. గృహిణులను కార్మికవర్గంగా గుర్తించాలి – వారు మానవజాతి పునరుత్పత్తి దారులు – అత్యంత ప్రాముఖ్యత గల అంశం ఇది. సమాజంలో వారి స్థానం మెరుగుపడటానికి వారు చేసే పోరాటాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా శ్రామిక మహిళలను సమీకరించాలి. వారిని పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడే కార్మికవర్గంలో క్రియాశీలురుగా తయారుచేయాలి. ముఖ్యంగా పురుష కార్మికుల సంఖ్యను తగ్గించే విధంగా మహిళా కార్మికులను వినియోగించుకోవటం ఉండరాదు. "

ఈ కర్తవ్యాలను అమలు చేయడానికి బలమైన, దృఢమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలని ప్రకటన పిలుపునిచ్చింది.

**అఖిల భారత కేంద్రం ఏర్పాటు**

1920 చివరి భాగంలో 1930లలోని మొదటి భాగంలో భారతదేశ, అంతర్జాతీయ పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉండేవి. పెట్టుబడిదారీ ప్రపంచాన్నంతటినీ చుట్టుముట్టిన మహామాంద్య ప్రభావం భారతదేశ ప్రజలపై కూడా తీవ్రంగా పడింది. ఇందుకు కారణం, బ్రిటిష్ సామ్రాజ్యవాదం తన దేశంపై పడ్డ మాంద్యం ప్రభావాన్ని భారతదేశ ప్రజలపైకి నెట్టేందుకు ప్రయత్నించడం. ఫలితంగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలలో కోపం, నిరసనలు మరింత ఎక్కువగా పెరిగిపోయాయి. మరింత విస్తృతమయాయి. బొంబాయి, షోలాపూర్ వస్త్ర పరిశ్రమలలో, కలకత్తా జౌళి పరిశ్రమలలో జరిగిన భారీ సమ్మెలు పెరిగిన కార్మికవర్గ ఆగ్రహానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1930–31 మధ్య కాలంలో సమ్మెలతో కోల్పోయిన పనిదినాల సంఖ్య ఉచ్ఛస్థితికి చేరుకుంది. అప్పుడప్పుడే కమ్యూనిస్టు పార్టీ రూపుదిద్దుకుంటుండడం, దాని నాయకులంతా మీరట్ కుట్రకేసు మోపబడి నిర్బంధంలో ఉండడం వలన ఈ సదవకాశాన్ని పార్టీ వినియోగించుకోలేక పోయింది. పైగా అప్పటికింకా సామ్రాజ్యవాద పోరాటంలో బూర్జువాజీ పాత్రపై అది సైద్ధాంతికంగా స్పష్టమైన అవగాహనకు రాలేదు.

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తొలిరోజుల్లో ఎం ఎన్ రాయ్ పార్టీని కూడగట్టేందుకు ఎంతో సహకరించారు. అయితే కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నుంచి ఎం ఎన్ రాయ్ బహిష్కరించబడిన తరువాత భారతదేశంలోని కొన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఎం ఎన్ రాయ్, ట్రాట్స్కీలకి మద్దత్తు ఇస్తూ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకత్వానికి వ్యతిరేకంగా పనిచేశారు. వీరు పార్టీ ముందుకు కొన్ని సమస్యలు తీసుకొచ్చారు..

భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం చేయడానికి, పార్టీలో ఐక్యతను కాపాడడానికి అవసరమైన మౌలిక మార్పును చేసేందుకు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కొంత ప్రయత్నం చేసింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రతినిధులు చాలాసార్లు భారతదేశానికి వచ్చారు. భారతదేశంలోని కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలు పెట్టుకున్నారు. ఇక్కడి పరిస్థితులపై వారి అవగాహన మేరకు సలహాలు ఇచ్చారు. మీరట్ కుట్రకేసు ప్రభావం పార్టీ నిర్మాణంపై బాగా పడింది. తదనంతరం వేగంగా మారుతున్న జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా నాయకత్వం సమయోచిత నిర్ణయాలు తీసుకోలేక పోయింది.

1920లలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడినప్పటికీ ఆ దశాబ్దం అంతా కేంద్రంలో స్థిరమైన నాయకత్వం లేకుండానే పనిచేయవలసి వచ్చింది. కమ్యూనిస్టు పార్టీకి సభ్యులున్నమాట నిజం. వారందరు సంఘ నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొంటున్నదీ నిజమే. కానీ వారి ముఖ్యమైన కార్యక్రమాలన్నీ, ముఖ్యంగా 1920 రెండో భాగంలో వర్కర్స్ అండ్ పెజెంట్స్

పార్టీ ద్వారానే జరిగాయి. ఇందులో కమ్యూనిస్టులు కాని వారు అనేకులు తమ వంతు పాత్రను పోషిస్తూవచ్చారు. ఆ నాడు పార్టీ నాయకత్వం ఏ క్షణంలో అయినా దాడులు జరగవచ్చన్న స్పృహలో లేదు. అందువలన రహస్యంగా పనిచేసే సంఘాలను ఎలా నిర్మించుకోవాలనే అవగాహనలో లేదు. ఫలితంగా కమ్యూనిస్టులు, వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ నాయకులపై దాడులు జరగగానే పార్టీ నిర్మాణం పూర్తిగా దెబ్బతింది.

కమ్యూనిస్టులు ఒక కేంద్రం ఏర్పరచుకుని బహిరంగంగా పనిచేయాలనుకుంటున్న సమయంలోనే మీరట్ కుట్ర కేసు మోపబడింది. 1928 డిసెంబర్ 27, 28 తేదీలలో కలకత్తాలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఈ విషయం చర్చించబడింది. అయితే ఏ చర్యా తీసుకోక మునుపే, ఒక నిర్దిష్టమైన నిర్ణయానికి కూడా రాకమునుపే, అన్ని స్థాయిలలోని నాయకులూ ఖైదు చేయబడ్డారు. దీనితో కమ్యూనిస్టు కార్యకలాపాలు జరిగే ప్రధాన కేంద్రాలలో నిర్మాణరీత్యా లోటు ఏర్పడింది.

బెంగాల్లో కేవలం అబ్దుల్ హలీమ్ అనే ప్రముఖ నాయకుడు మాత్రమే పోలీసుల అరెస్టును తప్పించుకున్నారు. మద్రాసులో పద్దెనిమిది నెలల జైలు జీవితం తరువాత 1930 ఆగస్టులో సింగారవేలు చెట్టియార్ విడుదలయ్యారు. ఆ తరువాత ఆయన పెరియార్ స్థాపించిన ఆత్మగౌరవ ఉద్యమంలో చేరి అందులో వామపక్ష భావాల ప్రభావాన్ని పెంచడానికి సహకరించారు. 1932లో తన అరెస్టుకి ముందు ఆయన కమ్యూనిస్టు ఉద్యమాన్ని, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మిస్తుండిన అమీర్ హైదర్ఖాన్తో సంబంధాలు కలిగి ఉన్నారు. కాన్పూర్లో పనిచేయగలవారు ఎవరూ మిగలలేదు. లాహోర్లో కూడా సెహగల్, మజీద్లు లేని లోపాన్ని పూడ్చడానికి ఎవరూ లేరు. బొంబాయిలో ఎస్ వి దేశ్పాండే, బి టి రణదివే కార్మిక సంఘాల్లో చురుకుగా పాల్గొని శూన్యాన్ని పూరించే ప్రయత్నం చేసారు.

కమ్యూనిస్టు గ్రూపులు వేటికవి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఒక సైద్ధాంతిక అవగాహన గాని, కనీసం ఒకే రకమైన సంఘ నిర్మాణం గాని లేదు. ఈ కార్యక్రమాలన్నిటికి నాయకత్వం వహించగల నిర్మాణం కేంద్రంలో లేదు. వేర్వేరు కమ్యూనిస్టు గ్రూపుల మధ్యలో సంబంధాలు లేకుండా పోయాయి. మీరట్ కుట్ర కేసు మొదలయిన నాటి నుండి నాలుగున్నర సంవత్సరాల కాలం జైలు వెలుపలనున్న కమ్యూనిస్టుల మధ్య అభిప్రాయ బేధాలతో, గ్రూపు తగాదాలతో గడిచిపోయింది.

మీరట్ కుట్రకేసులో అరెస్టులు జరిగిన తరువాత అఖిల భారత కేంద్రాన్ని నిర్మించడమే పెద్ద సవాలు. 1933లో మీరట్ కుట్ర కేసు నిందితులు విడుదల అయేంత వరకు ఈ ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వలేదు. 1933లో బెయిల్పై వచ్చిన డాక్టర్ అధికారి భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న మార్క్సిస్టు లెనినిస్టు గ్రూపులను ఏకం చేయడంలో, పార్టీని పునర్నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు.

మీరట్ కుట్రకేసు నిందితులు విడుదలైన తరువాత తెగిపోయిన సంబంధాలన్నీ తిరిగి ఏర్పడడమే కాక కొత్తగా ఎంతోమంది వ్యక్తులు, సంస్థలు పార్టీ వైపుకు ఆకర్షితులయ్యారు. ఇది వరకు జాతీయ విప్లవవాదులుగా ఉన్నవారు, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సాధారణ సభ్యులు జైలు నుండి బయటకి వచ్చేసరికి గాంధీ పోరాట విధానంలోని డొల్లతనాన్ని అర్థం చేసుకున్నారు. సోషలిజం, కమ్యూనిజం వైపుకు స్వాతంత్రోద్యమాన్ని నడిపించవలసిన అవసరాన్ని గుర్తించారు. సోవియట్ యూనియన్ ఎదుగుదల, ఫాసిజం పెరిగిపోవడం కాంగ్రెస్ నాయకులను, సామాన్య ప్రజానీకాన్ని కమ్యూనిజం వైపుకు ఆకర్షించాయి. సోషలిజం, కమ్యూనిస్టు సిద్ధాంతాలు పెరుగుతున్న ఇటువంటి అనుకూల దశలో నిరంతరంగా పనిచేసే భారత కమ్యూనిస్టు కేంద్ర నాయకత్వం ఏర్పడింది.

అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభ 1931 డిసెంబర్లో కలకత్తాలో జరిగింది. డాక్టర్ అధికారి, అబ్దుల్ హలీమ్, సోమనాథ్ లాహిరి, డాక్టర్ తాన్ సేన్(బెంగాల్), పి సి జోషి, (కాన్పూర్) ఎస్ జి పాఠక్, గురుదీప్ సింగ్ (పంజాబ్) ఈ సమావేశాలలో మాట్లాడారు. ఈ సమావేశాలు ముఖ్యమైనవిగా పరిగణించడానికి మూడు కారణాలు ఉన్నాయి. 1. భారత కమ్యూనిస్టు పార్టీ యొక్క తాత్కాలిక కేంద్ర కమిటీ ఎన్నికయింది. 2. ముసాయిదా నిబంధనావళి ఆమోదించబడింది. 3. రాజకీయ సైద్ధాంతిక ముసాయిదా ఆమోదించబడింది. డాక్టర్ అధికారి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ప్రాంతీయ కమిటీలను వీలయినంత త్వరగా పునర్నిర్మించాలని నిర్ణయించడం జరిగింది.

కేంద్రకమిటీ, పొలిట్బ్యూరోల నిర్మాణంతో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ పత్రాలు కమ్యూనిస్టులకు, వామపక్షవాదులకు అందించడం సులువయింది. రాజకీయ పరిస్థితులపై భారత కమ్యూనిస్టు పార్టీ అభిప్రాయాలను, విధానాలను తెలియచేస్తూ పత్రాలను తయారుచేసి, ప్రజలకు అందుబాటులో ఉంచడానికి వీలయింది. కార్మికసంఘాల నిర్మాణం, ఇతర వామపక్ష సంస్థలతో సంబంధాలు పెట్టుకోవడం సాధ్యమయాయి.

భారత కమ్యూనిస్టు పార్టీ తాత్కాలిక కేంద్ర కమిటీ ఒక కేంద్రీకృత, క్రమశిక్షణ, ఐక్యమత్యం గల, రహస్యంగా పనిచేయగల, ప్రజాదరణ గల కమ్యూనిస్టు పార్టీ నిర్మాణమే తన మౌలిక లక్ష్యంగా చెప్పుకుంది. భారతదేశంలో విప్లవాన్ని సాధించే చారిత్రక కర్తవ్యాన్ని పూర్తి చేయడం కోసం నిర్మించబడుతున్న కమ్యూనిస్టు పార్టీలోని అన్ని స్థాయిలలోనూ, కార్మికవర్గ శ్రేయస్సు కోసం పనిచేయడానికి నిశ్చయించుకున్న అభివృద్ధి కాముక కార్మికులు, విప్లవకారులు భాగస్వాములు కావాలని కేంద్ర కమిటీ పిలుపు నిచ్చింది.

తాత్కాలిక కేంద్ర కమిటీ ఆమోదించిన సైద్ధాంతిక పత్రం ఆధారంగా భారత కమ్యూనిస్టు పార్టీ కొమిన్టర్న్కి అనుబంధం చేయబడింది. దీనితో భారత కమ్యూనిస్టు ఉద్యమం, పార్టీ ఒక నూతన పథంలోకి అడుగుపెట్టినట్లయింది.

కలకత్తాలో జరిగిన సమావేశాన్ని, అందులో తీసుకున్న నిర్ణయాలను కొమిన్టర్న్ గుర్తించింది. వాటిని 1934లో తన అధికార పత్రిక ఐ ఎన్ పి ఆర్ ఇ సి ఓ ఆర్లో – రాజకీయ సైద్ధాంతిక ముసాయిదా, తాత్కాలిక నిబంధనావళి – ప్రచురించింది. కొత్తగా ఎన్నికయిన కేంద్ర నాయకత్వం కొమిన్టర్న్ సలహాల చట్రంలోనే పనిచేయడం, భారతదేశ పరిస్థితులను అంచనా వేయడం ప్రారంభించింది. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు శరవేగంగా మారుతున్న నేపథ్యంలో ఇదేమంత సులువైన విషయం కాదు.

కొందరు వ్యక్తులు మారినప్పటికీ 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయే వరకు ఈ ఎన్నికయిన కేంద్రకమిటీ కొనసాగుతూనే వచ్చింది. అంతకు ముందు తీసుకున్న కొన్ని చర్యలు నిష్ఫలమైనా, 1933–34లో ఏర్పడ్డ పార్టీ కేంద్రకమిటీ విజయవంతంగానే కొనసాగింది. ఒక దశాబ్దం పాటు సాగిన అణచివేత చర్యలను ఎదుర్కొంటూ 1934 నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ క్రియాశీలంగా పనిచేయడం ప్రారంభించింది. 1934లో పెరిగిన సమ్మెలు, సమ్మెల వలన కోల్పోయిన పనిదినాలే పార్టీ క్రియాశీలంగా పనిచేయడానికి నిదర్శనం (1932, 33 కన్నా ఇవి 1934లో రెట్టింపు అయ్యాయి). ఇవి ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని కూడా తెలియచేసాయి.


సామ్రాజ్యవాద పాలనకు, సామ్రాజ్యవాద వ్యతిరేక వేదికలలో పోరాటం చేస్తున్న బూర్జువా నాయకత్వానికి ఎదురౌతున్న సవాలును మొగ్గలోనే తుంచేయాలని పాలకులు నిర్ణయించుకున్నారు. అందువలననే కాంగ్రెస్పై నిషేధాన్ని ఎత్తివేసిన బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూస్టు పార్టీని నిషేధించాలని నిర్ణయించింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

❋

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-03-2020 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20

# దోపిడీలేని సమాజమే విప్లవ లక్ష్యం



– బిపన్‌చంద్ర

"విప్లవం' నిర్వచనాన్ని విస్తృతం చేసినవారు భగత్‌సింగ్, ఆయన సహచరులు. విప్లవం అన్నది హింసకూ, తీవ్రవాదానికీ సమానమైనది కాదు. దాని తొలి లక్ష్యం దేశానికి స్వేచ్ఛ ప్రసాదించడం– సామ్రాజ్యవాదాన్ని కూలదోయడం. అయితే అది అక్కడితో ఆగిపోదు. మరింత ముందుకు ప్రయాణించి ఒక నూతన సామ్యవాద సామాజిక క్రమాన్ని ఆవిష్కరించవలసి ఉంది. మనిషిని మనిషి దోచుకునే స్థితిని అంతం చేయాలి. భగవతీచరణ్ వోహ్రా, చంద్రశేఖర ఆజాద్, యశ్‌పాల్ రచించిన 'ది ఫిలాసఫీ ఆఫ్ ది బాంబ్' విప్లవాన్ని 'రాజకీయ, ఆర్థిక దోపిడీ ఏమాత్రం సాధ్యంకాని ఒక నూతన సామాజిక క్రమాన్ని ఆవిష్కరించ'డానికి ఉద్దేశించిన 'సామాజిక, రాజకీయ, ఆర్థిక, స్వాతంత్ర్య' అంశంగా నిర్వచించింది. అసెంబ్లీ బాంబు కేసులో భగత్‌సింగ్ న్యాయస్థానంలో ఇలా వ్యాఖ్యానించారు. 'విప్లవం అంటే అన్ని సందర్భాల్లోనూ రక్తంతో తడిసిముద్దయ్యే పోరాటాలే కానక్కరలేదు. అది బాంబులు, తుపాకుల మతం కాదు. అన్యాయం, అసమానత్వం ఆధారంగా ఏర్పడిన ప్రస్తుత సామాజిక విధానాలను సమూలంగా మార్చడమే 'విప్లవం'. భగత్‌సింగ్ జైలునుంచి రాసిన ఒక లేఖలో 'రైతులు విదేశీశక్తుల నుంచి మాత్రమే కాదు, భూస్వాములూ, పెట్టుబడిదారుల చెర నుంచి కూడా విముక్తి సాధించాలి' అని సూచించారు. , సామాన్యుల శ్రమను కొద్దిమంది దోపిడిదారులు దోచుకున్నంత కాలం భారతదేశంలో పోరాటం కొనసాగుతుందని'1931 మార్చి 3వతేదీన ఇచ్చిన అంతిమ సందేశంలో పేర్కొన్నాడు. ఆ దోపిడిదారులు నూటికి నూరుపాళ్ళు బ్రిటిష్ పెట్టుబడిదార్లా లేక బ్రిటిష్–భారత పెట్టుబడిదారుల కూటమా, లేక పదహారణాల దేశీయ పెట్టుబడిదారులా అన్నదానితో నిమిత్తం లేదు' అని ఆయన ప్రకటించారు. సామ్యవాదాన్ని ఆయన సశాస్త్రీయంగా నిర్వచిస్తూ, పెట్టుబడిదారీ విధానాన్నీ, వర్గాధిపత్యాన్నీ నిర్మూలించనిదే సామ్యవాద స్థాపన అసాధ్యమని వ్యాఖ్యానించాడు. మార్క్సిజాన్నీ, వర్గ దృక్పథాన్ని ఆయన పూర్తిగా ఆమోదించాడు. వాస్తవానికి ఆయన తనను తాను విప్లవానికి దోహదం చేస్తున్నవాడుగానే భావించాడు కానీ సృష్టికర్తననుకోలేదు. సోషలిజం, కమ్యూనిజం ఆదర్శాల ప్రచారకుడుగా, భారతదేశంలో సామ్యవాద ఉద్యమానికి నాంది పలికిన వ్యక్తిగా ఆయన తనను తాను భావించారు.

"భగత్‌సింగ్ ఎంతో ముందుచూపున్న మహోన్నతుడు. నికార్సయిన లౌకికవాది. జాతీయోద్యమానికీ, దేశానికీ మతతత్వం తెచ్చిపెట్టబోతున్న పెను ప్రమాదాన్ని ఆయన తన సమకాలికుల కంటే ముందుగానే ఊహించాడు. మతతత్వం వలసపాలన అంతటి ప్రమాదకరమైనదని ఆయన పలుమార్లు పలువేదికల నుంచి హెచ్చరించాడు.

"1928 ఏప్రిల్‌లో నవజవాన్ భారత్ సభ పునర్వ్యవస్థీకరణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో, మతసంఘాల్లోనూ,మతతత్వ సంస్థల్లోనూ సభ్యులుగా ఉన్న యువకులను కూడా సంస్థలో సభ్యులుగా చేర్చుకోవాలన్న ప్రతిపాదనను భగత్‌సింగ్, ఆయన కామ్రేడ్లు బహిరంగంగా తిరస్కరించారు. మతం–వ్యక్తిగతం. మతతత్వం–మన శత్రువు అని ఆయన స్పష్టం చేశాడు. అంతకు ముందు–అంటే, 1927లో ఆయన మతపరమైన హత్యాకాండలను అమానుషమైనవిగా అభివర్ణించారు. మతవిద్వేషంతో రగిలిపోతున్న హంతకులు ఎదుటివాడు వ్యక్తిగతంగా ఏదో నేరం చేసినందుకు చంపడంలేదనీ, వాడు హిందూ లేదా ముస్లిం లేదా సిక్కు కావడం వల్లే చంపుతున్నారనీ ఆయన వ్యాఖ్యానించారు. మతానికి అతీతంగా వ్యవహరించే కొత్తతరం యువత రాబోతున్నదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రతివ్యక్తినీ ముందుగా మానవుడుగా, ఆ తరువాత భారతీయుడుగా ఆయన గుర్తించాడు.

"మతం, మూఢవిశ్వాసాల బందిఖానా నుంచి ప్రజలను విముక్తిచేయాల్సిన అవసరాన్ని భగత్‌సింగ్ గుర్తించాడు. తన మరణానికి కొద్దివారాల ముందు ఆయన 'నేనెందుకు నాస్తికుడ నయ్యాను?' అనే వ్యాసంరాశారు. అందులో ఆయన మతాన్నీ, దాని తత్వాన్నీ తీవ్రంగా విమర్శించారు. నాస్తికతకు దారి తీసిన తన గమనాన్ని ఆయన అందులో వివరించారు. సిక్కుమతం, ఇతర మతాల పురాణాల పట్లా, అవి ప్రబోధించే మార్గం పట్లా తాను తొలిసారి ఏ విధంగా విశ్వాసాన్ని కోల్పోయిందీ, అంతిమంగా దేవుడి అస్తిత్వంపైనే నమ్మకం ఎలా వదులుకున్నదీ ఆయన అందులో వివరించారు. విప్లవకారుడు కావాలనుకున్న వ్యక్తికి నైతికబలం హెచ్చుస్థాయిలో ఉండాలి, దానితో పాటుగా విమర్శనాత్మకంగా, స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఉండాలని ఆయన వివరించారు. దేవుడి మీద విశ్వాసాన్నీ, మతమనే ఇరుకుభావననూ అధిగమించినప్పుడే మానవజాతి తనను తాను ఉద్ధరించుకోగలుగుతుందని ఆయన బోధించాడు. 'అభివృద్ధి పథంలో సాగదల్చుకున్న ప్రతివ్యక్తీ గతకాలపు విశ్వాసాల్లోని ప్రతి అంశానికీ ఎదురొడ్డాలి. ప్రతి ఒక్కదానినీ విమర్శించాలి. నమ్మకాన్ని వదులుకోవాలి'. నిరీశ్వరవాదం మీదా, భౌతికవాదం మీద తనకున్న విశ్వాసాన్ని ఆ వ్యాసంలో పునరుద్ఘాటిస్తూ, 'కడదాకా నిటారుగా తలపైకెత్తి ఒక మనిషిగా నిలబడేందుకు ప్రయత్నిస్తున్నాను–చివరకు ఉరికంబం మీద కూడా' అని ఆయన ఉద్ఘాటించారు".

**(బిపన్‌చంద్ర రచించిన "భగత్‌సింగ్, సూర్యసేన్ ఇతర విప్లవకారులు" అన్న వ్యాసంలోని కొన్ని భాగాలు)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.14, No.11. Published on March 1, 2020